ఆంధ్ర సచిత్ర వారపత్రిక
2-6-72
50 పైసలు



కార్టూన్ సీరియల్ ప్రారంభం!



డెట్

ఉతికే బిళ్ల
డెటర్జెంట్ శక్తితో నిండినది





డెట్ డెటర్జెంట్ ఉతికే బిళ్ల
సబ్బు కంటె 50%
ఎక్కువ బట్టలను ఎక్కువ
తెల్లగా ఉతుకుతుంది
—మంచి నీళ్లు లేక ఉప్పు నీళ్లతో

సిగరెట్లు త్రాగవద్దని అటుపెద్దలు, డాక్టర్లు చెబుతూనే ఉంటారు. కాని ఇటు ఎంతమంది ఆచరిస్తున్నారన్నది గమనించతగ్గ విషయం. అలాగే వారి అభిప్రాయాలు తెలిపినంతమాత్రాన వారు కూడా తప్పని సరిగా ఆ అభిప్రాయాలనే ఆచరించాలి అన్నది అవసరము లేదేమో అని అనుకోవాలి. ఈ రెండు విషయాలు గమనించి మరి వాటికి అంత ప్రాముఖ్యత ఇవ్వటం ఎంతవరకు సబబు?

మండవ కేశవరావు, (సంగారెడ్డి)

* * *

19—5—72 పత్రికలో రాయిగర్ నుంచి జోగిమహంతి సుధాకర్‌రావుగారు వ్రాసిన ఉత్తరం చదివితే మాకు చాలా ఆశ్చర్యం కలిగినది. ఆ ఉత్తరంలో సుధాకర్ రావుగారు, 'సిపాయి చిన్నయ్య', 'జైజవాన్' చిత్రాలను ఉత్తమ చిత్రాల జాబితాలో చేర్చినారు. ఆ చిత్రాలు దేశభక్తిగల చిత్రాలుగా వున్నాయి. కాని వాటిలో 'సెక్సు' డాన్సులుకూడా ఉన్నాయి. తెలుగు ప్రజలు ఎక్కువగా 'సెక్సు' చిత్రాలను ఆదరిస్తున్నారనే నేరం తెలుగుప్రజలపై మోపారు. ఈమధ్య వస్తున్న 'సెక్సు' చిత్రాలతో పోల్చి చూస్తే సాంఘిక చిత్రాలు బాగా విజయవంతమగుచున్నాయని మనకు తెలిసిందే (ఉదా:—తాసిల్దారుగారిఅమ్మాయి, అమ్మమాట, రైతుకుటుంబం, రైతుబిడ్డ, కలెక్టర్ జానకి మొదలగునవి)

బండారు పాండురంగేశ్వరరావు, మేకా కృష్ణమూర్తి, (కోరుకొల్లు.)

* * *

14—4—72 వార పత్రికలో 'ఉత్తరాలు' శీర్షికలో శాంతి ప్రియ (గుంటూరు) గారు

ఉత్తరాలు

విజయవాడ సోదరులు శ్రీ నాగేశ్వరరావు గారి ప్రసంగంపై చేసిన వ్యాఖ్యానాన్ని పక్షపాతబుద్ధితో కూడినదని చిత్రించడం చూసిన తరువాత ఈ ఉత్తరం రాయకుండా ఉండలేకున్నాను.

శాంతిప్రియగారు ఉదహరించిన నటులు నాకు తెలిసినంతవరకూ వరకట్నం తీసుకోకూడదని ఎక్కడా ప్రసంగాలు చెయ్యలేదు, ఆచిత్రం తీయడం తప్ప. ఒక నిర్మాత చిత్రంద్వారా ఒక సందేశం మనకు అందిస్తున్నాడంటే అది వారు పాటిస్తున్నారని కాదు. కాని ఒక ప్రసంగం ఒకరు చేసారంటే అది వారు పాటిస్తున్నారనేగా!! అటువంటప్పుడు శాంతిప్రియ గారు విజయవాడ సోదరుల నుద్దేశించి, అది పక్షపాత వైఖరితో కూడినదని వ్రాయడం మిక్కిలి గర్హించదగ్గ విషయం, శోచనీయము కూడా!

వోరుగంటి త్రినాధ్, (చిలకపాడు.)

* * *

ఆయా నటులు నటించేది కేవలము నటనేనని వారుచెప్పేది ప్రతిఒక్క ప్రేక్షకుడు అర్థము చేసుకుంటారని ఆశిస్తాను.

కరణం నాగేశ్వరరావు, (యలమంచిలి.)

* ఇంతటితో ఈ విషయంపై ఉత్తర ప్రత్యుత్తరాలు ఆపివేస్తున్నాము. —సం॥

అవీ — ఇవీ

బ్రిటిష్ సామ్రాజ్యాధిపతి తమ విధేయులక్కు యిచ్చే 'లార్డు', 'లేడీ' లాంటి బిరుదులు పోషలిస్టుదేశపు ప్రథమ మహిళ తనకు తానై తగిలించుకోడం అబ్బురమే, మరి!

ఉదయ్, (కాకినాడ)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 2-6-72

(శ్రీవిరోధికృన్నామ సం॥ విజ్యేష్ఠ బహుళ॥ బ॥ పంచమి

సంపుటము : 65 సంచిక : 41


స్థాపితము:
1908

సంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు - 1

విడిప్రతి వెల 50 పైసలు

విషయానుక్రమణిక


ఆం. ప్ర. భూములు
ఆంధ్రప్రదేశ్‌లో అన్యాక్రాంతాలని నిషేధిస్తూ ఆర్డినెన్స్
వ్యవసాయపు పనులకి ప్రతిబంధకం
అది కుస్తీ పోటీ కాదు. పరిమితుల విషయంలో వారు తమ భేదాభిప్రాయాలని గురించి వాదించుకుంటున్నారు
పాక్ ఆర్థికవ్యవస్థ
వారి విభేదాలకన్నా శాంతి ముఖ్యం
అమెరికా
రష్యా
దక్షిణ వియత్నాం
ఉత్తర వియత్నాం

భూకమతాల పరిమిత చట్టం

మల్లాది సూరిబాబు

'సస్యశ్యామల దేశం వినా నిత్యం క్షామం' అని చెప్పిన కవివాక్కు మన దేశం విషయంలో అక్షరాల నిజం. స్వతంత్ర భారతదేశం యీ ఇరవైఅయిదు సంవత్సరాలలో అనేక సమస్యలు పరిష్కరించి ప్రగతిని సాధించినా — ఆహార సమస్యమాత్రం సమస్యగానే మిగిలిపోయింది. వెనుకబడిన దేశాలలో ఆహార ఉత్పత్తిని గురించి ప్రత్యేక సర్వే జరిపిన అమెరికన్ శాస్త్రజ్ఞుడు చెప్పిన మాట.

'ఆసియాలో మరి ఎందరో మరి ఎంతోకాలం కృషిచేసి మరీ కొంచమే ఉత్పత్తి చెయ్యటం పెద్ద విషాదకరమయిన విషయం —'

ఆర్థసామాజిక వ్యవస్థలో వ్యవసాయదారులు మొత్తం జనాభాలో నాలుగోవంతు మాత్రమే. బ్రిటీషు హయాములో దేశ వృత్తులకు పరిశ్రమలకు ప్రోత్సాహం లభించక తరతరాలుగా వస్తున్న వృత్తులు నశించి, ఇంకొక వృత్తి చేతకాక పల్లె ప్రజలు వ్యవసాయదారులుగానో కూలీలుగానో మారిన ఉదంతం చరిత్ర చెబుతోంది. ఈనాడు భారతీయులు నూటికి తొంభై మంది గ్రామాలలో నివసిస్తూ వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు.

వీరిని గురించి ఒక బ్రిటీషు ఆర్థిక వేత్త 'భారతదేశంలో వ్యవసాయం, పేదరికం కలిసి ఉంటూ ఉంటాయి' అని అన్నాడు. అంతేకాదు గ్రామీణ ప్రజల ఆర్థిక వ్యవస్థను గురించి పరిశోధన జరిపిన భారతీయ శాస్త్రవేత్త యిల్లా అన్నారు—

'రయితు అప్పుల్లో పుట్టి, అప్పుల్లో పెరిగి, అప్పుల్లో చస్తాడు.'

ఈ మాటలు వాళ్ళు సుమారు ముప్ఫైనలభై సంవత్సరాల క్రితం చెప్పినా వ్యవసాయదారుడి పరిస్థితి ఆనాడు యీనాడు కూడా అలాగే వుంది.

కారణం స్పష్టంగానే కనిపిస్తోంది. దుర్భిక్షం, అకాలవర్షాలు, తుఫానులు వీటి తాకిడినుంచి వ్యవసాయరంగం పూర్తిగా విమోచన పొందలేదు. రెండు సంవత్సరాలు పంట పండితే నాలుగు సంవత్సరాలు కాటకమేగా.

నూటికి తొంభైమంది కష్టించి పండించినా దేశానికి చాలినంత ఆహారం ఉత్పత్తి కావటంలేదు. ఈ వృత్తిలో జీవించే వారికి జీవితం దినదిన గండంగా వుంది. బహుజన హితాన్ని సుఖాన్ని కోరే ప్రజారాజ్యంగా వ్యవసాయ సంస్కరణలు చేయవలసిన అవసరం ఎంతైనా వుంది.

మనం మొట్టమొదట చేయవలసింది: వ్యవసాయాన్ని కూడా వ్యాపారంగా ఆలోచించడం.


చెయ్యడం మానవలసింది: వ్యవసాయ రంగాన్ని రాజకీయ ప్రచారానికి ఒక పందెపు పావుగా వినియోగించటం.

మనకు కావలసిన దానికన్నా ఎక్కువ వున్నప్పుడే పరిమితి అనే మాటని గురించి ఆలోచించవలసింది. మనం యింకా ఆహార ధాన్యాలని విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటూనే వున్నాం. ఎంతకాలం యీ దిగుమతుల అవసరం వుంటుందో కూడా చెప్పలేని పరిస్థితిలో వున్నాం.

తమకు కావలసిన దానికంటే ఎక్కువగా ఆహార ధాన్యాలని పండించి విదేశాలకు ఎగుమతి చేస్తున్న దేశాలలో వ్యవసాయం వల్ల జీవించే జనాభా నూటికి 8 నుంచి 35 శాతం మాత్రమే. మనం చెయ్యవలసిన మొదటిపని తక్కువమంది జనంతో ఎక్కువ పంట పండించటం—ఎటువంటి పరిస్థితులలోకూడా వీరి సంఖ్య నూటికి 25 మించకుండా చూచుకోవడం. మరి అదనంగా వున్న 65 శాతం మాట?

ఈ నాటికికూడా కూడా అనేక వేల రకాల వస్తువులని మనం దిగుమతి చేసుకుంటున్నాం. ఆ పరిశ్రమలని మన దేశంలోనే స్థాపించి వీరికి ఉపాధి కలిపించటం. దీనివల్ల రెండు లాభాలు 1] అధిక ఉత్పత్తి. 2] విదేశీ ద్రవ్య లాభం. 3] జాతీయ ఉత్పత్తి పెరుగుతుంది.

ఇప్పుడు ఉత్పత్తిలోవున్న పరిశ్రమలు స్వయం సమృద్ధినే కాకుండా ఎగుమతులకు కూడా అనువైనస్థాయిలో ఉత్పత్తి పెంచాలి,



దీనివల్ల అనేకమందికి జీవనోపాధి ఏర్పడటమే కాదు విదేశీ ద్రవ్యం కూడా లభిస్తుంది.

సాంఘిక సామాజికవ్యవస్థలో కుల మత జాతి విభేదాలులేకుండా అందరికి సమాన అవకాశాలు వున్నట్టుగానే, వ్యవసాయదారుడు కూడా, ఒక వ్యాపారస్థుడిలాగా, ఒక ఉద్యోగిలాగా, తన శ్రమవల్ల తన సంపదని పెంచుకోగల అవకాశం ఇంతవరకూ ఉంది. ఇప్పుడు రాబోయే చట్టంవల్ల అతనికి యీ అవకాశం లేకుండా చేయబడుతుంది. అనుక్షణం గగనతలాన్ని ధరలు అంటే యీ రోజుల్లో వ్యవసాయదారుడు తన మైనరు సంతానం మేజర్లు అయ్యేవరికి ఇవ్వగలిగిన సంపద అప్పులు. ఎదగడానికి వీలులేని ఆస్తి—అరికట్టడానికి వీలులేని ఖర్చులు—వీటినిగురించిన ఆలోచనలతో అంతులేని వ్యథ, నిరాశ, నిస్పృహ! చివరకు మిగిలేది—దివాళా!

'అన్నదాత సుఖీభవ!' అన్న యీ పుణ్యభూమిలో అన్నదాతకు మనం ఇవ్వగలిగిన వరం—ఈనాటి సంఘంలోని నాలుగో తరగతి ఉద్యోగికంటే బీదవాడిగా మార్చడం.

ఈ చట్టం ఏ సమస్యకి పరిష్కారం కాదు. రాబోయే ఆందోళనకి నాంది భరత వాక్యం కాదు.

వ్యవసాయదారుడికి మనం చెయ్యగలిగిన ఉపకారం, అతని కుటుంబం వ్యవసాయం వల్ల హాయిగా జీవించడానికి కావలసినంత భూవసతిని అతనికి ఏర్పరచడం. మైనర్లతోసహా అయిదుగురు వ్యక్తులు కుటుంబంగా తీసుకున్న ఈ యూనిట్‌కు నెలకు కనీసం 1500/— కావాలి. సంవత్సరానికి 18000/— నికరాదాయం కావాలి అంటే ఎకరానికి కనీసం 25 బస్తాలు పండలగ 30 ఎకరాలు వుండాలి. ఈ కుటుంబంలోని మైనర్లు మేజర్లు అయ్యేసరికి వారికి తగినంత భూమి ఏర్పరుచుకోవడానికి కావలసిన అధిక వసతులుకూడా వ్యవసాయదారుడికి మనం కలుగచెయ్యాలి.

నెలకు మూడువందలతో ఉద్యోగం ప్రారంభించి మూడువేలమీద రిటయిరు కావడానికి అవకాశం వున్న యీ రోజుల్లో వ్యవసాయదారుడుకూడా నెలకు 3000/— నికర ఆదాయాన్ని తెచ్చుకోగలిగిన స్తోమత యివ్వాలి అంటే ఒక కుటుంబానికి 120 ఎకరాల పొలందాకా వుండటానికి అవకాశం యివ్వాలి.

అంతేకాదు మిగతా వ్యాపారులకు ఉన్నట్టుగానే యిన్సూరెన్సు అవకాశం వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టాలి. విధిగా పంట బీమా చేసే పథకం కావాలి.

వ్యవసాయరంగంలో స్వచ్ఛవిప్లవం సాధించింది నూటికి 80 శాతం రైతుల స్వయంకృషి 20 శాతం గవర్నమెంటు రంగం. ఇతర రంగాలతో ఆర్థిక ప్రతిపత్తి కలిగి తగినంత ధనసంపద వున్న వారివలననే ఇది సాధ్యం అయింది.

10—18 ఎకరాలకు పరిమితి నిర్ణయించినప్పుడు ప్రజలకు ఉపకారం సంగతి ఎల్లావున్నా—ఒక నూతన పేదవర్గాన్ని సమాజంలో మనం సృష్టించడం జరుగుతుంది.

వ్యవసాయాన్నే జీవన ఆధారంగా పెట్టుకున్నవారికి జన్మజన్మాంతర కఠినశిక్ష విధించటం జరుగుతుంది.

వ్యవసాయరంగంలో వారికి ఉపకారం చెయ్యాలంటే మనం వెంటనే చెయ్యవలసింది.

1) కుటుంబానికి కనీసం 30 ఎకరాలు వుండేలాగా చూడాలి.

2) ఇప్పటి పన్ను విధానం రద్దుచేసి ఆదాయపుపన్ను పద్ధతి పెట్టాలి.

3) ప్రతి 250 ఎకరాలకు ఒక సహకార వ్యవసాయ సహాయ కేంద్రం స్థాపించి—చిన్నకారు రైతులకు, వ్యవసాయ సంబంధమైన సహాయం చెయ్యాలి.

4) సాగుకు యోగ్యమైన బంజర్లు సాగులోకి తీసుకురావాలి. భూమికోసం తహతహలాడే యీ ప్రజలకు ఆ భూమిని యివ్వాలి. దీనికి కావలసిన వ్యవసాయ పరికరాలు వగైరా కొనుక్కోవడానికి 5 సం. వరకూ వడ్డీలేకుండా అప్పులు యివ్వాలి.

5) వ్యవసాయ పరికరాలు ట్రాక్టర్లు వగైరా యంత్రాలమీదా ఎటువంటి రకం పన్నులు వుండకూడదు. వ్యవసాయదారులకు ఇవి చవకగా లభ్యమయే ఏర్పాటు చెయ్యాలి. దీనివల్ల ఉత్పత్తి పెరుగుతుంది. దేశసంపదకూడా పెరుగుతుంది.

6) 10—18 ఎకరాలకు పరిమితి నిర్ణయించి అధికంగా లభ్యమైన పొలం బీద ప్రజలకు వారి కుటుంబాలకు సరిపోయినంత యివ్వాలంటే భారత దేశం వైశాల్యం రెండు రెట్లు పెరిగినా చాలదు.

7) భూస్వామిని సంఘ ద్రోహిగా చూడటంకంటే సంఘానికి కవలసిన అత్యవసర సామగ్రి — ఆహారం అందించే అనదాతగా చూడటం నేర్చుకున్ననాడు — అన్నదాత సుఖంగా వున్ననాడు సంఘానికి సంఘంలోని వ్యక్తులందరికి సుఖమే.

రాజకీయ నినాదాలతో సమస్యలు పరిష్కారం కావు. నిరంతర నిర్విరామ కృషివల్లనే దేశం సుభిక్షం అయ్యేది, సర్వే జనాః సుఖినో భవంతు అన్న వేదవాక్కు నిజమయ్యేది. ●



కలసి బ్రతుకుదాం

ఆలూరి విజయలక్ష్మి



'చంద్రా! ఎవరో అబ్బాయి వచ్చాడు నీకోసం' పుస్తకం ముందు పెట్టు కుని ఆలోచనలలో నిమగ్నురాలైన చంద్రను చూచి విస్తుపోయింది విమల. అబ్బాయిలతో అతి ముక్తసరిగా మాట్లాడే చంద్రను వెదుక్కుంటూ ఓ అందమైన యువకుడు రావడం, చదువును ఓ తపస్సులా భావిస్తూ ఒక్క క్షణంకూడ వృధా చెయ్యని చంద్ర పుస్తకం ముందుపెట్టుకుని కలల్లో తేలి పోవటం చిత్రమనిపించింది విమలకి.

'విమలా! ఒక్క రెండు నిమిషాలు. అతనితో మాట్లాడుతూ వుండు అంత వరకు.' ఏదో సమస్యతో మధనపడుతున్న చంద్రను చూచి హృదయంలోని ప్రతి కదలికను తన ముందుంచే ఈ అమ్మాయి క్రొత్తగా తననుండేదో దాస్తుందని గ్రహిం చింది విమల.

'అతన్ని నీ కోడలు ఎంగేజ్ చెయ్యగల వుతే. నేను కాఫీ పెడ్తాను. త్వరగా రా నువ్వు.' శ్రీ కృష్ణానగర్‌లో పొడుగ్గా వున్న బిల్డింగ్‌లో ఓ రెండు గదుల పోర్షన్‌లో విమల కాపురం, ప్రక్కనేవున్న ఒక్కగది పోర్షన్‌లో చంద్రకళ బస. యూనివర్సిటీ ఫార్మశీ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్‌గా వుంటూ రిసర్చిచేస్తున్న చంద్ర కళ అగ్గిపెట్టెలాటి ఈ గదిలో చేరిన పది రోజుల్లోనే ప్రక్కపోర్షన్‌లో వుంటున్న ఫిజిక్స్ లెక్చరర్‌భార్య విమలకు ఆప్తురా లయింది.

చీర మార్చుకుని, బొట్టు సరిచేసు కుంటున్న చంద్రకు అతనితో మాట్లాడు తున్న 'స్వప్న' ముద్దుమాటలు వినిపిస్తు న్నాయి మరో నిమిషంలో రూమ్‌కు తాళంవేసి విమల వాళ్ళముందు రూమ్‌లోకి వచ్చి 'నమస్తే' అంది చంద్ర. చిరునవ్వుతో చేతులు జోడించాడతను. స్వప్న అతని ఒడిలోనుండి దూకివచ్చి ఎత్తుకోమన్నట్లు చేతులు చాపింది.

'మా బంగారు తల్లివికదూ! యిప్పుడు ఎత్తుకోను నిన్ను. నాచీర కాస్తా నలిపి పారేస్తావు' అంది చంద్ర 'స్వప్న'ని ముద్దు పెట్టుకోవడానికి ముందుకు వంగి. 'ఛో! నీకు ముద్దియ్యను. అత్తయ్య చెడ్డ. అంకుల్ మంచి' అంది స్వప్న బుంగ మూతి పెట్టి. గలగలా నవ్వుతూ స్వప్నను ఎత్తుకుని ఒళ్లో కూర్చోబెట్టుకున్నాడతను.

'మీకేదో తైర్ వేస్తున్నటుందే అమ్మ గారు' అంది విమల అతని ముందున్న టీపాయ్‌మీద కాఫీ కప్పులు వుంచుతూ.

'వీరు కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్. ప్రభాకర్. ఈవిడ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్ మధుసూధన రావుగారి మిసెస్—విమల.' పరిచయాలు పూర్తిచేసింది చంద్ర.

కాఫీ సిప్‌చేస్తూ ప్రభాకర్‌నీ, చంద్రనీ గమనిస్తోంది విమల. చంద్ర దీర్ఘా లోచనలో మునిగివుంది. స్వప్నతో కబుర్లు

చెప్పూ కాఫీ త్రాగుతున్నాడతను. కాఫీ త్రాగడం ముగించి చంద్రవంక చూసాడతను.

'విమలా! నేనొ గంటా, గంటన్నరలో వస్తాను.' స్వప్న చంకకు తగిలించుకున్న వ్యానిటీబాగ్‌ను తీసుకుని లేచింది చంద్ర.

'వస్తానండీ!' చేతులు జోడించాడతను. పొడుగ్గావున్న వరండాలో ప్రభాకర్ వెనుక వెళ్తున్న చంద్రను చూస్తూ నిలబడిపోయింది విమల.

'చంద్రా! ఒక్కమాట' హటాత్తుగా జ్ఞాపకం వచ్చినదానిలా పిలిచింది విమల.

'మీ అన్నయ్య 'ఫస్ట్‌షో'కి చిత్రాలయలో టికెట్స్‌తీసొస్తానన్నారు నువ్వు టైమ్‌కి వచ్చేయగలవా?' ప్రభాకర్‌కి వినపడకుండా చిన్నగా అడిగింది విమల.

'వచ్చేస్తాను. ఒకవేళ ఆలస్యమయితే హాల్‌కు డైరెక్టుగా వచ్చేస్తాను.'

'సరే, వెళ్లిరా!' తనలో ఎన్నో సందేహాలున్నా, ఎంతో సహజంగా తనను సాగనంపుతున్న, పెద్దగా చదువుకోని, విమల సంస్కారానికి మరోసారి ముగ్ధురాలయింది చంద్ర.

యూనివర్శిటీ లేడీస్ హాస్టల్‌మీదుగా బీచ్‌కి వచ్చారు ప్రభాకర్ చంద్ర. ప్రక్క ప్రక్కగా నడుస్తున్నా ఒకరిఉనికినిమరొకరు విస్మరించి ఎవరి ఆలోచనల్లో వాళ్లున్నారు. సముద్రంమీదినుండి చల్లని గాలిపిల్లలు మెల్లగా వచ్చి పలుకరించగానే తనలోని సంఘర్షణను చాలవరకు మరిచిపోయింది చంద్ర. బంగారుతీగెలు పరిచినట్లున్న సముద్రాన్ని, సముద్రం, ఆకాశం కలిసినచోట లీలగా కనిపిస్తున్న షిప్‌నీ చూస్తూ నిలబడిపోయింది చంద్ర

'చంద్రకళగారూ!' ఏదో స్వప్నంలో నుండి బయటకు వచ్చినట్లు తలెత్తి అతనివంక చూచిందామె

'యిక్కడ కూర్చుందామా?' అంగీకార సూచకంగా తలఊపి మెరుస్తున్న యిసుక తిన్నెమీద కూర్చుంది. కొద్దిదూరంలో అతను రుమాలు పరుచుకుని కూర్చున్నాడు.

'మేడమ్!' చంద్రవైపు చిలిపిగా చూసాడతను.

'ఏమిటండీ మాస్టారూ?' యిసుకలో పిచ్చిక గూళ్ళు కడుతున్న చంద్రకళ ఓరగా చూచిందతనివంక.

'కొన్ని డౌట్స్‌వున్నాయి మేడమ్! అవి తీరుస్తారేమోనని...'

'సరి! నేనింకా పాఠాలు చెప్పడానికి రమ్మన్నారేమో ననుకున్నా' ఆమె కళ్ళల్లోని మెరుపును గమనించాడతను.

'నిజం?' చటుక్కున ఆమె చేతినందుకొని మృదువుగా చుంబించాడతను. అతని స్పర్శ ఆమెలోని స్త్రీత్వాన్ని తట్టిలేపింది. ఆనందము, బాధ కలిసిన ఒక విచిత్ర స్థితి ఆమె నావహించింది. 'ఏమిటీతని ధైర్యం' అనుకుని ఆశ్చర్యపోయింది.

'ఏమిటిది?' చురుగ్గా చూసిందతనివైపు.

'పాఠాలు చెప్తున్నారుగా మరి?' కొంటెతనం తొంగిచూచిందని కళ్ళల్లో.

'బావుంది' కోపంతో ముఖం త్రిప్పుకుంది చంద్ర.

'నిజం?! బావుందా!' ఆమెచేతి నందుకున్నాడతను. కోపంతో అతని చేతిలో చిక్కుకున్న తన చేతిని విడిపించుకోవడానికి ప్రయత్నించింది చంద్ర. చిగురుటాకులా వణికిపోతున్న ఆమె చేతిని ఆప్యాయంగా నిమిరాడు ప్రభాకర్. అతని స్పర్శ తాలూకు మాధుర్యం ఆమెను వివశురాల్ని చేస్తూంది.

'మీరిలా ప్రవర్తిస్తారనుకుంటే మీ వెంట ఎప్పటికీ వచ్చేదాన్ని కాదు.' తన చేతిని విడిపించుకోలేని నిస్సహాయత, కోపం కలసి ఆమె ముఖానికి రోజారంగును పులిమాయి.

'కోపగించుకోకు చంద్రా!' దీనంగా చూసాడతను.

'నేనకారణంగా కోపగించుకుంటున్నానంటూరా? యింత చనువు తీసుకునే అధికారం ఎవరిచ్చారు మీకు?' రోషంగా అడిగింది చంద్ర.

'మీరే!'

'నేనా?!' ధైర్యంగా తన కళ్ళల్లోకి సూటిగా చూస్తున్న అతనివంక విస్తుపోతూ చూచింది చంద్ర.

'కాక?! ఏ చనువు ఇచ్చే ఉద్దేశ్యం లేకుండానే, నేనడగగానే ఒంటరిగా నాతో బీచ్‌కు వచ్చేస్తారా? ఐదు సంవత్సరాల నుండీ మిమ్మల్ని గమనిస్తున్నాన్నేను. యూనివర్సిటీ కాంపస్‌లో ఏ అబ్బాయితోనైనా చనువుగా మాట్లాడడం దేవుడెరుగు, కనీసం ఒక మనిషితో మాట్లాడినట్లు మాట్లాడడం ఎప్పుడూ చూళ్లేదు నేను. 'పలకరిస్తే ఆ పిల్ల అలా కరుస్తుందేమిటిరా!' అని వాపోయేవారు నా ఫ్రెండ్స్. అలాంటిది మీరు నాతో చక్కగా మాట్లాడి, అడగంగానే బీచ్‌కు వచ్చారుకదా, దీనికి నేనే అర్థం చెప్పుకోను? ఒకవేళ నేను అపోహపడి, కూడని చనువు తీసుకుంటే క్షమించాలి నన్ను' అంతవరకు పదిలంగా పట్టుకున్న ఆమెచేతిని వదిలేసాడతను. ఏదో మహాసౌఖ్యాన్ని తననుండి బలవంతంగా లాక్కున్నట్లు భావించింది చంద్ర.

'అదికాదు. చుట్టూ ఎంతమంది వున్నారో చూడండి. ఎవరైనా చూస్తే!' మెల్లగా నసిగింది చంద్ర.

'ఎవరూ చూడకపోతే ఫరవాలేదన్నమాట. చెప్పవేంమరి!!' అందంగా నవ్వాడతను.

'ఫోండి యిలా మాట్లాడితే నేనిక్కడ ఒక్కక్షణంకూడ వుండను' మనోహరమైన సిగ్గుతెర ఆమెను కప్పివేసింది. ప్రక్కన పడివున్న వ్యానిటీబేగ్ తీసుకుని లేచింది చంద్ర. ఎప్పుడూ గంభీరంగా కనిపించే చంద్రలో క్రొత్తగా కనిపిస్తున్న సిగ్గును చూచి 'ఎప్పుడూ పుస్తకాలు, ఫస్ట్‌క్లాస్‌లు, యూనివర్శిటీ ఫస్ట్‌లు అని జపంచేసే యీ పిల్లలో కమ్మని కలలు రేపడంతో తను కృతకృత్యుడయాడా?' అని ఆలోచిస్తున్న ప్రభాకర్ లేచి వెళ్లిపోతున్న చంద్ర కొంగును అందుకోగలిగాడు.

'ప్లీజ్ చంద్రా! యీ రోజు నీతో ఎన్నో మాట్లాడాలని, ఏదో ఒక నిర్ణయం చేసేసుకోవాలని వచ్చాను. కొంచెంసేపు కూర్చో' ప్రతిమాలుతున్నట్లు చూసాడతను,

'మీరు అల్లరి చెయ్యకుండా బుద్ధిగా కూర్చుని మాట్లాడతానని ప్రామిస్‌చేస్తే తప్ప నేను కూర్చోను. యిలాంటి చేష్టలంటే నా కసహ్యం.' అంటూనే కూర్చుంది చంద్ర.

'ఎలాంటి చేష్టలంటే చంద్రా!' కొంటెగా నవ్వాడతను. ఆడపిల్లల్ని వశపరచుకోవడానికి యీ మొగవాళ్ళు ఎంత అందమైన అస్త్రాలు ప్రయోగిస్తారబ్బా! అనుకుంది చంద్ర.

'అందంగా ఆత్మవంచన చేసుకోవడంలో మీ ఆడపిల్లలది అందెవేసిన చెయ్యి

అన్నాడు ప్రభాకర్.

'ఆత్మవంచనా?!'

'కాక మరేమిటంటే! యిప్పుడు నేను చేసిన చేష్టలవల్ల మీకు కలిగింది ఆనందమా, లేక అసహ్యమా?' అతనంత సూటిగా, స్వచ్ఛంగా మాట్లాడుతోంటే ఒక్క క్షణం నోటు విప్పలేక పోయింది చంద్ర.

'యిదిగో యిలా అంతా ఆనందమయం అని నొక్కి వక్కాణించి ఆ భ్రమలో పీక లోతుకు మునిగిపోయే వరకు తీసుకు వెళ్లి ఆనక నిర్దాక్షిణ్యంగా తప్పుకు పోవడంలో మీ మగవాళ్లది అందెవేసిన చెయ్యికాదా?' సూటిగా చూచిందతని వంక.

'ఉహూ! మీకు సబ్జక్ట్ తప్పితే యిహ లోకంలో మరే మీ తెలియదను కున్నానే! ఫరవాలేదయితే!' కళ్లు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూసాడతను.

'అదిగో! మళ్లీ మొదలు పెట్టారు.' అలుకగా చూచిందతని వైపు.

'లేదు. లేదు. బుద్ధిగా కూర్చుని మాట్లాడుతాను.' భయం నటించాడతను. ముడుకుల మీద తలాన్చుకుని ఇంద్రధనుస్సులా వున్న బీచ్‌ని చూస్తూ కూర్చుంది చంద్ర.

'త్వరగా యింటికి కోడల్ని తేవాలని రెండు సంవత్సరాల నుండి అమ్మ పోరు పెడుతూంది.' తలవంచుకుని అతని పాయింట్ రెడ్ షూనీ ఫోల్డ్‌లెస్ టెరీన్ పాంట్‌నీ చూస్తూంది చంద్ర.

'అప్పట్నుండీ నా ఆలోచనల్తో, అనుభూతుల్తో పాలుపంచుకోగల అమ్మాయి కోసం వెతుక్కుంటున్నాను.' ఓ క్షణం ఆగాడతను. 'ఆ అమ్మాయి తనేనా!' ఓ క్షణం ఝల్లుమంది ఆమె హృదయం.

'పెళ్ళి ప్రస్తావన చేసేముందు, నా గురించి, వివాహం గురించి మీ అభిప్రాయాలు తెలుసుకోవాలని మిమ్మల్నిలా రమ్మని కోరాను. అదృష్టవశాత్తూ అడగంగానే మీరు ఒప్పుకోవడం ఓ వరంగా భావించాను.'

'నాదొక ప్రశ్న.' తలెత్తి అతని చూపుల్లో చూపులు కలిపిందామె.

'తప్పకుండా. మీ ప్రశ్నలకు జవాబులిచ్చి మీ నుండి నా ప్రశ్నలకు సమాధానం పొందాలనే నేను మిమ్మల్నిక్కడికి రమ్మని కోరింది', అతనిలోని

కలసి బ్రతుకుదాం

గంభీరతను చూచి యింతకు ముసుపెంత చిలిపిగా ప్రవర్తించిందితనేనా అనుకుంది చంద్ర.

'మీరంటే పడి చచ్చిపోయే అమ్మాయిలు చాలమంది తెలుసు నాకు. మీ తెలివినీ, టాలెంట్స్‌నీ, ఫిగర్‌నీ ఆరాధించే అమ్మాయిలు నా ఫ్రెండ్స్‌లోనే వున్నారు. వాళ్లందర్నీకాదని, వాళ్ళతో పోలిస్తే ఏ ఆధిక్యతా లేని నాముందు మీరు పెళ్లి ప్రస్తావన తెస్తున్నారంటే నాకెంతో ఆశ్చర్యంగా వుంది.'

'బహుశా యీ నిరాడంబరతనే యిష్టపడ్డా ననుకుంటాన్నేను. ఆత్మవిశ్వాసాన్ని అభినందిస్తాను కాని అహంకారాన్ని అసహ్యించుకుంటా న్నేను. బహుశా యీ కారణంవల్లే వాళ్లెవరూ నామనసుకు దగ్గరగా రాలేక పోయారేమో! మిమ్మల్ని చూచిన క్షణంనుంచీ మిమ్మల్ని ప్రేమిస్తున్నానని, మిమ్మల్లో దేవతలా చూచుకుంటానని అనన్నేను. మీమీద యీ ఆప్యాయత ఒక్కనాడు ఉధృతమైన వరదలా వయసు వేడిలో వచ్చింది కాదు, ఎన్నోరోజుల్నుండి, కాదు సంవత్సరాల్నుండి నాలో నిదిగి క్రమక్రమంగా నాలో పూర్తిగా నిండిపోయింది' అతనిమాటలు వింటూంటే తనలితాను ఒక్కసారి పరిశీలించుకోవాలనిపించింది చంద్రకు. అతనిముందు పొట్టిగా, పీలగా కనిపించే తనలో ఆకర్షించేవి రోజా రంగు, సూటిగా మొనతేలినట్లుండే ముక్కు. భుజం దిగని నొక్కుల నొక్కుల జుట్టు అమితమైన కాంతితో ప్రకాశించే చిన్నకళ్ళు.

'మీ సెంటిమెంట్స్‌ని, మీ ఆశయాల్ని గౌరవిస్తూ నన్ను చేసుకున్నందుకు మీరు పశ్చాత్తాపపడే అల్పమైన క్షణం రాకుండా వుండేలా ప్రయత్నిస్తాను.' తెలియచెప్పలేని ఉద్వేగంతో కరిగిపోతూంది చంద్ర.

'నేను తప్పితే నా చుట్టూవున్న పరిస్థితులు తెలీవు మీకు' అంది నెమ్మదిగా చంద్ర.

'నాకు కావలసింది మీరు.'

'మిమ్మల్ని కొనివ్వగల తాహతు లేదు మా నాన్నగారికి.'

'యిక్కడ కొనుక్కోవడం, అమ్ముకోవడమనే ప్రసక్తే లేదు చంద్రా! కలిసి బ్రతికే దానికి ఒకరి అనుమతి మరొకరం తీసుకోవడమే.'

'కొంతకాలంవరకు నా డబ్బు మనికోసం ఖర్చుపెట్టలేను.'

'నాక్కావలసింది మీరుకాని మీరు సంపాదించే డబ్బు కాదు.' యిదేమిటి తను! నాక్కావలసింది నీ డబ్బుకాని నువ్వు కాదంటున్నాతే యీనాటి యువకుల్లో మెజారిటీ! స్కూటర్లు, కార్లు, అందమైన ఫ్లాట్‌లు, ఫారిన్ ట్రిప్స్; థ్రిల్ కలిగించే క్లబ్బు సందళ్లు — వీటి మీద ఆసక్తి లేదా యీ అబ్బాయికి.

'చంద్రా! యింక మీరు చెప్పండి. మీరు పెళ్ళాడబోయే వ్యక్తి గురించి, దాంపత్య జీవితం గురించి మీ అభిప్రాయాలేమిటి? మీ ఆలోచనల్ని విని అందుకు నేను తూగ గలనా అని విమర్శించుకుని ముందుకు సాగుతాను' అన్నాడతను. మౌనంగా ఆలోచిస్తూంది చంద్ర.

'మాట్లాడరేం చంద్రా!'

'ఏం మాట్లాడను! సంసారం గడవడమే కష్టంగా వున్న పరిస్థితుల్లో ఎదురొడ్డి నన్ను చదివించారు నాన్న. కేవలం సరదా కోసం, లేక పెళ్లయ్యే వరకు ఊరికినే కూర్చోలేక యూనివర్శిటీకి వస్తే బహుశా మిగిలిన అమ్మాయిలాగే వుండే దాన్నేమో! వయసులో వున్న కన్నెపిల్లల్ని ఎలాటి ప్రలోభాలు నాశనం చేస్తాయో కొంతవరకు తెలుసు నాకు. కొన్ని పరిస్థితుల్ని కొనితెచ్చుకొని వాటినుండి బయటపడేదెలా అని బాధపడే కంటే అసలా పరిస్థితులు రాకుండా చూసుకుంటే పోలా! అంచేత నా చుట్టూ కొన్ని పరిధులుంచుకున్నాను. వాటిని దాటకుండా వుండడానికి అతిజాగ్రత్తగా మెలిగాను. అంచేతే మీ ఫ్రెండ్స్‌లాంటి వాళ్ళ దృష్టిలో నేనో గయ్యాళి గంపనయాను.' చిన్నగా నవ్వింది చంద్ర. 'చెప్పండి' అన్నట్టు చూసాడు ప్రభాకర్.

'నిజానికి మా విమలతో స్నేహమయే వరకు నేను వివాహమంటే విముఖంగా వుండేవాన్ని. అబ్బాయిల గురించి మాట్లాడుతూ, ఏవేవో ఊహించుకుని, నిట్టూర్పులు విడుస్తూ చదువును అశ్రద్ధ చేసే నా ఫ్రెండ్స్‌ని చూచి విసుక్కునేవాన్ని,

కాని నా విమల నన్ను కొద్దికొద్దిగా మార్చేసింది. విమల దాంపత్యం చూస్తూంటే నాలో ఒక భాగం అసంపూర్తిగా వున్నట్లు ఫీలవుతాను స్పష్టను హృదయానికి హత్తుకుంటే 'నాకూ ఓ బుల్లి పాపాయి వుంటే!' అనిపిస్తుంది.' చంద్ర కళ్లల్లోని భావుకత్వాన్ని రెప్పవేయకుండా చూడసాగాడు ప్రభాకర్.

'కాని ... నాలో ఎన్నో అస్థిరమైన భావాలు. ఒకదానికి మరొక దానికి పొత్తు వుండదు. నేను బాగా పట్టుదలతో రిసర్చి చేసి దేన్నో సాధించి తీరాలి. నా ప్రొఫెషన్‌లో పైపైకీ, అత్యున్నత స్థానానికి వెళ్ళాలి. ప్రతిక్షణాన్ని విజ్ఞాన సముపార్జనకి వెచ్చించాలి. నా మేధస్సును నలుగురికి ఉపయోగపడేలా చెయ్యాలి అంతలోనే యీ భావం ఫేడౌట్ అవుతుంది. 'నీ ఆశలూ. అనుభూతులూ, సమస్యలూ నావి. నువ్వు నిశ్చింతంగా వుండు' అనగలిగిన పురుషుడి హృదయంమీద విశ్రాంతి తీసుకోవాలనిపిస్తుంది చిన్నారి పాపల ముద్దుపలుకుల్లో మైమరచి పోవాలి. అందమైన సాయంత్రాల్లో ఒక పాపను నా ఒళ్లోనూ, మరో బాబును ప్రక్కనే కూర్చోపెట్టుకుని, ముందుపుంచి స్కూటర్ మీద షికారెళ్లాలి. నా బిడ్డలికి గోరు ముద్దలు నేను తినిపించాలి. వాళకి రకరకాల డిజైన్స్‌లో డ్రెస్‌లు కుట్టాలి. వాళ్ల చేత అక్షరాలు నేను దిద్దించాలి. చిత్రమేమిటంటే పరస్పర విభిన్నమైన యీ కోర్కెలు రెండూ సమానమైన బలంతో వున్నాయి. వీటిల్లో దేనినీ నెట్టివేయలేకుండా వున్నాను.' ఆమె మాటల్లోని సిన్సియారిటీ అతని మీద బలమైన ముద్ర వేసింది. మరో లోకంలో వున్నట్లు చెప్పుకుపోతూ ందామె.

'రెంటినీ సాధించాలంటే నాకీ జీవితం చాలదు. ఏదో ఒకదాన్ని ఎన్నుకుందామంటే రెండోదానికోసం జీవితాంతం పశ్చాత్తాపపడతానేమోనని భయం వేస్తుంది' విషాదం తొంగి చూసిందామె స్వరంలో.

'చంద్రా!' ఆమె చుబుకాన్ని పట్టుకుని తనవైపుకు త్రిప్పుకున్నాడు.

'రెంటినీ సమన్వయ పరచుకోవడానికి ప్రయత్నించండి. నాచేతయినంతవరకు నేను మీతో సహకరిస్తాను.' దృఢంగా వుందతని స్వరం.

'ఒక్కోసారి ప్రతిదాన్ని ఎందుకింత సీరియస్‌గా తీసుకుంటానో! అని బాధపడతాను. లోకంలో నాలాగా, నాకంటే ఎక్కువ చదివినవాళ్ళు చాలమంది వున్నారు. వాళ్లు నాలాకాకుండా హాయిగా నవ్వుతూ, తుళ్ళుతూ ఎలా గడిపేయగల్గుతున్నారు!. తాము చదివింది అభివృద్ధి పరచుకోకుండా, కనీసం నలుగురికీ వినియోగపరచకుండా ఎలా వుండగలుగుతున్నారు! అని ఆశ్చర్యపోతాను. ఇంత అస్థిరమైన ఆలోచనలతో వున్న నేను దేన్నీ పొందలేనేమో, దేన్నీ సాధించలేనేమోనని అధైర్యపడిపోతాను' చంద్రకళ్లు నీళ్లతో నిండిపోయాయి.

'చంద్రా!' నలువైపులా అలుముకుంటున్న చిరుచీకట్లలో తన కౌగిలిలోకి తీసుకుని ఓదార్చాడతను. కర్చీఫ్‌తో ఆమె కళ్లు తుడిచాడు.

'చంద్రా! జీవితంలో దేనికివ్వాల్సిన ప్రాముఖ్యం దానికివ్వాలి. చదువు జీవితాన్ని వ్యక్తిత్వాన్ని అలంకరింప చేసేలా వుండాలి కాని ఓ గుదిబండ కాకూడదు.' అతని మాటలు వింటూ, అతని కౌగిలిలో వివశురాలైన చంద్ర ఒక్కసారి ఉలిక్కిపడింది. 'ఏమయిపోతూంది తనకు! యింత తేలికగా యితనికింత చేరువగా ఎలా రాగలుగుతూంది. ఊహు. తన పరిధుల్ని తప్పడమంత ఉచితం కాదు' నెమ్మదిగా అతని చేతుల్లోనుండి విడివడి తన చెక్కిళ్ళమీద మంచిముత్యాల్లా జారుతున్న కన్నీటిని తుడుచుకుంది.

'విమల ఎదురుచూస్తూ వుంటుంది. వస్తానింక' అతని పాదాల దగ్గరున్న వ్యానిటీబాగ్ నందుకుని లేచింది.

'చంద్రా!' ఆమె చేతిని మృదువుగా అందుకుని లేచాడు.

'నువ్వు ఆలోచించుకుని ఓ నిర్ణయానికి వచ్చి నాకు చెప్పు. ఒకవేళ నీ నిర్ణయం నేను కోరుకున్నట్లు లేకపోతే, నేను బాధపడనని, చెప్పనుకాని, మంచి స్నేహితులుగా మిగులుదాం.' ఆమె తన కోరికను నిరాకరిస్తుందేమోననే భయం ధ్వనించిందతని స్వరంలో. ఆమె తప్పించుకు వెళ్ళిపోతుందేమో అన్నట్లు ఆమె చేతిని విడవకుండా పదిలంగా పట్టుకుని నడుస్తున్నాడతను. అప్పుడే నలుదిక్కులా పరుచుకుంటున్న వెన్నెల పసిపాప బోసినవ్వులా పలకరించిందా యిరువురినీ.


'ప్రభాకర్‌గారూ! మీరు నాకిస్తున్న స్థానం విలువ తెలుసు నాకు. యీ విలువను దృష్టిలో వుంచుకునే ఆలోచిస్తాను. మిమ్మల్ని గురించి ఆలోచించాల్సిందేమీ లేదు. నన్ను అంచనా వేసుకుని నిర్ణయం తెలియజేస్తాను మీకు. ప్రక్క ప్రక్కగా కదులుతున్న తమ నీడల్ని గమనిస్తూ అంది చంద్ర.

'మరి వస్తాను. అదిగో బస్ వచ్చింది' అప్పుడే ఆగిన బస్‌వైపు త్వరత్వరగా నడుస్తున్న చంద్రని అనుసరించాడతను.

* *

'చంద్రకళగారూ!'

'యస్' ఫేకల్టీ క్లబ్ ప్రక్కగా పరధ్యానంగా నడుస్తున్న చంద్రకళ తలెత్తి



చూచింది. తన ప్రక్కగా నడుస్తూ చిరునవ్వుతో తనను చూస్తున్నాడు ప్రభాకర్.

'మీ గురించే ఆలోచిస్తున్నాను' సన్నగా నవ్వింది చంద్ర.

'అదృష్టవంతుడిని' చిలిపిగా చూశాడతను.

'ఇంటికేనా ?'

'అవును. మీరూ రాకూడదూ? ఎప్పటి నుండో మిమ్మల్ని అమ్మకు చూపించాలనుకుంటున్నాను.'

'ఇప్పుడా ?!' నసిగింది చంద్ర.

'ఏం ? ఏమైనా పనుందా ?'

'పనేమీ లేదనుకోండి.'

'అయితే పదండిమరి. మీ కోడలు ఎదురు చూస్తూంటుందనా ?'

'నో. అదేం కాదు.' జిడ్డోడుతున్న ముఖం. నలిగిపోయినచీర. చేతిలో బరువైన ఫైల్—యిలా వాలకంతోటూ మొట్టమొదటసారి ఆవిడ కళ్ళబడడం! అనుకుంది చంద్ర. కాని ఈమాటే పైకి అంటే అతను నవ్వుతాడు. మరింక మాట్లాడలేక మౌనంగా అతన్ననుసరించింది చంద్ర.

'మీ రిసర్చివర్క్ ఎంతవరకు వచ్చింది?' బఠాణీ తీగల తివాచీని చూస్తూ అడిగింది చంద్ర.

'రిసర్చా ? అసలు చేస్తేకదా ఎంతో కొంతదూరం వచ్చేది ! మీరు ఇరవైనాలుగ్గంటలూ లేబ్‌లో కూర్చుని ఎలా పని చేస్తారోకాని నాకు వరసగా నాలుగుగంటలు లేబ్‌లో ఉండాలంటే ఊపిరి ఆగిపోయినట్టుగా వుంటుంది. అవునుగాని, చంద్రా! పట్టుదలగా వర్క్ చేసేందుకు నాకేమన్నా మంత్రం ఉపదేశించరూ ?'

'మంత్రమా ? ఉహూ. మంత్రాలేమీ రావు బాబూ నాకు.' చిత్రంగా కళ్ళు తిప్పింది చంద్ర.

'రావా?! ఓటివి. కొంతకాలం పోయాక రహస్యంగా ఉపదేశిస్తారు నాకు కదూ?!' గుసగుసగా మాట్లాడాడు ప్రభాకర్!

'ఇదిగో! ఇలా అయితే...?' తెచ్చిపెట్టుకున్న కోపంతో చూచింది చంద్ర.

'బాబోయ్! మూడోకన్ను తెరవకండి' నవ్వేశాడతను. అతని ప్రక్కన నడుస్తూ, అతనిమాటలు వింటూ చిత్రమైనహాయి ననుభవిస్తూంది చంద్ర. యూనివర్సిటీలో వస్తూ పోతూ తనతోటి లెక్చరర్స్‌తో

కలసి బతకుదాం

మాట్లాడడం ఎన్నోసార్లు జరిగింది. వాళ్ళతో సబ్జక్ట్‌కాని, డిపార్ట్‌మెంట్ పాలిటిక్స్‌కాని మాట్లాడుతున్నప్పుడు తన స్త్రీత్వం ఎప్పుడూ గుర్తుకువచ్చేది కాదామెకు. ఎప్పుడూ యిలాంటి వివశత్వాన్ని పొందలేదు.

'అమ్మా! నేను చెప్పానా, చంద్రకళ అని. యీవిడేనమ్మా!' చేతులు జోడిస్తూ ఆమెను పరిశీలనగా చూచింది చంద్ర. తెల్లగా, బక్కపల్చగా వుందావిడ. ప్రశాంతంగా వున్న ఆమె ముఖం చూడగానే చెయ్యెత్తి నమస్కరించాలనిపించేలా వుంది.

'కూర్చోమ్మా!' తనకు దగ్గరగా పీట వాల్చి కూర్చో మందావిడ. చంద్ర బుద్ధిమంతురాల్లా పీటమీద కూర్చుని ఆవిడ కట్టుకున్న తెల్లటి మల్లు పంచెను చూస్తూంది. స్టౌ మీద ఉప్మా తయారు చేస్తూందావిడ.

'బాగా అలిసిపోయావనుకుంటానమ్మా! ముఖం కడుక్కుని దేముడి దగ్గర కుంకుమ వుంది పెట్టుకోమ్మా!' అందావిడ. తనను ఆశీర్వదించడానికి ఎవరో దేవత దిగివచ్చినట్లు ఆవిడ ముఖం వైపు చూస్తూంది చంద్ర.

'ఫైలు నలా భద్రంగా ఒళ్ళో పెట్టుకు కూర్చున్నారు; నిజంగా ఏమైనా మంత్రాలున్నాయేమిటి దానిలో?' చంద్ర చటుక్కున ఒళ్ళో నుంచి ఫైలు తీసి అతని కందించింది.



'ఆ మంత్రాలేవో నేర్చుకోండి మరి' కోపంగా మూతి తిప్పింది. జీడిపప్పు తేనడానికి స్టోర్‌రూమ్‌లోకి వెళ్ళింది సుభద్రమ్మ, ప్రభాకర్ తల్లి.

'అవునూ ... ఒక్క చదువు తప్పితే నీ బుర్రకేదీ అంటదనీ, ఇలాంటివేవీ తెలివనీ అనుకున్నానే నేను?' సుభద్రమ్మకు వినిపించకుండా మెల్లిగా అడిగాడు ప్రభాకర్.

'ఎలాంటివి?' చెయిన్ హుక్‌లో చిక్కుకున్న జడను విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ, కనుకొలకుల్లోనుండి ప్రభాకర్‌ని చూచింది చంద్ర. 'యిలాంటివే. ఓరచూపులూ, పెదవి విరుపులూ, చెక్కిళ్ళలో రంగులూ యింకా...' అంటూనే ఆమె జడను హుక్‌నుండి తప్పించాడు ప్రభాకర్.

'ష్...' అంది చంద్ర సుభద్రమ్మ ఎక్కడ వస్తుందోనని భయపడుతూ.

'ఏమిటీ ? ఓరచూపులా, లేక ...' అంటూ వ్రేలితో ఆమె మెడమీద సున్నితంగా వ్రాశాడతను.

'ఏం మొగాళ్ళు బాబూ, కాస్త చనువిస్తే నెత్తికెక్కి కూర్చుంటారు.' ఖంగారుగా అతని చేతిని తోసేసింది చంద్ర.

'లేవమ్మా! లేచి ముఖం కడుక్కునిరా. టిఫెన్ తీసుకుందురుగాని.' అంది సుభద్రమ్మ జీడిపప్పు నేతిలో వేయిస్తూ, ముఖం కడుక్కుని, బొట్టు పెట్టుకుని వచ్చి సుభద్రమ్మ దగ్గరకూర్చుంది చంద్ర.

'ఎప్పుడూ ఆడపిల్లలమాటే ఎత్తని మా ప్రభ ఈమధ్య నిన్ను గురించి చాలా సార్లు చెప్పాడమ్మా! వీడిని, అమ్మాయిల్నిద్దర్నీ నాకు వదిలి దాటిపోయారు వీళ్ళ నాన్నగారు. నాకు చేతనయినంతలో వీళ్ళని వృద్ధిలోకి తెచ్చాను. ఆడపిల్లల్ని ఓ యింటి వాళ్ళను చేసాను. వీడుకూడ తనకు నచ్చిన పిల్లను చేసుకుని, బిడ్డాపాపతో సుఖంగా వుంటే వాడిచేతిలో రాలిపోవాలని వుందమ్మా!' ప్లేట్స్‌లో ఉప్మా సర్దుతూ చెప్పింది సుభద్రమ్మగారు.

'ఏమిటమ్మా చెప్తున్నావు?' బట్టలు మార్చుకుని వచ్చి తనుకూడ పీట వాల్చుకుని కూర్చున్నాడు ప్రభాకర్. ఉప్మా ప్లేట్ ఒకటి చంద్ర ముందుకు జరిపి

తనొకటి తీసుకున్నాడు.

'ఇక్కడెందుకు బాబూ యీ యిరుకులో. నీ రూమ్‌లో కూర్చుని తీసుకోండి. కూర పొయ్యిమీద పడేసి నేనూ వస్తాను' అంది సుభద్రమ్మ కూరకు తాలింపు వేస్తూ.

'పదండి మరి' మంచినీళ్ళ గ్లాసులు రెండూ తీసుకుని తనగదిలోకి బయల్దేరాడు ప్రభాకర్. ప్లేట్స్ తీసుకుని అతనివెనుక నడిచింది చంద్ర. టేబిల్ ముందున్న కుర్చీని మంచానికెదురుగా లాగి చంద్రకు కుర్చీ చూపించాడు. తను మంచంమీద కూర్చుని ప్లేట్ తీసుకుని తినడం ప్రారంభించాడు. అతని వెనుకగా కిటికీలో నుండి కన్పిస్తున్న గులాబీలను కనకాంబరాల్ని చూస్తూంది చంద్ర.

'ఉన్న కాస్త స్థలంలో మొక్కల బలే వేసారే?' అంది చంద్ర మెచ్చుకోలుగా చూస్తూ.

'వెయ్యడంవరకే నావంతు, వాటిని పెంచడం అమ్మవంతు. పెట్టుకునేవంతు ఎవరికొస్తుందో మరి' చంద్రవంక అర్థయుక్తంగా చూచాడతను.

చంద్ర మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయింది.

'చంద్రా!' తన ఆలోచనలలో నుండి తెప్పరిల్లి అతనివైపు చూచింది చంద్ర.

'మన విషయంలో ఏ నిర్ణయానికొచ్చారు?' కుతూహలం తొంగి చూచిందతని స్వరంలో. చంద్ర టిఫెన్ ప్లేట్ టేబిల్‌మీద పెట్టి తన ఫైల్ విప్పి ప్రభాకర్ చేతికి ఓ కవర్ యిచ్చింది. ఆత్రుతగా విప్పి చూచాడతను. అది కామన్‌వెల్త్ స్కాలర్‌షిప్స్ స్కీమ్ క్రింద చంద్రకు కెనడాలో రిసర్చి చెయ్యడానికి స్కాలర్‌షిప్ యిస్తున్నట్లు తెలుపుతున్న కాగితం.

'విదేశాలకు వెళ్ళి రిసర్చి చెయ్యాలని, ఏదో సాధించాలని నేను కన్నకలలు ఫలించడానికి అవకాశం వచ్చింది ప్రభాకర్‌గారూ! నా ప్రయత్నం సక్సెస్ కావడానికి నా సర్వశక్తులూ వినియోగిస్తాను. నేను అనుకున్నది సాధించి తీరతాను.' కలలో వున్నట్లు మాట్లాడుతున్న చంద్ర ప్రభాకర్ ముఖం పాలిపోవడం గమనించలా. నేను ఒట్టి ఎండమావుల వెంట పిచ్చిగా పరుగెత్తడం లేదుకదా అనుకున్నాడు ప్రభాకర్.

'ప్రభాకర్‌గారూ! ట్రైచేస్తే మీకు కూడా అక్కడ జాబ్ దొరకొచ్చు. మనం వెంటనే పెళ్ళి చేసేసుకుందాం. నేనక్కడికి వెళ్ళాక మీకు ట్రై చేస్తాను. అక్కడ నా ఫ్రెండ్స్ యింకా కొంతమంది వున్నారు. వాళ్ళుకూడా మనకు సహాయం చేస్తారు.' ఉత్సాహంగా చెప్పుకుపోతూంది చంద్ర.

అయిపోయింది. ఈ అమ్మాయి తను అతి జాగ్రత్తగా పేర్చి పెట్టుకున్న ఆశలన్నిటిని చెల్లాచెదురు చేసేస్తూంది.

'సారీ చంద్రా! ఫారిన్ రావడమనేది యిప్పట్లో జరగనిపని. నేను ఫారిన్ వచ్చేస్తే అమ్మ ఎక్కడుంటుందని?' జీవం లేనట్లుగా తనచేతిలోని కవర్‌ని టేబిల్ మీదుంచాడు ప్రభాకర్.

'అదేమిటి ప్రభాకర్‌గారూ! మీ అక్క

కలసి బ్రతుకుదాం

లిద్దరున్నారు గదా! మీ అమ్మగారు వాళ్ళిద్దరిలో ఎవరో ఒకరిదగ్గరుంటారు.' తేలిగ్గా తీసేస్తూ అంది చంద్ర.

'నో. అమ్మ ఎప్పటికీ అలా చేయదు. అమ్మ కూతుళ్ళ యింట్లో వుండదు. కొడుకు యిల్లు తనది, కూతురిల్లు పరాయిది అనే సాంప్రదాయాన్ని జీర్ణించుకు పెరిగింది అమ్మ.' ఈ అమ్మాయిని తను అర్థం చేసుకున్నాననుకున్నాడు. ఈ అమ్మాయి మిగతా అమ్మాయిలకంటె భిన్నమైనదని యింత అపురూపంగా తన జీవితంలోకి ఆహ్వానించాడు. వట్టిది. యీ అమ్మాయి మిగతావాళ్ళలానే స్వార్థపరురాలు. పెళ్ళయిన మరుక్షణం నుండి భర్త తనవారితో బాంధవ్యాలన్నిటినీ తెంపేసుకుని కేవలం తన కొంగుపట్టుకు తిరగాలని వాంఛించే అతి సామాన్య యువతి.

'సిల్లీ. కూతురు, కొడుకు ఒకటే కన్నతల్లికి. యింకా యీరోజుల్లో యీ భావాలేమిటండీ!' నిర్లక్ష్యంగా అంది చంద్ర.

'ఈ భావాలు మీకు అర్థం కావులెండి. కఠినత్వం చోటు చేసుకుందతని స్వరంలో. ఓ నిమిషం ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

'చంద్రా!' మృదువుగా పిలిచాడు ప్రభాకర్.

'ఏమిటండీ!'

'నా కోసం మీ నిర్ణయాన్ని మార్చుకోలేరా? నేను ఎంతగానో అభిమానిస్తున్న మీ వెంట ఫారిన్ రావడానికి, మీ కోరికలు తీర్చడంలో సహాయం చెయ్యడానికి నాకు మాత్రం ఉత్సాహం వుండదనుకుంటున్నారా! కాని...నాకు ఊహతెలియకముందే నాన్నగారు పోయారు. అమ్మ మమ్మల్ని ఎంత అపురూపంగా పెంచి పెద్దచేసిందో నాకు తెలుసు. మమ్మల్ని పైకితీసుకురావడంలో ఆవిడ ఎన్ని కష్టాలను తట్టుకుని నిలబడిందో నాకుతెలుసు. దానికి ప్రతిఫలంగా ఆవిడ పెద్దగా ఏమీ కోరుకోవడంలేదు. తన చివరి రోజులు నాదగ్గర గడపాలనుకుంటూంది. అమ్మ కోరిక తీర్చవలసిన బాధ్యత నామీద లేదంటారా? చెప్పండి చంద్రా!' అర్థిస్తున్నట్లున్న అతని కళ్ళను చూడలేకపోయింది చంద్ర.

'మరోసారి ఆలోచించండి చంద్రా! ప్లీజ్!'

'నా బంగారు భవిష్యత్తుని మీ అమ్మగారి అర్థంలేని కోరికకు బలివ్వడం సబబే నంటారా ప్రభాకర్‌గారూ? మీరూ ఆలోచించండి. మీ ఆలోచనల్ని మార్చుకుంటే నేను సంతోషిస్తాను. మనముందు గొప్ప భవిష్యత్తువుంది. ఇలాటి బంధాల్ని తెంచుకోలేకపోతే మనం అభివృద్ధిని సాధించలేం. అంత స్పష్టంగా చెప్తూన్న చంద్రవంక దెబ్బతిన్నవాడిలా చూసాడు ప్రభాకర్.

'ఆలోచించండి.' యింక యిదే ఆఖరు మాటన్నట్లుగా చంద్ర ఫైల్ తీసుకుని లేచింది.

'వెళ్ళొస్తానమ్మా!' అంది వంటింటి గుమ్మందగ్గరకు వెళ్ళి. కాఫీ కప్పులు తీసుకు వస్తూంది సుభద్రమ్మ.

'కాఫీ తీసుకు వెళ్ళమ్మా!' అంది ఆవిడ. తన కొడుకు ప్రేమిస్తున్న యీ అమ్మాయి కొడుకు సుఖపడేలా చేస్తుందా! తనని ప్రేమగా చూస్తే మంచిదే. కాకపోయినా...తనకు బ్రతుకుతో రాజీపడడం అలవాటయిపోయింది. అన్నిటికీ తలవంచేసి ఎలాగో రోజులు వెళ్ళమార్చుకోగలదు. కాని తన కొడుక్కి సుఖశాంతులు లేకపోతే మాత్రం తను భరించలేదు.

'వస్తానండీ!' కాఫీకప్పు క్రింద వుంచుతూ అంది చంద్ర.

'మంచిదమ్మా!'

గేటువరకు చంద్రను సాగనంపడానికి వెళ్ళాడు ప్రభాకర్.

'యింక మీరుండండి. రేపు సాయంత్రం బీచ్‌లో కలుద్దాం.' అతని చూపుల్ని తప్పించుకుని చకచక వెళ్ళిపోయింది చంద్ర. సర్వం కోల్పోయినట్లుగా గేట్‌దగ్గర నిలబడిపోయాడు ప్రభాకర్.

* * *

పదవ నెంబర్ బస్‌లోనుండి దిగిన ప్రభాకర్ బీచ్‌లోకూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న చంద్రకళ, విమల, స్వప్న, మధుసూధనరావులని చూచి అటు వచ్చాడు.

'హలో' అంటూ లేచాడు మధుసూధనరావు.

'రండి. కూర్చోండి' నవ్వుతూ ఆహ్వానించింది చంద్రకళ. ఆమె నవ్వు ముఖం చూచి తన ఆలోచనని మార్చుకుందేమోననే

ఆశ కలిగింది ప్రభాకర్ కి.

'మా చంద్రకు స్కాలర్‌షిప్ వచ్చినందుకు క్వాలిటీ ఐస్‌క్రీమ్ తినిపిస్తానన్నారండీ' ఎప్పుడూ గలాగలా నవ్వుతూ మాట్లాడే మధుసూధనరావు చూడగానే స్నేహపాత్రుడనిపిస్తాడు.

'బావుందండోయ్. స్కాలర్‌షిప్ వచ్చినందుకు పార్టీ ఆవిడ యివ్వాలికాని మీరివ్వడమేమిటి?'

'అన్నా చెల్లెళ్ళలో ఆ భేదం పొరపాటునైనా చూపించావంటే మనమీదకు దండెత్తి వస్తారండోయ్' అంది చిన్నగా నవ్వుతూ విమల.

ఐస్‌క్రీమ్ తిన్నాక మధుసూధనరావు దంపతులు ఓ ఫ్రెండ్ యింటికి వెళ్ళాలని పిఠాపురం క్వార్టర్స్‌వైపు వెళ్ళిపోయారు. చంద్ర, ప్రభాకర్ రెస్టారెంట్ ప్రక్కనే నీళ్ళకు దగ్గర్లోవెళ్ళి కూర్చున్నారు.

'బాగా చలిగావుంది కదూ?' పమిట కొంగు భుజాలచుట్టూ కప్పుకుంటూ అంది చంద్ర.

'అవును' ఏదో ఒకటి మాట్లాడాలి అన్నట్లుగా అన్నాడు ప్రభాకర్. ఎవరికి వారు రెండవవారు తను నిర్ణయాన్ని మార్చుకున్నారేమోననే ఆశతో వున్నారు—

'ప్రభాకర్‌గారూ!' దూరంగా వున్న ఓ అందమైన జంటవైపుచూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తున్న ప్రభాకర్ చంద్రవైపు చూశాడు.

'ఏమని నిర్ణయించారు?' ఓక్షణం మౌనంగా వుండిపోయాడు ప్రభాకర్.

'నా నిర్ణయం మీరు విన్నదే. మార్పేమీ లేదు. అమ్మను బాధపెట్టలేను నేను' విచారంగావున్నా, దృఢంగా అన్నాడు.

'అయితే... నేను నా నిర్ణయాన్ని మార్చుకోకపోతే అమ్మకోసం నన్ను వదులుకోవడానికి సిద్ధమేనన్నమాట, మీరు' నిష్ఠూరంగా అంది చంద్ర.

'సారీ చంద్రకళగారూ! నిజానికి మీ అనుమతి లేకుండా మీ మీద ఆశలు పెంచుకోవడం తప్పేనేమో! యిప్పటివరకూ నా సర్వస్వంగా భావించి ఊహల్లుకున్న నాకు యిక మీరేమీ కారనే ఊహరాగానే చాల బాధగా వుంది.'

'బాధేముందిలెండి. నాలాటి అమ్మాయిలు కోకొల్లలు. మీతో జీవితాన్ని పంచుకోవడానికి సిద్ధపడే అమ్మాయిలెంతోమంది వున్నారు.'

'ఊహూ. మీలాంటి వాళ్ళెంతోమంది వుండొచ్చు చంద్రా! కాని వాళ్ళంతా నాకు 'మీరు' కాదు' 'మీరు' అనే పదాన్ని వత్తి పలికాడు ప్రభాకర్. ఇప్పటివరకు 'నువ్వు' 'మీరు' లతో తంటాలుపడుతున్న ప్రభాకర్ 'మీరు' అంటానికి శతవిధాలా ప్రయత్నించడం గమనించింది చంద్ర.

'చంద్రా! నేను మీకు ప్రామిస్ చేసినట్లుగా మనం మంచి స్నేహితులంగా మిగలుదాం.' ఎంత ప్రయత్నించినప్పటికి గద్గదముయిందతని స్వరం.


'ప్రభాకర్‌గారూ!' అతని భుజంమీద చెయ్యేసి నవ్వుతూ చూసింది చంద్ర.

'నేనింకా నా ఆఖరి నిర్ణయాన్ని గురించి చెప్పకుండానే అలా అంటారేమిటి? మనం మంచి స్నేహితులంగా మిగలడం కాదు, మనం మంచిదంపతులంగా నిలవడానికి ప్రయత్నిద్దాం. మీకో చిన్న పరీక్ష పెట్టాను. కామన్‌వెల్త్ స్కాలర్‌షిప్ వచ్చినప్పుడు మనసు కొంచెం ఊగిసలాడింది కాని మీ అమ్మను చూశాక, ముఖ్యంగా అమ్మకోసం మీరు నన్ను వదులుకోవడానికి కూడ సిద్ధపడ్డాక నా నిర్ణయాన్ని పూర్తిగా మార్చుకున్నాను. శాశ్వతంగా మీ జీవితంలోకి వస్తున్నాను. భార్యవచ్చిన మరుక్షణంనుండి భార్యకొంగు పట్టుకు వదలకుండా అంతవరకు తన్ప్రాణంగా మెలిగిన అమ్మ సెంటిమెంట్స్‌ను దెబ్బతీసే అబ్బాయిలంటే చిరాకు నాకు. అమ్మకోసం భార్యను నిర్లక్ష్యంచేసే మగవాడినన్నా నేను భరించగలనేమోకాని భార్యకోసం అమ్మను నిర్లక్ష్యంచేసే మగవాడి నీడను కూడ భరించలేను. మీలాంటికొడుకును కన్న అమ్మ అదృష్టవంతురాలు. మిమ్మల్ని కని నాకిచ్చినందుకు అమ్మకు నేనెంతో ఋణపడి వున్నాను.' ఆపకుండా మాట్లాడుతున్న చంద్రవంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు ప్రభాకర్.

'యూ సిల్లీ! ఎంత బాధపెట్టావు నన్ను' చంద్ర నెత్తిమీద ఒక్కదెబ్బ వేశాడు ప్రభాకర్.

'అమ్మతో నేను రేపొస్తానని చెప్పండి. అమ్మ చివరిరోజులు ప్రశాంతంగా గడపడానికి సహకరించి నా ఋణం తీర్చుకుంటానని చెప్పండి.'

'ష్యూర్ ష్యూర్.' నవ్వుతూ చంద్రను దగ్గరకు తీసుకున్నాడు ప్రభాకర్. ●



ప్రశ్నోత్తరం

...కె. రామలక్ష్మి...

వి. ఎమ్. ఎస్., వరంగల్

దేశం అంతా విరసంతో చేయి కలిపి ప్రగతి పథానికి పోతుంటే మీరు నీరసంగా శూన్యంలోకి చూస్తూ కూర్చుంటే ఎలా?

దేశం అంతా విరసంతో చేయి కలిపిందన్న గుడ్ న్యూస్‌కి థాంక్సు. కాని నేను శూన్యంలోకి చూస్తున్నానని ఎవరు చెప్పారు? నేను తొలి కథ రాసినవాడే శూన్యంలోకి చూడ్డం మానేశాను. నా హీరో పేపరేనా తిరగేస్తాడు. గోళ్ళేనా కొరుక్కుంటాడు గాని శూన్యంలోకి చూడడు. విరసంలో చేరడు. ప్రగతిపథాన పోతాడు కాని ఆ సంగతి కోడై కూయడు. పాటి మనిషికీ ఇంతో అంతో మెదడుందనుకుంటాడు గాని తనకే తెలివి తేటలు స్వంతం అనుకోడు. ఇన్ని సుగుణాలున్న హీరోను సృష్టించిన నేను— శూన్యంలోకి చూస్తున్నానని ఎవరంటారు?

జి. వి. ఎమ్., విశాఖపట్నం

కొందరుంటారు—దురదృష్టవంతులు...

ఎంత దురదృష్టవంతులంటే— ఎదురెళ్ళి ఆహ్వానిస్తారు దురదృష్టాన్ని!!

పి. జె. ఆర్, విశాఖపట్నం

ఒకవ్యాసం రాయకపోతే ఆరోజు వృధా అయిపోయిందని భావిస్తారా మీరు?

లేదు. ఒక్కసారేనా పిల్లలతో కలిసి నవ్వుకోకపోతే— ఆ రోజు వృధా అయిపోయిందని బాధ పడతాను.

కె. సి. హెచ్. పి. ఆర్, ఒంగోలు

కొందరెప్పుడూ గతంలోనే బ్రతుకుతూ వుంటారు. ఎందుచేత నంటారు?

జ్ఞాపకాల ఫలాలు కోసుకోవచ్చు తప్పులేదు గాని, అవి కోసుకుంటూంటే వర్తమానపు మొగ్గలకి దెబ్బతగిలే ప్రమాదం రానివ్వ కూడదు. ఎందుకంటారా? వర్తమానం క్షణానికి క్షణం గడచిపోతూంటుంది. గతం అలాగే వుంటుంది. ఇది గుర్తిస్తేనే వర్తమానానికి కూడా తగిన గౌరవం ఇచ్చి బ్రతకకలం కౌనా?

పి. ఎస్, హైదరాబాదు

నేను మితభాషిని. ఇంకా మితభాషిత్వం నేర్చుకోవాలని వుంది. ఆంతర్యం ఏమిటో ఇతరులకు అర్థం అవదు.

ఏముంది వారాని కేడు రోజులు మౌనవ్రతం ప్రారంభించండి. మీ ఆంతర్యం అర్థం చేసుకోవలసిన బాధ్యత మాదికాదు. తెలియ జేయవలసిన బాధ్యతమీది!

జి. ఏ, సిరిసిల్ల

కాలమిస్టు అంటే అర్థం తెలియ చేయరూ?

క్రమం తప్పకుండా ఏదో తానెన్నుకున్న విషయాన్ని ఒక శీర్షికకింద రాసే జర్నలిస్టు —కాలమిస్టు. 'కాలమ్' రాసేవాడు. ఉదాహరణకి— ఒక వారం విపరీతం శీర్షిక ఫాలాక్షుడు కాలమిస్టు. ఇలాగే ప్రత్యేక శీర్షికలు నిర్వహించేవారు.

కె. ఎస్, నాయుడుపేట

మీరు శ్రీశ్రీ గారిని గురించి 'కమ్యూనిస్టులు ఇచ్చారు. వారే పుచ్చుకున్నారు' అని హేళన చేశారు.

హేళన కాదది. నిజం. తొలిసారిగా 'మహాకవి'గా శ్రీశ్రీని పేర్కొన్నదీ కమ్యూనిస్టులు. తొలిసారిగా 'మహాకవి' వదలి ఉట్టి శ్రీరంగం శ్రీనివాస రావుగా శ్రీశ్రీగా పేర్కొన్నది— కమ్యూనిస్టులే. విశాలాంధ్ర ఫైళ్ళు తిరగేయండి.

హెచ్. ఎస్, పాలకొండ

మనసులోని కోరికలను బయటకు తెలుపలేని వారిని ఏమనాలి?

ఏమీ చెప్పనక్కరలేదు. ఆడదాని మాటలకు అర్థాలు వేరని—గ్రహిస్తారెదుటివారు.

వి. టి. ఎన్, చిలకపాడు

కులమత భేదములు వుండకూడదంటూనే ప్రతి అప్లికేషన్ ఫారములోనూ నీ కులం ఏమిటి? నీ మతం ఏమిటి? అని అడుగుతారెందుకు?

అడిగితే మీరెందుకు చెప్పాలి? రాయక పోతే సరి! మా పిల్లల బర్త్ సర్టిఫికేట్‌లో ఇండియన్ అని రాశాము. ఎవరూ తప్పుపట్టలేదే?! మీ 'దం ఒట్లో' రాయమని నిర్బంధించలేదే!

ఎస్. వి. ఆర్, మద్రాసు

ఇంత ఓపిక వున్నవారుంటారని నేను కలలో కూడా అనుకోలేదు. పత్రిక వారు మీకు ఎంత ముట్టచెప్తారు?

అదీ అసలు సంగతి! అడక్కూడని ప్రశ్న అడగడానికింత శాఖా చంక్రమణం ఎందుకు? సూటిగానే అడగవచ్చు కదూ? ఇన్ కమ్ టాక్సు వారా లెక్కలడుగుతున్నారు?!

బి. హెచ్. వి ఎల్, కలకత్తా

నాకు రచయిత్రి కావాలని ఉందండి.

ఇదిగో దారి: జయశ్రీ పబ్లికేషన్స్ నారాయణ గూడ. హైదరాబాద్—29 వారు. కవిత పంపితే 10రూ. కథ అయితే 12 రూ. మనిఆర్డరు పంపితే— 116 సభ్యులుకాగానే పుస్తకం వేస్తారుట!!! నాకో కరపత్రం పంపారు.

టి. ఎస్. వి, గుంటూరు

మీ జవాబులు రెండువైపులా పదును న్న చురకత్తిలా వుంటాయి. ఒక వైపు మెత్తగా ఆప్యాయతగా వుంటే రెండోవైపు వేడిగా వాడిగా సూటిగా గుచ్చుకుంటాయి.

ప్రేమకి విరహం లాగ నిజానికో చురకా అవసరం శోభా, విరహంతో ప్రేమ బలపడుతుంది. చురకతో తగిలిన నిజం శాశ్వతంగా జ్ఞాపకం వుంటుంది. అవునా?

ఎస్. డి ఎస్, వాల్తేరు

నిజ జీవితంలో పురుషులు విగ్గు ధరించవచ్చునా?

ఎందుకు ధరించకూడదు. స్త్రీలు సవరాలు కొప్పులు, ధరించడం లేదా? పురుషులకు సహితం ఈ రోజుల్లో చక్కని విగ్గులు దొరుకుతున్నాయి.

తకొకటి తీసుకున్నాడు.

'ఎక్కడెందుకు బాబూ యీ యిరుకులో. నీ రూమ్‌లో కూర్చుని తీసుకోండి. కూర పొయ్యిమీద పడేసి నేనూ వస్తాను' అంది సుభద్రమ్మ కూరకు తాలింపు వేస్తూ.

'పదండి మరి' మంచినీళ్ళ గ్లాసులు రెండూ తీసుకుని తనగదిలోకి బయల్దేరాడు ప్రభాకర్. ప్లేట్స్ తీసుకుని అతనివెనుక నడిచింది చంద్ర. టేబిల్ ముందున్న కుర్చీని మంచానికెదురుగా లాగి చంద్రకు కుర్చీ చూపించాడు. తను మంచంమీద కూర్చుని ప్లేట్ తీసుకుని తినడం ప్రారంభించాడు. అతని వెనుకగా కిటికీలో నుండి కన్పిస్తున్న గులాబీలను కనకాంబరాల్ని చూస్తూంది చంద్ర.

'ఉన్న కాస్త స్థలంలో మొక్కల బలే వేసారే?' అంది చంద్ర మెచ్చుకోలుగా చూస్తూ.

'వెయ్యడంవరకే నావంతు, వాటిని పెంచడం అమ్మవంతు. పెట్టుకునేవంతు ఎవరికొస్తుందో మరి' చంద్రవంక అర్థయుక్తంగా చూచాడతను.

చంద్ర మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయింది.

'చంద్రా!' తన ఆలోచనలలో నుండి తేప్పరిల్లి అతనివైపు చూచింది చంద్ర.

'మన విషయంలో ఏ నిర్ణయాని కొచ్చారు?' కుతూహలం తొంగి చూచిందతని స్వరంలో. చంద్ర టిఫెన్ ప్లేట్ టేబిల్‌మీద పెట్టి తన ఫైల్ విప్పి ప్రభాకర్ చేతికి ఓ కవర్ యిచ్చింది. ఆత్రుతగా విప్పి చూచాడతను. అది కామన్‌వెల్త్ స్కాలర్‌షిప్స్ స్కీమ్ క్రింద చంద్రకు కెనడాలో రిసర్చి చెయ్యడానికి స్కాలర్‌షిప్ యిస్తున్నట్లు తెల్పుతున్న కాగితం.

'విదేశాలకు వెళ్ళి రిసర్చి చెయ్యాలని, ఏదో సాధించాలని నేను కన్నకలలు ఫలించడానికి అవకాశం వచ్చింది ప్రభాకర్‌గారూ! నా ప్రయత్నం సక్సెస్ కావడానికి నా సర్వశక్తులూ వినియోగిస్తాను. నేను అనుకున్నది సాధించి తీరతాను.' కలలో వున్నట్లు మాట్లాడుతున్న చంద్ర ప్రభాకర్ ముఖం పాలిపోవడం గమనించలా. నేను ఒట్టి ఎండమావుల వెంట పిచ్చిగా పరుగెత్తడం లేదుకదా అనుకున్నాడు ప్రభాకర్.

'ప్రభాకర్‌గారూ! ట్రై చేస్తే మీకు కూడా అక్కడ జాబ్ దొరకొచ్చు. మనం వెంటనే పెళ్ళి చేసేసుకుందాం. నేనక్కడికి వెళ్ళాక మీకు ట్రై చేస్తాను. అక్కడ నా ఫ్రెండ్స్ యింకా కొంతమంది వున్నారు. వాళ్ళుకూడా మనకు సహాయం చేస్తారు.' ఉత్సాహంగా చెప్పుకుపోతూంది చంద్ర.

కలసి బ్రతుకుదాం

అయిపోయింది. ఈ అమ్మాయి తను అతి జాగ్రత్తగా పెర్చి పెట్టుకున్న ఆశలన్నిటిని వెల్లావెదురు చేసేస్తూంది.

'సారి చంద్రా! ఫారిన్ రావడమనేది యిప్పట్లో జరగనిపని. నేను ఫారిన్ వచ్చేస్తే అమ్మ ఎక్కడుంటుంది?' జీవం లేనట్లుగా తనచేతిలోని కవర్‌ని టేబిల్ మీదుంచాడు ప్రభాకర్.

'అదేమిటి ప్రభాకర్‌గారూ! మీ అక్కలిద్దరున్నారు గదా! మీ అమ్మగారు వాళ్లిద్దరిలో ఎవరో ఒకరిదగ్గరుంటారు.' తేలిగ్గా తీసేస్తూ అంది చంద్ర.

'నో. అమ్మ ఎప్పటికీ అలా చేయదు. అమ్మ కూతుళ్ళ యింట్లో వుండదు. కొడుకు యిల్లు తనది, కూతురిల్లు పరాయిది అనే సాంప్రదాయాన్ని జీర్ణించుకు పెరిగింది అమ్మ.' ఈ అమ్మాయిని తను అర్థం చేసుకున్నాననుకున్నాడు. ఈ అమ్మాయి మిగతా అమ్మాయిలకంటె భిన్నమైనదని యింత అపురూపంగా తన జీవితంలోకి ఆహ్వానించాడు. వట్టిది. యీ అమ్మాయి మిగతావాళ్ళలానే స్వార్థపరురాలు. పెళ్ళయిన మరుక్షణం నుండీ భర్త తనవారితో బాంధవ్యాలన్నిటినీ తెంపేసుకుని కేవలం తన కొంగుపట్టుకు తిరగాలని వాంఛించే అతి సామాన్య యువతి.

'సిల్లీ. కూతురు, కొడుకు ఒకటే కదా తల్లికి. యింకా యీరోజుల్లో యీ భావాలేమిటండీ!' నిర్లక్ష్యంగా అంది చంద్ర.

'ఈ భావాలు మీకు అర్థం కావులెండి. కఠినత్వం చోటు చేసుకుందతని స్వరంలో. ఓ నిమిషం ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

'చంద్రా!' మృదువుగా పిలిచాడు ప్రభాకర్.

'ఏమిటండీ!'

'నా కోసం మీ నిర్ణయాన్ని మార్చుకోలేరా? నేను ఎంతగానో అభిమానిస్తున్న మీ వెంట ఫారిన్ రావడానికి, మీ కోరికలు తీరడంలో సహాయం చెయ్యడానికి నాకు మాత్రం ఉత్సాహం వుండదనుకుంటున్నారా! కాని...నాకు ఊహతెలియకముందే మానాన్నగారు పోయారు. అమ్మ మమ్మల్ని ఎంత అపురూపంగా పెంచి పెద్దచేసిందో నాకు తెలుసు. మమ్మల్ని పైకితీసుకురావడంలో ఆవిడ ఎన్ని కష్టాలను తట్టుకుని నిలబడిందో నాకుతెలుసు. దానికి ప్రతిఫలంగా ఆవిడ పెద్దగా ఏమీ కోరుకోవడంలేదు. తన చివరి రోజులు నాదగ్గర గడపాలనుకుంటూంది. అమ్మ కోరిక తీర్చవలసిన బాధ్యత నామీద లేదంటారా? చెప్పండి చంద్రా!' అర్థిస్తున్నట్లున్న అతని కళ్ళను చూడలేకపోయింది చంద్ర.

'మరోసారి ఆలోచించండి చంద్రా! ప్లీజ్!'

'నా బంగారు భవిష్యత్తుని మీ అమ్మగారి అర్థంలేని కోరికకు బలివ్వడం సబబేనంటారా ప్రభాకర్‌గారూ? మీరూ ఆలోచించండి. మీ ఆలోచనల్ని మార్చుకుంటే నేను సంతోషిస్తాను. మనముందు గొప్ప భవిష్యత్తువుంది. ఇలాటి బంధాల్ని తెంచుకోలేకపోతే మనం అభివృద్ధిని సాధించలేం.' అంత స్పష్టంగా చెప్తున్న చంద్రవదన దెబ్బతిన్నవాడిలా చూశాడు ప్రభాకర్.

'ఆలోచించండి.' యింక యిదే ఆఖరు మాటన్నట్లుగా చంద్ర పైల్ తీసుకుని లేచింది.

'వెళ్ళొస్తానమ్మా!' అంది వంటింటి గుమ్మందగ్గరకు వెళ్లి. కాఫీ కప్పులు తీసుకు వస్తూంది సుభద్రమ్మ.

'కాఫీ తీసుకు వెళ్ళమ్మా!' అంది ఆవిడ. తన కొడుకు ప్రేమిస్తున్న యీ అమ్మాయి కొడుకు సుఖపడేలా చేస్తుందా! తనని ప్రేమగా చూస్తే మంచిదే. కాకపోయినా...తనకు బ్రతుకుతో రాజీపడడం అలవాటయిపోయింది. అన్నిటికీ తలవంచేసి ఎలాగో రోజులు వెళ్ళమార్చుకోగలదు. కాని తన కొడుక్కి సుఖశాంతులు లేకపోతే మాత్రం తను భరించలేదు.

'వస్తానండీ!' కాఫీకప్పు క్రింద వుంచుతూ అంది చంద్ర.

'మంచిదమ్మా!'

గేటువరకు చంద్రను సాగనంపడానికి వెళ్లాడు ప్రభాకర్.

'యింక మీరుండండి. రేపు సాయంత్రం బీచ్‌లో కలుద్దాం.' అతని చూపుల్ని తప్పించుకుని చకచక వెళ్లిపోయింది చంద్ర. సర్వం కోల్పోయినట్లుగా గేట్‌దగ్గర నిలబడిపోయాడు ప్రభాకర్.

* * *

పదవ నెంబర్ బస్‌లోనుండి దిగిన ప్రభాకర్ బీచ్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న చంద్రకళ, విమల, స్వప్న, మధుసూధనరావులని చూచి అటు వచ్చాడు.

'హలో' అంటూ లేచాడు మధుసూధనరావు.

'రండి. కూర్చోండి' నవ్వుతూ ఆహ్వానించింది చంద్రకళ. ఆమె నవ్వు ముఖం చూచి తన ఆలోచనని మార్చుకుందేమోననే

నవ్వా - లవ్వా



కృష్ణగార్కి

నమస్కారాలు

మీరు పత్రికల్లో వ్రాసిన 'అడమ్మాయి' కథ బోల్డు హాస్యంగా వుంది. చాలాసేపు నవ్వుకున్నాను. లవ్వుకన్నా నవ్వేగొప్పదని వ్రాసారు. కథ బాగానే వుంది. లవ్వు చేయడం చేతకానివాళ్ళుకూడ నవ్వగలరు. నవ్వడం చేతకానివాళ్ళుమటుకు లవ్వు చేయలేరని ఖచ్చితంగా చెప్పగలను. (అనుభవం నుకోగలరు. నా అభిప్రాయము మాత్రమే.)

ఎప్పుడూ మీ కలంనుంచి నవ్వుకథలేగాని లవ్వు కథలు రావా !? మీ నవ్వు కథలు నాకు చాలా యిష్టం. అంతకన్నా మీ కలంనుంచి లవ్వుకథలు వస్తే ఆనందిస్తాను. ఈసారి లవ్వు కథకే ప్రాముఖ్యతనిస్తూ ఒక కథ రాయండి. సంతోషిస్తాను.

మీ

అభిమాన పాఠకురాలు

రాధ

విశాఖ-ఒకటి

నవంబర్—రెండు

రాధగార్కి

నమస్తే

అభిమానంతో వ్రాసిన లెటరు అందినది. నా కథపై చూపిన విమర్శలాంటి చిన్న అభిప్రాయానికి పెద్దగా కృతజ్ఞతలు. నేనింతవరకు నవ్వు కథలే రాసాను. జీవితంలో ప్రతి ఒక్కరు నవ్వుతూ సరదాగా గడపాలనే అభిప్రాయం నాది. ఇకపోతే మీకు లవ్వు కథలంటే యిష్టం. అటువంటి కథలు వ్రాయమన్నారు. మీరిచ్చే ప్రోత్సాహమే నాకు ఉత్సాహాన్నిస్తుంది.

'ప్రతిఒక్కరు జీవితంలో తప్పక ప్రేమించాలని' ఏదో సినీడైలాగు నాకింకా గుర్తుంది. తప్పకుండా లవ్వుకథ రాస్తాను. వ్రాసి మీకు పంపుతాను. ఆ కథపై మీ అభిప్రాయం తెలియజేయండి.

యింతకీ మీరు ఏమి చేస్తున్నారో తెలియచేయలేదు.

మీరు అభిమానించిన రచయిత

కృష్ణ.

హైదరాబాద్-2

11—11—68

పాకాటి బాబు

నవ్వా-లవ్వా

శ్రీ కృష్ణగారికి
నమస్కారాలు

మీ కవరు చేరింది. సంతోషించాను. రచయితలకు లెటర్స్‌రాస్తే జవాబులివ్వరని, చాలాగర్వంగా వుంటారనే, ఉద్దేశ్యం చాలా రోజులనుండి నాటుకు పోయింది. నేనను కున్నవన్నీ వచ్చి అసత్యాలని కొద్ది ఆలస్యంగా తెల్సుకున్నాను. మీవద్దనుంచి పుత్తరములు రావటం నాకు చాలా ఆనం దంగా వుంది.

యిక్కడ నేను బి. ఏస్.సి చదువు కున్నాను. ఎంత చదివినా యింటిదగ్గర పొయ్యి ఊదుకోవటమే గదండీ (అంటే వంటచేయటం అర్థం. ఈమధ్య పత్రి కల్లో కార్టూనులు చూస్తూంటే వంట పెవ్యాగ్రి పురుషుల చేతుల్లోకి వచ్చే ట్టుంది.) మీ లవ్వు కథ ఎంతవరకు వచ్చింది.

యింతకీ మీరేం చేస్తున్నారో తెలియ కేయకపోవటం చాలా ఆశ్చర్యంగా వుంది.

మీ లెటరుకోసం

రాధ.

విశాఖ—1

10—12—68

డియర్ రాధ

మీరు ఎప్పుడో రాసిన కవరు చాలా రోజుల క్రిందటే అందింది. వూళ్ళో లేక పోవటం మూలంగా ఆలశ్యంగా రిప్లయి యిస్తున్నాను. ఆలశ్యానికి సారీ చెప్పినా సరే నాకు సారోగానే వుంటుంది.

మీరు లవ్వుకథ రాయమని రాసారు. నాకు నవ్వు. మీకు లవ్వు యిష్టం. ఈవాళ లవ్వో — నవ్వో తేల్చుకోవాలి.

'లవ్వు గుడ్డిది' అన్నారు లవ్వు చేయని వాళ్ళు.

'నవ్వు నాలుగు విధాల చేటు' అన్నారు నవ్వలేని వాళ్ళు. యిలా వాటిపై చాలా అభిప్రాయాలున్నాయి. ఈ కథ చదివి మీ అభిప్రాయం రాయండి.

'నవ్వా — లవ్వా' అనే విషయంపై దేవలోకంలో ఒకసారి పెద్ద చర్చ జరిగింది. అని మా తాత చెప్పేవాడు. నా కథలు అన్నీ తాతయ్య కథలు అనుకునేరు. అలా అనుకుంటే మీరు పెద్దపొరపాటు చేసినట్టే. గాంధీతాత మొదట యేకుపట్టి దారం తీయటం మొదలుపెట్టాడు. చాలామందికి అది నవ్వులాటగానే వుండేది, ముఖ్యంగా తెల్లవాళ్ళకి. చివరికి సదరు ఏకుమేకై కూర్చుంది. అలాగే తాతయ్య కథలు ఒక నాటికి బహుమతి కథలై కూర్చుంటాయి. యిక దేవలోకానికి వద్దాం...

దేవేంద్రుడు సభలో లవ్వుగొప్పదా? నవ్వుగొప్పదా ?— అని అడిగాడు. రంభ పార్టీవారు 'లవ్వుగొప్పది' అన్నారు, నవ్వు గొప్పదని చెప్పారు నారదపార్టీవారు.

దేవేంద్రుడెలా ? అన్నాడు రంభవైపు చూస్తూ—

—రంభ చెప్పినకథ—

విశ్వామిత్రుడు అడవులకు పోయి ఘోరంగా తపస్సు చేయసాగాడు, యిలా మరి కొన్నాళ్ళు ఘోరంగా తపస్సుచేస్తే సర్వలోకాలు అతనికి లొంగి వుండేవి. దేవేంద్రుడు చాలా భయపడ్డాడు. దేవేంద్రుడు మొదలైన పెద్దలు విశ్వామిత్రుని తపస్సు భంగపరచాలని ఆలోచించారు. ఆలోచించి విశ్వామిత్రుని దగ్గరకు మేనకను పంపేరు. విశ్వామిత్రుడు మేనకను చూసేడు. పరదావడి ప్రేమించాడు. అన్నిలోకాలు పోయాయి. ఒక్క ప్రేమలోకం తప్ప. లవ్వాడకుండా బుద్ధిగా తపస్సు చేసివుంటే సర్వలోకాలు అతని వశమై పోయేవి.

ఆనాడుగాని ఈ లవ్వు అనబడే రెండక్షరాలు లేకపోతే మన దేవేంద్రునిపని గోవిందగా అంటూ ఓరగా దేవేంద్రుని చూస్తూ పమిటసర్దుకుంది.

నారదుడు పెద్దగా నవ్వేడు. రంభ మూతి ముడుచుకుంది:

నవ్వుకి కారణం అడిగేడు దేవేంద్రుడు,

'చెప్తాను. రంభ ఎప్పుడో జరిగిన కథచెప్పి లవ్వు గొప్పదంది. నేను అమ్మమ్మ కథలు చెప్పను. ప్రస్తుతం జరుగుతున్న కథ చూపెట్టదలచాను' అంటూ అందర్ని భూలోకానికి తీసుకువచ్చేడు.

ఆ కనబడే యిల్లు చూడండి. అందులో యిద్దరు కాలేజీ అబ్బాయిలున్నారు. వాళ్ళు నవ్వు గొప్పదని నిరూపిస్తారు.

అది విశాలంగా లేని విశాఖపట్నం. ఆ పట్నంలో యిరుకుగా వున్న చెంగల్రావు పేటలో ఒకరూము, అందులో యిద్దరు అబ్బాయిలు. కాలేజీలో చదువుకుంటున్నారు. ఆనందరావు అందమైనవాడు. సుందరం సుందరంగా లేకపోయినా చూడడానికి బాగానే వుంటాడు. సుందరానికి లవ్వు, ఆనందరావుకు నవ్వు యిష్టం. యిద్దరికీ కథలు రాయడం సరదా. సుందరం కథలన్నీ ప్రేమతో నిండి వుండేవి. ఆనందరావు కథలన్నీ జోకులతో వుండేవి.

ఆవేళ ఆదివారం.

కాలేజీకి శలవు.

నవ్వుకథ రాయాలనుకున్నాడు ఆనందరావు. ఆ కథలో ప్రేమలేఖతో మొదలు పెట్టాలి. లవ్వుకథలు రాసే సుందరాన్ని పిలిచి—'ఒక లవ్వులెటర్ రాసిపెట్టరా' అన్నాడు. సుందరం బోల్డు ఆశ్చర్య పోయేడు. ఆనందరావు లవ్వుకి చాలా దూరంలో వుంటాడు. ఎప్పుడు ఆంజనేయ దండకం, వివేకానందకథలు చదివే ఆనందరావు అమ్మాయిని ప్రేమించడం అమ్మాయికి లవ్వులెటర్స్‌రాయడం అంతా ఆశ్చర్యంగా వుంది.

'ఎందుకురా ఆశ్చర్యపోతావు. నాకథలో మొదట హీరోయిన్‌కు లవ్‌లెటర్ నేహీరో పోస్టుచెయ్యాలి. యిక ఆశ్చర్యం తగ్గించి లెటర్ వ్రాయి.'

'అదా సంగతి. కథలో లవ్‌లెటర్ ఎలా వుండాలి. సందర్భం కావాలి.'

'శ్రద్ధగావిను. కాలేజీలో అందమైన సుందరి వుంటుంది. ఆ అమ్మాయిపేరు 'ప్రేమ'. ప్రేమకి ప్రేమమీద నమ్మకం జాస్తి. అదే కాలేజీలో 'శేఖర్' అనే అబ్బాయి చదువుతున్నాడు. శేఖర్ ప్రేమని గాఢంగా ప్రేమిస్తున్నాడు. ప్రేమకు శేఖర్‌పై ప్రేమ లేదు. ప్రేమ తన క్లాస్ మేట్ అయిన రవిని ప్రేమిస్తోంది. ఈ సంగతి శేఖరుకు తెలుస్తుంది. యిప్పుడు శేఖర్ ఒక లవ్వు లెటర్ రాయాలి?'


'అయితే రాసుకో'—అంటూ సుందరం చెప్పటం మొదలు పెట్టాడు.

'ప్రియమైన ప్రేమకి రవి రాసేది...'

'ఆగరా బాబూ. లవ్వు లెటర్ శేఖర్‌కు రాయాలి.'

'తెలుసు ప్రేమలేఖలు చాలా రకాలుగా వుంటాయి. నవ్వడం అనుకున్నావా!' అంటూ సుందరం మలభంగ నవ్వేశాడు.

'నవ్వులుకూడ చాలా రకాలుగా వుం



ఎద్దుకి ఎద్దు సమవుజ్జీ ఉన్నప్పుడే మంచి జత

ఎరువుల విషయంలో కూడ అంతే నేల అవసరాలకు అవి సరితూగాలి. కాబట్టి మీరు మీ నేలను పరీక్ష చేయించాలి. మంగళగిరిలో నున్న ట్రాంబేవారి భూసార పరిశీలనా కేంద్రములో ఎఫ్. సి. ఐ. ఈ పని ఉచితముగా చేసిపెడుతుంది. నేలగురించి మరియు ఎరువుల సిఫార్సులను గురించిన ఎఫ్.సి.ఐ వారి నివేదిక మీచేతుల్లో ఉందా అంటే, సమృద్ధికరమైన పంటలు పండించటానికి మీకుకావలసిన ఎరువులనూ ఎన్నుకోవచ్చు. ఎఫ్.సి.ఐ వారి స్థానిక ప్రతినిధులవద్దగాని లేదా వారి డీలర్ల వద్దగాని ఉచిత కరపత్రములను పొందండి.



వ్యవసాయములో మొదటిమెట్టు అయినటువంటి "మీ నేల నెరిగి పంట పండించండి" అనబడే సూత్రాన్ని గుర్తుంచుకోండి.

ఇతర వివరములకు వ్రాయండి.

ది ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

(కేంద్రప్రభుత్వ యాజమాన్య సంస్థ) ట్రాంబే యూనిట్

5-10-173, ఫతేమైదాన్ రోడ్, హైదరాబాద్-4

టాయి. ముళ్ళపూడి ఇంగ్లీషులో నవ్వుతాడు. పానుగంటి తెనుగులో నవ్వుతాడు. నువ్వు అన్ని భాషలలోను వంకరగా నవ్వుతావు. అల్లరి చేయక పూర్తిగా రాయి ఏంతవరకు వచ్చింది;'

'ప్రియమైన ప్రేమకు ప్రేమతో రవి రాశేది...'

నీవంటే నాకు చాల యిది. నీవు చాలా అందంగా ముద్దుగా వుంటావు. నీకు లవ్వుంది. నవ్వుంది. నాకు నవ్వుతూ లవ్వాడడమంటే చాలా యిష్టం. నీవు నన్ను ప్రేమిస్తున్నావని తెలియజేయటానికి వచ్చే మంగళవారం కాలేజీకి వచ్చేటప్పుడు రెండు జడలు వేసుకో. నాకిష్టమైన మల్లెపూలు ఒక జడలో పెట్టుకో.

మరో సంగతి

ఒకే కాలికి చెప్పు వేసుకురా! రెండవ కాలికి వేసుకోకు. అలా వేసుకునివస్తే నీ స్నేహితులు నవ్వుతారని అనుకోకు. నీ స్నేహితులు విరగబడి నవ్వుతూ మరో జోడు వేసుకోవడం మరిచిపోయావా, అలా అడిగేవారికోసం నీకో మంచికథలాంటి జవాబు చెప్పుతాను.

యింటి దగ్గర్నుంచి వస్తూవుంటే ఒక రోమియో ఏమండి నేను మిమ్మల్ని మన స్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. మీరు లేక పోతే బతకలేను అంటూ ముద్దు పెట్టుకోడానికి దగ్గరకువచ్చేడు. భలే కోపమొచ్చింది.

నవ్వా-లవ్వా

భయపడ్డాను. చెప్పుతీసి పైకి విసిరేను. వాడు నవ్వుతూ...పోనీలెండి. మీరు నన్ను ప్రేమించకపోయినా ఫరవాలేదు. ఈ చెప్పు మన ప్రేమకి చిహ్నంగా ఉంచుకుంటాను. అంటూ పట్టుకుని చక్కా పోయాడు.

భరతుడు శ్రీరాముని పాదుకని తీసుకొని వెళ్ళినట్టు.

చాలా రాసేను.

యికవుంటా...

మంగళవారం

నీకోసం ఎదురుచూస్తూ

నీ

రవి

'యిల్లా రాసావంటే ప్రేమకి రవిపైన కోపమొస్తుంది. లవ్వాడడం మానేస్తుంది. అప్పుడు శేఖర్ చక్కగా సరదాగా లవ్వు లెటర్స్ రాస్తాడు. ప్రేమ సంతోషంతో శేఖర్ని ప్రేమిస్తుంది. ఎలావుంది?'అంటూ బ్రహ్మాండమైన సలహా యిచ్చానని పొంగిపోయాడు.

'బాగుంది. కథ అడ్డం తిరుగుతుంది! అప్పుడు ప్రేమ ఏమని రాస్తుందో తెలుసా?'

'తెలుసు'

'అయితే చెప్పు'

ప్రియమైన రవిగారికి ప్రేమ రాసేది.

మీరు నన్ను ప్రేమిస్తున్నందుకు చాలా ఆనందంగా వుంది. మీరు లవ్ లెటర్స్ కూడా చాలా సరదాగా రాసారు. 'చెప్పుకథ' బాగుంది. నవ్వుకున్నాను మీ చమత్కారానికి. నేను మంగళవారం వరకు ఆగలేను. రేపు ఆదివారం సాయంత్రం నాలుగ్గంటలకు రామక్రిష్ణా బీచ్‌లో కలుసుకుందాం. బోల్డు సంగతులు సరదాగా మాట్లాడుకుందాం

ఆదివారం మీకోసం

మీ

ప్రేమ.

తా॥ క॥: మీ కిష్టమైన మల్లెపూలు పెట్టుకొని వస్తా!

ఆనందరావు బిగ్గరగా నవ్వాడు.

'అడ్డం తిరిగినా కథ యిప్పుడు మలుపు తిరిగింది. బాగుంది. నాకథంతా మారిపోయింది. నీకు లవ్ లెటర్స్ రాయటం చేతనవును. అది ఎక్కడ రాయాలో తెలియదు. నేను అడిగిన దానికి సరియైన జవాబు చెప్పాలి. నీ రెండు లెటర్స్ చదివితే తప్పక నవ్వు వస్తుంది. అని వొప్పుకుంటావా?' నవ్వుతూ అడిగాడు ఆనందరావు.

'ఒప్పుకుంటాను.'

'లవ్వులోకూడ నవ్వుందని లవ్వు చేసి నవ్వుల పాలయినవారు చాలామంది వున్నారని నేను నిరూపిస్తాను. తక్కిన కథ నేను చెప్తాను. విను' అంటూ చెప్పటం మొదలు పెట్టాడు ఆనందరావు.


ప్రేమ రాసిన ప్రేమలేఖ రవికి అందలేదు. శేఖర్ చేతిలో పడింది. శేఖర్ చేతికి చిక్కటానికి కారణం లేకపోలేదు, రవి. శేఖర్ రూంమేట్స్. రవి శ్రద్ధగ చదివే బుద్ధిమంతుడు.

ఆదివారం శేఖర్ నీటుగా తయారై రామ క్రిష్ణబీచ్‌కు తయారయ్యాడు. అదే టైంకు ప్రేమకూడ బీచ్‌కు వచ్చింది.

'హల్లో! ప్రేమ మీరు రాసిన లెటర్ అందింది. మీరు శేఖర్ బదులు రవి అని రాస్తున్నారు. ఇకనుంచి సరిగ్గా రాయండి. రండి. అలా కూర్చుందాం' నవ్వుతూ శేఖర్ ప్రేమదగ్గరకు రాబోయాడు.

జరిగింది గ్రహించింది ప్రేమ. ఎర్రగా వున్న ప్రేమ ముఖం మరీ ఎర్రగా అయింది.

'ఛీ! నీకు బుద్ధిలేదు. ఇంకొకరి



పేరుతో ప్రేమ లేఖలు రాస్తావా? నీ చదువు. సంస్కారం. ఏమయింది' గట్టిగా సినీడైలాగుల్లా తిట్టడం మొదలుపెట్టింది.

ఎన్నితిట్టినా శేఖర్ బాధపడ లేదు తెల్లగావున్న శేఖర్ ముఖం యింకా తెల్లబడలేదు. సిగ్గుపడకుండా నవ్వుతూ —

'ప్రేమ! ప్రేమకు చదువు, సంస్కారం అక్కర్లేదు. చదువులేనివాడుకూడా ప్రేమిస్తాడు.

ఎం. ఏ.లు, పి. హెచ్ డీలు వున్నవాళ్ళు ప్రేమిస్తారనుకునేవు. వాళ్ళకి చదువుతోనే కాలం గడిచిపోతుంది. ఇక ప్రేమకు తావేది. ఇకపోతే సంస్కారమున్నవాడు చూసిన ప్రతీ అమ్మాయిని సోదరిలా చూసుకోవాలి. ఎందుకంటే నేను చాలా సంస్కారం కలవాడిని. సంస్కారం గల పెద్దమనిషికి ప్రేమించాలని వుంటుంది. కాని సంస్కారం అడ్డు వస్తుంది.'

ఈసారి ప్రేమకు పట్టరాని కోపమొచ్చింది. 'మిస్టర్! సరిగ్గా మాట్లాడు. నోటికి వచ్చినట్లు కూయకు' అంది రోషంగా.

'ప్రేమించని ప్రతివాడు సరిగ్గా మాట్లాడలేడు. అది ప్రేమలోని నగ్నసత్యం'

'నటన్' అంటూ ఎడమకాలి చెప్పుతీసి చెప్పిన మీదకు విసరబోయి ఆగి,

'నీవు రాసినకథ నాకింకా గుర్తుంది. అందుకే చెప్పు విసరను' చెప్పుతోకొట్టింది. అక్కడ వున్నవాళ్లంతా అసలుసంగతి తెలుసుకుని నవ్వుకున్నారు.

'ప్రేమ గుడ్డిది. నవ్వుగొప్పది' అంటూ పరుగుతీశాడు శేఖర్. నారదవేషంలోవున్న దేవేంద్రుడు—నారదా! రంభ జరిగినకథ చెప్పి, 'లవ్వు గొప్పదంది.' నీవు 'ప్రేమ గుడ్డిది' అని కథద్వారా నిరూపించావు. కాని అది నిజంగా జరుగలేదుగా!' అన్నాడు.

నారదుడు నవ్వి 'దేవేంద్రా! ప్రస్తుతం పత్రికలలో వచ్చేకథలన్నీ నిజజీవితంలో జరిగే కథలే! యిద్దరు మిత్రులు వ్రాసిన 'గొలుసుకథ' ప్రస్తుత సమాజానికి చాలా దగ్గరలోవుంది.'

'లవ్వుగొప్పది, నవ్వుగొప్పది. రెండూ కలుస్తే—అంటే 'నవ్వులపాలైన లవ్వు' మటుకు ఆరోగ్యానికి, వొంటికి మంచిది కాదు' అంటూ దేవేంద్రుడు సభ చాలించేడు.—

నేనీకథలో లవ్వుకే ప్రాధాన్యత యిచ్చేను.

మీకు లవ్వియిష్టం కాబట్టి పై కథపై మీ అభిప్రాయం, విమర్శకావాలి? ఏ పత్రికకు నంపమంటారు?



నవ్వు-లవ్వు

యికపోతే నాసంగతి వ్రాయమన్నారు. యం. ఏ. పాసు అయ్యేను. ఉద్యోగం లేదు కథలు వ్రాస్తూ తాతలు గడించిన ఆస్తిని ఖర్చుచేస్తూ సరదాగా గడుపుతున్నాను.

మరి వుంటా

మీ

కృష్ణ.

డియర్ కృష్ణ

మీరు ప్రేమతో వ్రాసినకవరు అందింది.

లవ్వుకథ సరదాగ వుంది. మీరు లవ్వుకథ చాలా సీరియస్‌గ వ్రాస్తారనుకున్నాను. కాని ఆ నవ్వుకథలో లవ్వుకథ కూడా హాస్యంగా వ్రాసేసారు. ఏమైనా కథ బావుంది.

మీకో శుభవార్త వ్రాస్తున్నాను. నేను ఆదివారం మీ వూరు వస్తున్నాను, ఎక్స్‌ప్రెస్‌లో. వీలుంటే కలవండి. మా అక్కయ్య వాళ్ళు విశాఖలో వుంటున్నారు. సమక్షంలో మీ కథపై నా అభిప్రాయం చెప్పాలని కోరికగా వుంది.

స్టేషనుకి వస్తారని ఆశిస్తూ

మీ

రాధ.

హైదరాబాద్‌లో రాధ అనే కలం పేరుతో పత్రికలకి, రచయితలకి 'ఉత్తరాలు' వ్రాయడం మూర్తికి అలవాటు. యిలా చాలామందికి రాసి నవ్వులపాలుచేసే సంఘటనలు లేకపోలేదు. రేపు ఆదివారం విశాఖలో కృష్ణని కలుసుకోవాలి. తనతప్పును ఒప్పుకోవాలనుకున్నాడు మూర్తి. కృష్ణ తనను రాధ అనే అందమైన రెండు జడల అమ్మాయి అనుకుంటూ కలలుకంటూ వుంటాడు. పాపం! బాగా మోసపోయాడు. నన్ను చూడగానే ఆశ్చర్యపోతాడు. ఎప్పుడూ నవ్వు కథలు వ్రాసే కృష్ణ నన్ను గాఢంగా ప్రేమించేస్తున్నాడు. రేపు నవ్వులపాలవుతాడు. యిలా రకరకాలుగా ఆలోచిస్తూ విశాఖవైపు పోతున్న రైలులో ప్రయాణం చేస్తున్నాడు మూర్తి.

'సుజాత కలం పేరు కృష్ణ.' విశాఖలో కథలు వ్రాస్తూ వుంటుంది. చాలామంది అబ్బాయిలు (తలనెరిసిన వాళ్ళుకూడ) అమ్మాయిల పేర్లతో కథలు వ్రాస్తారని తెలిసి కొంతమందిలా తానుకూడా 'కృష్ణ' అనే కలంపేరు కథలు వ్రాయడం మొదలు పెట్టింది. తనకి లవ్వంటే అసలు పడదు. ఎప్పుడు నవ్వు కథలే వ్రాస్తూ వుంటుంది.

రాధ తనను అందమైన అబ్బాయి అనుకుంటుంది. సరదాగా తాను లెటర్స్ వ్రాస్తూంటే — అవన్నీ లవ్వు లెటర్స్‌గా భావించింది. యిప్పుడు తనకోసం వస్తోంది. తనకు లవ్వు కథలంటే యిష్టమని వ్రాసింది. తనను చూసి సిగ్గుతో మొగ్గలా ముడుచుకు పోతుంది. ఎప్పుడూ ఎవరిని చూడకుండా లవ్వులు చేయవద్దని చెప్పాలి. ప్రేమ గుడ్డిది అని మరోసారి నిరూపించాలి.

వాల్తేరు స్టేషనువద్ద...

గంట నాలుగున్నర అయింది.

—ఎక్స్‌ప్రెస్ పెద్దగోల చేస్తూ ఆగింది. మూర్తి నెమ్మదిగా దిగేడు. కృష్ణకోసం ఎదురుచూస్తున్నాడు రాధ కలం పేరు గల మూర్తి. సుజాతా రాధ కోసం ప్లాటుఫారమంతా చూసింది. రాధ కనబడలేదు. ఎలా కనబడుతుంది? గుర్తు తెలిస్తేగా!

రైలు చక్కగా పోయింది...

ప్లాటుఫారం చిక్కిపోయింది.

మూర్తి, సుజాత తప్ప ఎవరూ ప్లాటుఫారంమీద లేరు.

మూర్తి ధైర్యంచేసి నెమ్మదిగా సుజాత దగ్గరకు వచ్చి,

'ఏమండీ! ప్రసిద్ధ రచయిత కృష్ణ గారు ఎక్కడ వుంటారో చెప్పగలరా?'

సుజాత గాభరా పడిపోతూ— 'మీరు రాధ పేరు...'

'అవును. ఆ పేరుతో లెటర్స్ వ్రాస్తుంటాను. మీరు...'

'కృష్ణ' అనే పేరుతో కథలు వ్రాసే సుజాతను.'

ఇద్దరు ఆశ్చర్యపోయారు.

నవ్వు కథలు ఒకవిధంగా చేటు—

లవ్వు కథలు మరోవిధంగా... ●



ఎవరి అసూయ! మగవాడిదా?!

కె. రామలక్ష్మి

పెళ్ళయిన ప్రతి స్త్రీ చెవిలోనూ ప్రతి వాళ్ళూ యిల్లు కట్టుకు పోరతారు. 'అసూయ పడకూడదమ్మాయి. అసూయిష్టి ఆడదంటే ఏ మగవాడికీ యిష్టం వుండదు' అని. అతగాడి అందమైన ఆఫీసు అసిస్టెంటును చూసి మనం ఏడిచ్చావకూడదు. ఇంటికొస్తూ ఏ బార్‌లోనో ఒకటో నాలుగో 'పెగ్గులు' దిగమింగి కొంపకకి రావడానికి అతగాడికి స్వేచ్ఛ వుంది. అయ్యగారు కాస్త గోపికాలోలత్వం ప్రదర్శించినా—మనం బాధపడకూడదు. మనం ఎప్పుడూ సంతోషంగా ఉన్నట్టు సుఖసంపదలతో తులతూగుతున్నట్టు నవ్వుతూ తుళ్ళుతూ వుండాలేగాని అసూయ పడకూడదు. అప్పుడే మగవాళ్ళు తమతమ పనులు సగర్వంగా చేసుకొని సంసారసాగరాన్ని ఈదగల్గుతారు. 'సరే' అనాలేకాని 'సరేకానీ...' అని కూడా అనకుండా ఉన్నంతకాలం—మనంత మంచి పెళ్ళాలు, మనంత ఆదర్శ గృహిణులు వుండరు,

నిజమే. పైనచెప్పినట్టు అసూయా పరురాలైన స్త్రీని భరించడం మనకీ కష్టమే. ఇక ప్రతిక్షణం కలిసి బ్రతకవలసిన మగవాడి సంగతి వేరే చెప్పనక్కర లేదు. కాని నాకొక్కటే సందేహం. ఒక్క ఆడవాళ్ళే అసూయ పడతారన్నట్టు మాట్లాడుతారెందుకా అని! మగవాళ్ళలో కూడా [illegible], [illegible] అసూయపడే వాళ్ళంటారని యీ రోగం వాళ్ళలో మరీ ప్రమాదాలకు దారితీస్తుందనీ ఎందుకు ఊహించరు? బంగారంలాంటి సంసారాలు ఛిన్నాభిన్నం అయిపోడానికి ఒక్కొక్క సందర్భంలో మగవాళ్ళ అసూయే కారణంఅనిఎందుకు గ్రహించరు?

నా స్నేహితురాలొకత్తె యీ అసూయ ఫలితాన్ని అనుభవిస్తోంది. కారణం ఏమిటో తెలుసా? ఆమె కతగాడికంటే మంచి ఉద్యోగం దొరికింది! జీతం వీలాగా యింటికి అవసరం అయినప్పుడు— ఒక ఉద్యోగం వీలాగ చేయక తప్పనప్పుడు— మంచి ఉద్యోగంలోకి మారితే—తప్పేమిటి?! 'చేరడానికి ముందర ఆయనగారేం అభ్యంతరం చెప్పనే లేదు. ఏదో చేస్తానులే—అనుకున్నారేమో. తీరా నే నా ఉద్యోగంలో రాణిస్తున్నకొద్దీ వారికి అసహనం ఎక్కువై పోయింది. అయిష్టత పెరిగిపోయింది. నా కర్థం కావడంలేదు. ఇల్లూ వాకిలీ అమర్చుకున్నాం. పిల్లలని మంచిస్కూళ్ళకి పంపిస్తున్నాం. కాని యిది నా జీతంతో నా డబ్బుతో జరుగుతోందని ఆయనెందుకు బాధపడాలో నా కర్థం కావడంలేదు. నా డబ్బు నేను దాచుకోవడంలేదు మా సంసారం కోసమే కదా— ఖర్చు పెడుతున్నాను?' అని వాపోతుంది. ఆ భర్త గారి దృక్పథంలో అర్థం కానిదేం లేదు. చాలా పాతకాలపు ధోరణి! సంప్రదాయం ప్రకారం ఆయన పోషకుడు. భార్యాబిడ్డలు పోషింపబడేవారు. అందుకే ఆ ధోరణిలో ఎవరు పాలుపంచుకున్నా— తన భార్యే పాలుపంచుకున్నా — తనని కించపరుస్తున్నట్టు బాధపడతాడు. తనొక్కడూ సాధించలేనిది తన భార్యతో కలిస్తే సులభంగా సాగేసరికి తన నేర్పుని చాకచక్యాన్ని శంకించుకోవడం జరుగుతుంది. అందుకే అసూయ్య, అసహ్యం. ఇలాంటి పరిస్థితులే చిలికి చిలికి గాలివానై—చివరికివిడిపోడానికిదారితీస్తాయి.

ఒక తరహా మగవాళ్ళు అయితే తప్పించి తన భార్య తన కంటె తెలివైనదైనా, మంచి ఉద్యోగంలో ఉన్నదైనా సహించలేరు. కాని యివేకాక రకరకాల చిన్నపెద్ద అసూయలకి సర్వసాధారణంగా మగవారు లోబడుతూనే ఉంటారు. ఇంతెందుకు — సరదాగా ఆడే పేకాటలో ఓడిస్తే, చూడాలి ఆ ముఖాలు! కాని అదే భార్య ఇంటి పనులలో బాగా రాణిస్తే అతగానికేం అభ్యంతరం ఉండదు సరికదా — గర్వంగా కూడా వుంటుంది. కాని అస్తమాను 'నేను చేశాను' అని చెప్పకోకూడదు మళ్ళీ ..., మనం చెప్పకోకూడదు — ఎందుకంటే మగవారి అహం దెబ్బతింటుంది. కాని ఆలోచిస్తే — నిజంగా విషాదకరమైన విషయం ఏమి టంటే— చాలామటుకు మన టాలెంట్సు మగవారి వెనక దాక్కొని పోతున్నాయి! [illegible].

మూడు కోతులు


నేడు--
న్యాయం నోరు మూసుకుంది
ధర్మం కళ్ళు మూసుకుంది
సత్యం చెవులు మూసుకుంది

న్యాయం నోరువిప్పి ఏదిచెప్పినా
అది అన్యాయం క్రింద
జమకట్టబడుతోందని—

ధర్మం కళ్ళుతెరచి చూసినా
అది గ్రుడ్డిదాని క్రిందే
పరిగణించ బడుతోందని--

సత్యం చెవులు రిక్కించి వింటున్నా
అది వింటుందనే భయం
ఎవరికీ లేక పోతోందని—

— టి. గౌరీశంకర్



జరిగిన కథ

ఒక వ్యక్తిమీద అనేక అభిప్రాయాలు వున్నట్టే — ఆ ఆస్పత్రిమీద కూడా అనేకానేక మంచీ — చెడూ అభిప్రాయాలున్నాయి. సూర్యానికి ఆ ఆసుపత్రి అంటే ఒకరకమైన భయం. తీరా అతను కూడా అందులోనే చేరాల్సి వచ్చింది. ఆ వార్డులో ఇంకా శెట్టిగారు, శ్రీనివాసు వున్నారు. ఆసుపత్రిలో చేరాక సూర్యానికి గతమంతా ముందు కదలింది. అతను యవ్వనంలో ప్రవేశించగానే మొట్టమొదటిసారిగా విశాలాక్షి మీదకి మనసు పోయింది. సూర్యం చెల్లెలు గౌరి. ఆమె జ్ఞాపకం రాగానే అతని కళ్ళలో నీళ్ళు నిండాయి. గౌరి భర్త గోవిందరావు ముక్కుసూటిగా ప్రవర్తించేవాడు. అతనితో ఎప్పుడూ గొడవే. గోవిందరావు అకస్మాత్తుగా హాస్పిటల్లో మరణించాడు. ఆఫీసరుగా ప్రమోషన్ రావడం సూర్యం జీవితంలో ఒక పెద్దమలుపు అంతా అతన్ని ప్రశంసించినవారే. బొంబాయిలో గీతతో పరిచయం అయింది. గీత అతన్ని ఎప్పుడూ ఆడిస్తూ వుండేది అతన్ని పెళ్ళిచేసుకోవాలని గీతకి వున్నా సూర్యం త్రోసి పుచ్చాడు. ఇదంతా జ్ఞాపకంవచ్చి కాస్సేపు ఆ వాతావరణాన్ని మరచిపోయాడ. విశాల శ్రీనివాస్ భార్య అని తెలుసుకన్న సూర్యం తన గమ్యాన్ని నిర్ణయించుకుంటాడు.

12

ఆవేళ సాయంత్రం విశాల వేగిరంగానే వచ్చి ఆలస్యంగా వెళ్ళింది. సూర్యం ఆమెలో యేదో మార్పు వచ్చినట్లు భావించాడు. అంతసేపు ఆమె మూగపిల్లలా మాటాడలేదు. మాటాడింది శ్రీనివాస్. ఆ మరుచటిరోజు శ్రీనివాస్ యెక్స్‌రే రిపోర్టు వస్తుంది. అదేదో తెలుసుకున్నాక డాక్టరును కలుసుకుందా మనుకున్నాడు.

విశాల వెళిపోయాక వెలుగు కదలినట్లు అయిపోయింది. చీకటికూడా పడింది. ఆమె నవ్వకపోయినా మాటాడక పోయినా ఆమెలో యింకా ఆకర్షణ పోలేదు. అదో అయస్కాంతంలా సూర్యాన్ని లాగుతున్నా యెంతో కష్టంమీద మనసును మళ్ళించుకున్నాడు. తనకు సంక్రమించిన బాధ్యతను మననం చేసుకుని మనసును అదుపులో వుంచుకున్నాడు. తన స్వంతవస్తువును యెన్నాళ్లకు ఒకరి ఆధీనంలో వుండగా చూసినట్లు చూసి నాదీ అని తీసుకునే ధైర్యం లేనట్లు బాధపడ్డాడు. మళ్లీ తను ఆనాడు తిరస్కరించి జన్మజన్మాలకు పొందలేని వస్తువును యింకొకరికి బలవంతాన అప్పచెప్పాడు. తన బలహీనతకు విసుక్కుంటూ పడుకుని మళ్ళీ ఆత్మపరంగా ఆలోచించసాగాడు.

'శ్రీనివాస్ యేమైనా అయిపోతే ?'

ఈ ప్రశ్న మనసులో వుదయించిన వెంటనే వద్దువద్దు అతను బ్రతికితీరాలని మనస్సులో గట్టిగా కోరుకున్నాడు. అలాంటి పరిస్థితి వూహించరానిదిగా తోచింది. కాస్సేపయ్యాక

'ఈ బ్రతుకంతా నటన అన్న ఆ యోగి పుంగవుని వాక్కు నమ్మితే—తను చెయ్యవలసిందేమిటి ? అమ్మా, నాన్న యెంచిన ఒక పిల్లకు తాళికట్టి తనదీ అనుకోవాలి. అప్పటికిగానీ తను నటించలేడు. చెట్టు వసంతంలో చిగురిస్తుంది. గ్రీష్మంలో చిగురించలేదు. వసంతంలో చిగురించని చెట్టుగా తను వుండిపోతే గ్రీష్మంలో మోడై పోతాడు. తను యే ఋతువులో సింగారం ఆ ఋతువులో చేసుకుని ఒక పండొకటి రాలిస్తేగానీ తన సంతతి మాయమైపోతుంది తనకు వూరూ పేరూ వుండదు.

ఇలా నిద్రపోకండా ఆలోచనలతో పరుపుమీద నున్న తన దగ్గరకు అంతరాత్రి మీద యెవరో రావటం గుర్తించాడు. అతను శ్రీనివాస్‌కాదు. అతను జ్వరంతో లేచే పరిస్థితిలో లేడు. శెట్టి గారయ్యుండాలి. అతనే దగ్గరగావచ్చి తొంగి చూసాడు

'ఇంకా పడుకోలేదా సూర్యంగారూ?'

'లేదండి' అంటూ లేచి,

'మీరింకా పడుకోలేదేం?'

'నిద్రపట్టలేదు బాబూ ?'

'నొప్పిగాని రాలేదు కదా ?'

'కొద్దిగావుంది. యేమైనా ముసలితనంలో యెలాగ వుంటుందో చెప్పలేం కదా ? గతం తల్చుకుంటే గుండె చెరువైపోతోంది '

'పదండి. నేనే వస్తాను' అంటూ సూర్యం అతను యేం చెప్తాడనో కుతూహలంగా వెంటపడ్డాడు. శెట్టిగారు పరుపెక్కారు. తలదగ్గర స్టూలుమీద సూర్యం కూర్చున్నాడు. వచ్చి తిరిగి వెళ్లేసరికి శెట్టి అలసిపోయాడు. కాస్సేపయ్యాక మెల్లగా 'మీరు చాలా మంచివారు. ఆడితప్పనవారు. మీలాంటివారిని యిక్కడ కలుసుకుంటా

వనే ఆశతోనే వచ్చాను. కలుసుకున్నాను. దేవుడు దొడ్డవాడు.'

'నా అవసరం యేముందో చెప్పండి ?'

'మీకో బాధ్యత అప్పచెప్తున్నాను. కాదన కండి.'

'చెప్పండి.'

శెట్టి యిటూ అటూ చూసాడు.'

'ఇదిగో యీ రామంని—నేనెం అయి పోయినా చేరదీసి ప్రయోజకుడ్ని చేసే బాధ్యత మీది.'

సూర్యం యితనికి వీడిపై యెందుకు యింత మమకారమో బోధపడలేదు.

'తల్లిలేని పిల్లడు'

'తండ్రో'

'రెండు మూడురోజుల్లో తండ్రి వుండడేమో?'

'అంటే—'

'అదంతా ఒకగాధ బాబూ—నాకు తప్పించి యింకెవ్వరికి తెలీనిగాధ'

'నేను వినకూడదా?'

'చెప్తాను. మీదగ్గర దాచవలసినది నాదగ్గర యేదీ లేదు' అంటూ మెల్లగా కదలి పరుపు క్రింద దాచిన ఒక పెద్ద కవరు తీసాడు. ఆ కవరు సూర్యం చేతికి అందిస్తూ 'ఇందులో నా వీలునామా—పది వేల రూపాయల నగదు వుంది. వాడికి చదివించి పెద్ద చేసే బాధ్యత మీకు అప్ప చెప్తున్నాను. ఈ భారం మీ మీదవేసి నందుకు క్షమించండి'

ఆసుపత్రి అంతా నిశ్శబ్దంగా వుంది. వార్డులో దీపాలన్నీ ఆర్పేవున్నాయ్. వీళ్లిద్దరి గుస గుసలే వినిపిస్తున్నయ్. వరండాలో దీపపు వెలుగు కొద్దిగ పడుతోంది. సూర్యం కవరు అందుకున్నాడు.

'సరే చెప్పండి' అన్నాడు.

'హామీ యివ్వండి' అంటూ చెయ్యి చాపాడు. సూర్యం అతని చేతిలో చెయ్యివేసి 'మీరీ డబ్బు యీయకపోయినా ఆ కుర్ర వాడ్ని దగ్గరవుంచి వాడి బాగోగులు చూసే వాడ్ని. అభిమానంతో నిండిన కుర్రాడు. ఇంత డబ్బుయిచ్చి మరీ చూడమన్నారు మీరే డబ్బు హామీ యిచ్చినప్పుడు, ఇక నా హామీ యేముంది?'

'నా తృప్తికి మీ నోట మాట విన నీయండి'

'తప్పకండా మీ రామంను ప్రయోజ కుడ్ని చేస్తాను'

'హమ్మయ్యా' ఒక పెద్ద నిటూరు విడిచాడు శెట్టి.

కాస్సేపయ్యాక 'మంచివాళ్లమాట వేద వాక్కు అంటారు పెద్దలు. మీ మాట ప్రకారం వాడు ప్రయోజకుడవుతాడు. ఇన్నాళ్ళూ యీ బాధతోపాటు ఆ బరువు నన్ను పిరికివాడ్ని చేసేసింది. నా సగం పిరికి యీ రాత్రితో పోయింది. రేపుకాక యెల్లుండైనా ఆపరేషను చేసేస్తారు. ఇక యీ బాధపడలేను. చావో రేవో తేల్చేసుకుంటాను.'

'చావు గురించి ఆలోచించకండి. ఇలాంటప్పుడు యింతవరకు బ్రతికి సంతోషిం



చిన గడియలను తల్చుకోండి.'

'ఆ రోజుల్లో సంతోషం యిచ్చినవి యిప్పుడు తల్చుకుంటే సంతోషం యివ్వవు — దుఃఖాన్ని కలిగిస్తాయ్. ఎన్నెన్నో కోరుకున్నాను. ఆ కోరికలు కొన సాగించుకోడానికి యెన్నెన్నో చెయ్యరాని పనులు చేసాను. ఈ నాలిక, మనిషి మాంసంరుచి మరిగిన పులి లాంటిది. ఈ కడుపుకు యెంతనింపినా వరగడుపే. ఈ ఒంటికి యెంత సుఖపెట్టినా నురుపే! భౌతికమైన సుఖాలెలాంటివంటే — ఒక తొట్టెను నీటితో నింపుతుంటే అడుగున వున్న కన్నాలనించి నీరు కారిపోతుంది. తొట్టె నింపుతాం అనుకుంటాంగానీ జీవిత కాలంలో నింపలేం. కడుపు చూసుకున్నానే గానీ గుండె గురించి తల్చుకోలేదు. గడించాను. ఇంకా గడించాను, మరింత గడించాను. కానీ ఆశ పెరిగిందిగాని తరగలేదు. అంతా నాకోసం. నా కుటుంబ సుఖంకోసం తాపత్రయ పడ్డాను, ఖర్చుపెట్టాను, కూడ బెట్టాను. నా అన్నమాట తప్పింది, నా అన్నభావం తప్పింది, నేను అన్న అహం తప్పింది అంతేం నాదగ్గర నిలవలేదు. నేను నేనుగా యెల్లప్పుడూ వుండిపోవన్న ఆలోచన తట్టలేదు. నేను యెదుటివాళ్ళ కోసం చేసినమంచి మిగిలిపోతుందని అభిమానస్తుడైన యీ రామం వలన తెలుసుకున్నాను. చూడు బాబు జీవితం యెంత విచిత్రమైనదో? భార్య, పిల్లలు, బంధువులు — ఒకరేమిటి యెందరెందరు? నా గురించి సతమతమయ్యేవారు. ఏభయ్యోపడిలో పడ్డాను — యెందుకో సంసారంమీద యేవగింపు కలిగింది. నా చుట్టూవున్న నా వాళ్ళు నన్ను ప్రేమిస్తున్నారా, నా డబ్బును ప్రేమిస్తున్నారా అన్న అనుమానం కలిగింది. నా పెళ్ళాంకు నాతో సంబంధం కాదు నా ఆస్తితో — ఆమె ఒంట నూరు తులాల బంగారంవుంటే యింకా చాలదని పోట్లాట. కొడుకులు దొంగ లాభాలు చెయ్యటానికి ఒప్పుకోలేదని విసుగు — కూతుర్లు నాకేం యిచ్చావ్ అంటే నాకేం యిచ్చావ్ — బంధువులు మా సంగతి యేం చేస్తావ్ అనీ — వీళ్ళంతా వ్యక్తిగా నాకేం గౌరవం యివ్వలేదు. నా డబ్బుకోసమే బ్రతికున్నారు. ఇంట్లో మెల్లగా తగాదా రాజుకుంది. దానికి కారణం నాకు ఒళ్ళు

నాలుగు మంచాలు

నుండి యెవ్వరికీ నా తదనంతరం వరకు చిల్లిగవ్వ ముట్టచెప్పనని చెప్పాను. కొత్తగా వచ్చిన పెద్దకోడలు, అత్తగారు యేకమయ్యారు. నా పెళ్ళమే నాకు యెదురు తిరగటంతో నాకు జీవితంమీద రోత పుట్టింది. ఛీ! యింత కష్టపడి యీ డబ్బు యిందుకా గడించాను అని యేడ్చుకున్నాను. నాకంటే, అడుక్కున్నవాడు హాయిగా వున్నాడనిపించింది. ఆ రోజు రాత్రి — యింకా పది గంటలు కొట్టలేదు. యే రైలు క్రిందో తలపెట్టేద్దామని ఆవేశంతో బయలుదేరిపోయాను. ఆ వేళ సాయంత్రంనించి యింటికి వెళ్ళలేదు. ఇక్కడ అక్కడ తిరిగాను. తెల్లటి బట్టలు, మీద నాణీ అన్నీవున్నాయ్. అగ్రహారం వీధిప్రక్కనేవున్న రైలురోడ్డుమీద తలవంచి నడుస్తున్నాను. ఇక రైలు వస్తోంది. ఆ వీధి ప్రక్కనేవున్న గుడిసెలోనించి కావాలని పరుగెత్తుకుని వచ్చింది ఒక ఆడది.

'రైలొచ్చేస్తోంది — బాబూ' అంటూ చెయ్యిపట్టుకు లాగింది. ఆమెవేపు చూడకుండానే 'నన్ను చావనీ' అన్నాను.

'సచ్చి యేం సాధిస్తారుబాబూ? మీ కంత కష్టమైతే నా పాకలో వుండండి బాబూ'

ప్రక్కకు తిరిగిచూసాను. ముఖంలో పౌడరు వాసన వేసింది. ఆమె చెయ్యి పట్టుకుని వదల్లేదు. బయటకు లాగేసింది. దగ్గరలోనే వున్న తన పాకలోనికి తీసుకెళ్ళింది. చిన్నబెడ్ లాంతరు వత్తి పైకెత్తింది. ఓసారి తలెత్తి చూసాను. నీలిరంగు వాయిలు చీరకట్టింది. ముఖంలో పెద్దబొట్టు, చెవులకి దుద్దులు, ముక్కు తీగ్గావుంది. మూతికి రంగురాసింది. ఆమె నాపెద్ద కూతురికంటె రెండేళ్ళు పెద్దదిలా వుంది. మనిషి యౌవ్వనంతో బలిసి వుంది. తెల్లని పల్చనిజాకెట్ లోపలిబాడీ కనిపిస్తోంది. తలనిండా శోభనపు పెళ్ళికూతురిలా పూలను ముడిచింది. ఆమెవేపు పరీక్షగా చూసాను. నా జీవితంలో యెన్నడూ పొందని శాంతి యీ పాకలో నాకు దొరికింది. నేనేదో యింద్రలోకంలో ఒక పూర్వాశిని కలుసుకున్నట్టు మనసు వుప్పొంగి పోయింది.

'బాగా కలిగిన బాబులా వున్నారు. ఏం లేని మాలాంటోలమే బతుకుమీద ఆశతో నీతిలేకండా బతుకుతుంటే — తమరు యిలాగ చెయ్యటం న్యాయమేనా?' అంది. జవాబు చెప్పడానికి నాకు మాటలు రాక క్రొత్తగా యౌవ్వనం వచ్చిన మనిషిలా ఆమె దగ్గరగా చేరాను. ఆమె కాస్త జరుగుతూ 'బాబూ! తమరు కలిగిన బాబులు, తల్చుకుంటే యే రంభ రాదు. నాలాంటి బజారు మనిషితో యేంటి బాబూ?' అన్నది.

'నివ్వు బజారు మనిషివికావు. దేవతవి. రంభవి, నాకు తొలిసారి వలపును ప్రసాదించావు. నిన్ను వదల్లేను. జీవిత కాలం నిన్ను వదల్లేను. ఈ పాకలో కాదు. ఒక భవనంలో వుస్తాను. సమస్త సుఖాలు నీతో అనుభవిస్తాను' అంటూ ఆమెను గట్టిగా కౌగిలించుకున్నాను. ఆమె నాకు పూలతీగలా చుట్టుకుంది. వాడిపోయినచెట్టు లాగా తీగ సంపర్కంతో చిగురించింది. చెట్టూ, లతలా యిద్దరం అల్లుకున్నాం. ఆ వేళనించి ఆమె నన్నే నమ్ముకుంది. ఆమె భవనాలు, డబ్బు కాంక్షించలేదు. నన్నే కోరింది. ఆపాక వదల్లేదు. నేనూ ఆ పాక మార్చాలన్న వూహను మార్చుకున్నాను. ఆ పాక, ఆ లేతవెలుగు, ఆ నులకమంచం — రాత్రుళ్ళు స్వప్నంలో కామినీ దేవతను కలుసుకున్నట్టు ఆమె చెంత చేరేవాడ్ని. చలిలో, వర్షంలో చీకటిలో ఒక్కసారైనా మా యిద్దరి కలయిక యీ పండొకటి రాల్చింది. రామంబాబు మూడేళ్ళప్పుడు నా దేవత నన్నువదలి స్వర్గానికి వెళిపోయింది. ఈ బిడ్డడ్ని యింకో పేద సంసారుల యింట్లో అప్పచెప్పి గుప్తంగా పెద్దచేసాను. పదేళ్ళవయసు రాగానే రోజంతా చూడాలన్న మమకారంతో యింట్లో తెచ్చిపెట్టాను. వాడికి వ్యాపారం నేర్పాలని తెస్తే మావాళ్ళు యింట్లో నౌకరీ చెయ్యిస్తున్నారు. ఆడా మొగా మనసులు కలిసి యెందరో వుదయిస్తారు. ఆత్మలు కలసి పుట్టిన బిడ్డడు వీడు. వీడు తప్పక వృద్ధిలోనికి వస్తాడు. వీడిని మీలాంటి వుత్తముని చేతిలో పెట్టినందుకు నాకు హాయిగావుంది.'

శెట్టిగారు హృదయం విప్పిచెప్పినదంతా విని సూర్యం ఆ సంఘటనలే యింకా

తలలో తిరుగుచుండటంవలన మాటాడలేక పోయాడు. ఇదంతా చెప్పటానికి ఓపికపడ్డ మనిషి చెప్పాక నిస్త్రాణగా వుండిపోయాడు. సూర్యంచేయి మెల్లగా లాగుకొని ఒకముద్దు పెట్టాడు.

'చచ్చిపోతే-నీ కడుపులో పుట్టాను బాబూ - మంచిపుట్టుక పుట్టానులే' అన్నాడు.

సూర్యం శరీరం గగుర్పాటు చెందింది. ఏమిటీ సంబంధాలు? తనవేపు చూస్తే ఇంతమందికి యింత అభిమానా లెందుకు పుట్టుకొస్తున్నాయ్? తన ముఖంలో వుండే వెలుగా? తన కళ్ళల్లో తళుకా? ఇందరిని ఆకర్షించేది ఏమిటి? తనలో ప్రత్యేకత యేమిటి? బహుశః యెదుటివాళ్ళని నొప్పించలేని తన మనస్తత్వమా?

తిరిగి వచ్చి పరుపుమీద పడినా యేదో పెద్ద బరువు తనమీద పడి నట్లుయింది. తన దగ్గరే ఆసుపత్రిలో డబ్బు వుంచటం మంచిదికాదు. ఆ మరుచటి రోజునే తన యింటికి పంపించి జాగ్రత్తగా వుంచాలను కున్నాడు. శెట్టిగారి జీవితంలోని ఘట్టాలు ఆలోచిస్తూనే నిద్రపోయాడు. ఉదయం లేచే సరికి సాధారణంగా దగ్గరనుండే శ్రీనివాస్ లేడు. అతను యింకా పరుపుమీదనే వున్నాడు లేచి దగ్గరకు వెళ్ళేసరికి శ్రీనివాస్ సిగరెట్ ముట్టించాడు. ముఖంలో నీరసం స్ఫుటంగా కనిపిస్తోంది. ఈ కొద్ది రోజులకే మనిషి బాగా నీరసించిపోయాడు.

'ఇదివరకు కంటె నొప్పి హెచ్చయింది.'

'ఇదివరకు నొప్పి వున్నట్లు చెప్పలేదే! ఎక్కడ?'

'ఎడమవేపు గూడులో—ఆలోపల యేదో చీముతో నిండిన పుండు వున్నట్లు దిగ్గట్టు పెట్తోంది. ఈ భాగం అంతా లాగుతోంది. రాత్రి తెలివొచ్చినప్పుడల్లా యమ బాధగా వుంది.'

'ఈ వేళ రిపోర్టు వస్తుందిగా. అదేంటో తెలుసుకుని ట్రీట్‌మెంటు చేస్తారు.'

'ఇంకా అనుమానాలు రావని చెప్పలేం. ఇంకో వారంరోజులు కూర్చోబెట్టి మరో పరీక్ష చేస్తారు.'

'కారణం లేకండా చెయ్యరని పిస్తోంది. శెట్టిగారికి యిన్నాళ్ళు ఆపరేషను చెయ్యకండా వుంచారంటే కారణం లేదంటారా?,

'కారణం వుందిలెండి. ఇంకోచావు యీ వార్డులో తటస్థిస్తే అతను పిరికితోనే చచ్చిపోతాడు.'

'వైరాగ్యంవచ్చి అతని పిరికి పోకూడదా? అతనికి వున్న సుగర్ కంప్లయింట్‌ని కంట్రోలు చేస్తున్నారు. అలానే మీ విషయంలో ఆలస్యానికి కారణం వుంటుంది'

'వాళ్ళనని లాభంలేదులెండి. మనరాత. అందులో నారాత తొలినించి బ్రహ్మాండంగా వుంది.'

'ఇంత ధైర్యం చెప్పేవాడు మీరే యిలా విసుక్కుంటే యెలా?'

'అబ్బబ్బే—అధైర్యపడటలేదు. ఆమధ్య డయాఫ్రమ్ కాస్త పైకి పోయిందన్నారు. తరవాత యింకేదో అన్నారు. ఇప్పుడు రాత్రుళ్ళు జ్వరం రావటంతో యింకేదో అనుమాన పడుతున్నారు. ఈవేళ యింకా జ్వరం వుంది. ఇంకేం అనుమాన పడ్తారో!'

శ్రీనివాస్ యింతకాలం యిక్కడ వుండటంవలన విసిగి వేసారి యిలా అంటున్నాడని సూర్యం అనుకున్నాడు. తనే అతని పరిస్థితిలో వుంటే తల దిమ్మెక్కి పోయేది. ఈ జారోమని వుండేవాడు. కాలకృత్యాలు తీర్చుకుని వచ్చేసరికి శ్రీనివాస్ యింకా సిగరెట్‌ను కాల్చుతున్నాడు

'తెల్లారి లేచాక యిది యెన్నోది?'

'ఐదు'

సూర్యం దగ్గరగా స్టూలు మీద కూర్చొని అతనిచేతిలో సిగరెట్ అందుకోబోతుంటే.

'ఈ కాల్చటంవల్ల వచ్చిన తృప్తినైనా అనుభవించనివ్వండి'.

'ఆరోగ్యం నయం అయ్యాక రోజంతా కాల్చండి.

ఇప్పుడిలా గూడ్సుబండి పొగలా కాల్చనివ్వను.'

'ఆ పొగ వదిల్తేకదా శక్తినిస్తుంది, ఇదిగోండి యీ సిగరెట్ పూర్తయేలోగా యీ అలవాటు యెలా అబ్బిందో చెప్తాను.'


'సరే! చెప్పండి. ఐదవఫారంలో వుండగా యోగి పుంగవుని కలుసుకున్నారు.'

ఆ యోగి గురించి యెత్తగానే శ్రీనివాస్ ముఖంలో చిరునగవు వెలిగింది. పరుపుమీదే కూర్చోబోయాడు.

'వద్దు అలా పడుకునే చెప్పండి.'

శ్రీనివాస్ అలా పరుపుమీద వుండే తన గాధ మెల్లగ చెప్పసాగాడు.

'నేను యీ లోకంలో ఒంటరివాడిని కాదన్న ధైర్యాన్ని ఆ సాధువు పరిచయం నాకిచ్చింది. చదువుతూ వ్యాసన్ని చేస్తు సాగాను. కాలం గడచిపోయేది. స్కూలు ఫైనల్ పాసయ్యాక యిక పైకిపోయే స్తోమత లేదు. నాకు డాక్టరు కావాలని వుండేది. డాక్టరు అయ్యాక ఒక మురికి



పేటలో రోగులసేవ చెయ్యాలనుకునేవాడ్ని. ఉద్యోగాన్వేషణకు బయలుదేరాను. ఏ ఆఫీసుకు వెళ్ళినా ఖాళీలు లేవనో నీకు సరియైన క్వాలిఫికేషన్లు లేవనో, నీకు యిదిరాదు అదిరాదని యేవేవో సాకులు చెప్పి చివరకు నేను చేతకానివాడినా అన్న అనుమానాన్ని కూడా కలిగేటట్లు చేసారు. ఐనా ఆశను చంపలేదు. ఎక్కడో చదివినది యెప్పుడూ గుర్తుకు వస్తుండేది. 'మనిషికి ఆత్మ వుంది—ఓర్పు, త్యాగం, జాలి చూపించగల శక్తి వున్నది.' నేనూ ఓర్చాలి, త్యాగివవ్వాలి, నాపై కాకుండా యెదుటివాళ్ళపై జాలి చూపించాలి. అప్పుడే మనిషి నౌతానని నా నాటకంలో పాత్రను నేను నటించసాగాను ఒకనాడు తలవని తలంపుగా పబ్లిక్‌వర్క్స్ డిపార్టుమెంటులో ఖాళీలు వున్నయ్ అంటే వెళ్ళాను. అప్పటికే అక్కడ యేభైమంది చేరివున్నారు. హెడ్‌గుమస్తా ఒకజూనియర్ యింజనీరు మనుషుల ముఖా లొకసారి చూసి కొన్ని పేర్లు చదివి మిగతావాళ్ళు వెళ్ళవచ్చన్నారు. నాకు ఒళ్ళు మండింది ఎగ్జిక్యూటివ్ యింజనీరు తలుపుతట్టి లోనికి వెళ్ళాను. అతను మర్యాదగా 'ఏం కావాలన్నారు?'

'మా ముఖాలు చూసినంత మాత్రాన మా తెలివితేటలు తెలిసిపోతాయాసార్? ఇది ఒకరి జీవనానికి సంబంధించినది. మా తెలివితేటలు పరీక్షించి చెత్తకాగితాలబుట్టలో వేస్తే బాగుండేది.'

'మీకేం పరీక్ష చేయలేదా?'

'లేదు.'

'అయితే—కూర్చోండి' అంటూ బెల్ నొక్కించాడు. జూనియర్ యింజనీర్‌ని పిలిచి 'యిప్పుడు వచ్చిన వారందరినీ పిలవండి' అన్నాడు. వెళిపోతున్న వాళ్ళందరూ వచ్చారు. అతనే స్వయంగా పరీక్షచేసి వారంరోజుల్లో యెవరైతే సెలక్టు అయ్యారో వాళ్ళకు వర్తమానం వస్తుంది. మీ అడ్రసులు యీ పేపర్లలో మరచిపోకుండా రాసారు కదూ?'

ఆ వారంలోనే నాకు వుద్యోగంలో చేరమని వచ్చింది. ఇదివరకు ముఖాలు చూసి సెలక్టు అయినవారిలో ఒకడు తప్పించి యింకెవడూ కనపడలేదు. న్యాయానికి కాలం లేదనుకున్న యీ రోజుల్లో అక్కడక్కడా యిలా న్యాయం వుండటం వలన అన్యాయం న్యాయాన్ని పూర్తిగా కబళించలేక పోతోంది, మా ఐదుగురిని

మేస్త్రీలన్నారు. కానీ ఆఫీసులోనే పని చేయించేవారు. నా పనికి మెచ్చుకుని యెగ్జిక్యూటివ్ ఇంజనీరు నాకు బిల్లులు ప్యాసుచేసే సీటు యిచ్చాడు. అప్పటికి నేను కాజువల్ మేస్త్రీగానే వున్నాను. ఉద్యోగం దినదిన గండంగానే వుండేది. ఈ ఆఫీసరు బదిలీ కానీ పీడపని పట్టిస్తానన్నట్లుగా హెడ్‌గుమస్తా బోనులో పులిలా కాసుక్కూర్చున్నాడు. లంచాలు పుచ్చుకుని ఆ సీటులో యిదివరకెందరో బాగుపడ్డారు. నేను పుచ్చుకోకుండా వేగంగా బిల్లులు ప్యాస్ చేస్తుంటే అందరికీ ఆశ్చర్యంగా వుంది. ఎందరో కంట్రాక్టర్లు, కంపెనీ యజమాన్లు వస్తూ చివరకు ఒక సిగరెట్టైనా కాల్చకపోతే ఒప్పుకునేవారు కాదు. ఈ సిగరెట్ రానురాను కొనవలసిన పరిస్థితి వచ్చింది. ఈ సిగరెట్లకే యింత అయిపోతుంది మానేద్దామని భీష్మించుకున్నాను. ఒకకంపెనీ యజమాని 'సిగరెట్ పెట్టె' అందివ్వబోయాడు.

'వద్దు'

'ఏం ? మానేసారా ?'

'హాఁ. ఈ జీతంతో భరించలేను.'

'జీతం హెచ్చు అయితే భరించగలరా ?'

అతని వుద్దేశమేమిటని సంశయంగా చూసాను. 'చెప్పండి. ఇలాంటి అమూల్యమైన వస్తువుతో సంవత్సరం వదలగలరా ?'

'విధిలేదు.'

'ఇక్కడ మీరులేకపోతే మాకు కష్టంగానే వుంటుంది. మీలాంటి నమ్మకస్తుడు మాకు

నాలుగువంచాలు


దొరకటం కష్టం. ఐనా మీ భవిష్యత్తు కూడా చూడాలా ? ఎన్నాళ్ళు చేసినా యీ కొలువు యింతే. అంచేత మీకు అభ్యంతరం లేకపోతే మా కంపెనీలో చేరండి. నెలకు రెండువందలిస్తాం.'

నేనాతని మాటలు వెంటనే నమ్మలేకపోయాను. డెబ్బయి రూపాయలనించి ఒక్కసారి రెండువందలే! మాట ప్రకారం అతను ఆర్డరు పంపాడు. నా వుద్యోగమే నా ఆస్తి. ఆ ఆస్తికి యిప్పుడు విలువరాగానే పెళ్ళి బజారులో నా విలువ పెరిగింది. ఇన్నాళ్ళూ ముఖం చూపించని దూరపు బంధువులంతా పెళ్ళికూతుర్లను తోడ్చుకుని వచ్చి మరీ నన్ను బాధపెట్టసాగారు. ఈ చెరువు యిప్పుడు నిండగానే కప్పలు చేరాయి. ఆ కప్పలను తప్పించుకోడానికి నా తలప్రాణం తోకకి వచ్చింది. ఒంటి ప్రాణం. అంత డబ్బేం చేసుకుంటాను ? కూడబెట్టాలన్న తలపే రాలేదు. నేనో చెయిన్ స్మోకర్‌ని అయిపోయాను. సిగరెట్లకే సగంజీతం అయిపోతుందా అన్నభయం అప్పుడప్పుడూ కలగసాగింది. రెండు సంవత్సరాల్లో నాకు మరో యేభైరూపాయలు జీతం పెరిగింది. ఇక పెళ్ళి చేసుకోవాలన్న కోర్కె కలిగింది. నేను పి. డబ్ల్యు. డి. లో పనిచేస్తున్నప్పుడు నా స్నేహితునితో ఒకసారి వాళ్ళ పల్లెటూరు వెళ్ళాను. అక్కడ లంగా జాకెట్టుతో వాళ్ళ యింటి పొరుగునే అమ్మాయిని చూసాను. ఏప్పుడైనా యీ అమ్మాయి నాదైతే యెంత అదృష్టవంతుణ్ణి అనుకున్నాను. ఆ పిల్లకు గొప్పసిగ్గు. మాటాడుదామని ప్రయత్నించానుగానీ లాభంలేకపోయింది. ఆ పిల్ల తండ్రి పిచ్చివాడై పోయాడట. తల్లి లేదట. మామ్మవుందిగానీ – యిలాంటి కబుర్లు విన్నాక తప్పక యీమెకోసమే నేను ఆగానని నిశ్చయించుకున్నాను. మా మిత్రునికి వాళ్ళకీ యేదో దగ్గర సంబంధమే వుందట. నేనుతిరిగి వచ్చే ముందు మా మిత్రుని చెల్లెలను చూపించారు, నాకు మావాడిపై కోపం వచ్చింది. దీనికోసమని చెప్తే రాకపోయేవాణ్ణి. పోనీ యీ నెపాన ఒకకోరిక కలిగింది. ఇప్పుడు మళ్ళీ ఆ కోరిక చివురించగానే మళ్ళీ ఆవూరు వెళ్ళాను. ఆ యెదిగిన పిల్లను చూడగానే నా శరీరమంతా పులకరించింది. ఇన్నాళ్ళూ మేఘసందేశాలు పంపగా దివి నించి భువికి దిగిన గంధర్వ కన్యలా వుంది. ఒకేజాతి—నా అంతస్తు పెరిగింది. ఆమెను సొందగరిగే అన్నిహంగులూ తనకు వున్నాయ్. అప్పటికి ఆమెకు అందం తప్పించి యింకేమీ లేదు. ఆ ముసలమ్మ మంచం పట్టింది. ఆ పిల్లకు ఒక మేనమామ వున్నాడు. వాడు పేచీకోరు. ఉన్న కొద్ది భూమి అమ్మి ఆ పిల్లకు పెళ్ళిచేసి చచ్చిపోదామని ముసలమ్మ ఆశకు గాయం తగిలింది. నివ్వు పట్నంలో వుండగా యీ భూమిమీద తీసి యెంతడబ్బు పంపించాను. ఇంకేం మిగిలింది అన్నాడు. డబ్బులేదు. పిల్ల పెళ్ళెలా చేస్తానని మామ్మ మంచం పట్టినస్థితిలో నేను వెళ్ళాను. మామ్మగారిని కలుసుకుని నా నిశ్చయాన్ని చెప్పాను. 'మీరో చిల్లిగవ్వ ఖర్చుపెట్టకండి. అన్నీ నేనే చూసుకుంటాను'. ఆమె వూర్లో పదుగురి పెద్దలను పిలిపించింది. నామాట మొదట యెవరూ నమ్మలేదు. నా వుద్యోగం వగైరా అన్ని విషయాలను నిరూపించే ఆధారాలను వెంటనే తీసుక వెళ్ళాను కాబట్టి ! సరిపోయింది.

'అయితే మీ పెద్దలు రానీయండి.'

'నాకు నేనే పెద్దనని' నా చరిత్ర చెప్పాను.

'వేలంటేగానీ ఆడపిల్ల చెల్లనిరోజుల్లో రెండ ప్రక్కల ఖర్చులు పెట్టుకుని మరీ పెళ్ళి చేసుకుంటామని ముందుకొచ్చారు. అదృష్టమంటే అలాగుండాలి,' నా యెదరి



గానే విశాలాక్షి అదృష్టం గురించి యెంద రెందరో పొగుడుతున్నారు.

మామ్మ సంతోషంతో తబ్బిబ్బయి పోయింది.

'పిల్ల నచ్చిందికదా నాయనా!'

'నచ్చకపోతే యింతదూరం యెందు కొస్తాను.'

'దానితల్లి దీవన — ఈ కష్టాల్లోనూ వెలుగు అగపడింది. దానికి అక్షింతాలువేసి నేనూ హాయిగా కళ్ళుమూస్తాను.'

మామ్మ అలా అంటూ యింట్లోనికి వెళ్ళింది. ఏదో గొడబగా వుందని వూహించాను. మామ్మ కోపంగా యేదో అంటోం దని యిద్దరికీ యేవో వాదోపవాదా లవుతున్నాయని అనుకొని తిరిగి వచ్చేముందు,

'అమ్మాయికి యిష్టంలేదా ?' అన్నాను.

'దాని యిష్టాయిష్టా లెవరిక్కావాలి. రత్నంలాంటి మొగుడు దొరికితే అప్పుడే నా పెళ్ళికి తొందరేం అంటుంది. తొందర కాదూ ?'

'అంతేనా ?'

'ఈరోజు పిలలు నాయనా — ఏదో చదివించానుకదా ? ఏమంటే ఉద్యోగంచేసి నన్ను పోషిస్తాదట — సరే నివ్వెళ్ళు. ముహూర్తం అదీ నిశ్చయించి నీకు రాస్తాను. పెళ్ళి యిక్కడే చేస్తాను.'

'పట్నంలో యేర్పాటు చేస్తాను.'

'నేను మరెక్కడికీ కదల్లేను బాబూ !'

'సరే' అని వచ్చేసాను. పెళ్ళయి పోయింది. కథ కంచికి మనం యింటికి' అన్నాడు శ్రీనివాస్.

మౌనంగా కూర్చున్న సూర్యంతో,

'ఎలావుంది కథ ?'

'బావుంది,'

'అర్ధాంగి రాకతో కావ్యంలో వర్ణించినట్టు—మోదుగులు పూసాయి. అశోకాలు పుష్పించాయి. సంపెంగలు వికసించాయి. పూలకోసం మూగుతున్న తుమ్మెదనై పోయాను !' సరా. 'మీకు బేరియమ్‌మీల్ టెస్టుకు వెళ్ళడానికి టైమైంది కదూ ?'

'అవును' అంటూ లేచి సూర్యం తన వరుపుదగ్గరకు వచ్చేసాడు. శాస్త్రవ్యాఖ్య యియలేదాడు,

(ఇంకా ఉంది)

పిల్లలు-ఆరోగ్యము



వింత అలవాట్లు-విపరీతపరిణామాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

కొందరు పిల్లలలో కొన్ని అసాధారణ చర్యలు కన్పిస్తుంటాయి. పెద్దలు వాటిని గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

మట్టి తినటం :— దీన్నే 'పైకా' అని అంటారు. ఇది సాధారణంగా మొదటి మూడేళ్లలో కన్పిస్తూంటుంది. పిల్లలు ఇసుక, మన్ను గడ్డి, బొగ్గులు, నాము, గోడకి ఉండేసున్నం, తలుపులకి, పూచలకి ఉండే రంగు తింటూ ఉంటారు. పాకే పిల్లలు కన్పించిన వస్తువుల్ని నోట్లో పెట్టుకోటం సామాన్యంగా జరిగేదే. ఇలాంటివి విపరీతంగా కాకుండా పెద్దలు చూడాలి. ఈ అలవాటు నరాల బలహీనత, మెదడు సరిగాలేని పిల్లల్లో, తరచు కన్పిస్తుంది. సరైన పోషణ లేకపోయినా కన్పించవచ్చు. మాంసకృత్తులు, ఖనిజములు, విటమిన్లు సరిగా లేకపోతే కూడా రావచ్చు. ఈ అలవాటు గల పిల్లలు ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. క్రిములు, విషపదార్థాలు శరీరంలో ప్రవేశించే ప్రమాదం ఉంది. దంతాలు వచ్చేటప్పుడు యిలాంటి అలవాటు పిల్లలకి రాకుండా జాగ్రత్తపడాలి.

శరీరానికి అవసరమైన పోషక పదార్థాలని క్రమంగా యిస్తూ ఉండటం, పళ్ళు వచ్చేటప్పుడు పిల్లలకి కొరకడానికి వీలైన గట్టి పదార్థాలని (రస్క్‌లు మొదలైనవి) యివ్వడం వల్ల ఈ అలవాటు రాకుండా చూడవచ్చు.

నోట్లో వేళ్లు వేసుకోడం :— పిల్లలలో యిది సర్వసాధారణం. నోట్లో వేళ్ళు వేసుకోడం వల్ల పిల్లలు తమచుట్టూ ఉన్న ప్రపంచాన్ని మర్చిపోతుంటారు. నిద్రపోయేముందు ఆకలి వేస్తున్నప్పుడు, ఆరోగ్యం సరిగా లేనప్పుడు, నిద్ర రానప్పుడు, తల్లిదండ్రులు తమని సరిగా చూడనప్పుడు పిల్లలు యిలా నోట్లో వేళ్ళు వేసుకోటం జరుగుతుంది. ఈ అలవాటు రెండో సంవత్సరంలోపలే తగ్గిపోతుంది. కొందరు పిల్లలలో అయిదు సంవత్సరాలువరకూ ఉండవచ్చు. ఎక్కువకాలం ఈ అలవాటు ఉన్నందువల్ల పలువరుస క్రమం తప్పే అవకాశం ఉంది. ఈ అలవాటు పైన చెప్పిన కారణాలవల్ల అయితే అవి లేకుండా ఉండేలా చూడటం చాలా ముఖ్యం. పిల్లల్ని కొట్టటం, వేళ్లమీద చేదు పదార్థాల్ని పుయ్యడం, కట్లుకట్టడం వల్ల ఈ అలవాటుతగ్గక పోగా మరింత ఎక్కువవుతుంది.


గోళ్లు కొరకడం :— నోట్లో వేళ్ళు వేసుకోడం సంతోషంగా ఉండటానికి చేస్తే గోళ్ళు కొరకడం యింకొకరిపై కసి తీర్చుకోడానికి కోపంతో పిల్లలు చేస్తారు. దీనికి వైద్యం వేరే అవసరం లేకపోయినా పిల్లల గోళ్లని ఎప్పటికప్పుడు కత్తిరిస్తూ వాటిలో మట్టి చేరకుండా చూస్తూ ఉండాలి.

తల ఊపడం, విసరటం :— మానసికంగా దెబ్బతిన్న పిల్లలలో మెదడు సరిగా పెరగని శిశువులలో కొన్ని అలవాట్లు రావటానికి అవకాశం ఉంది. తల వూపటం, పక్కలకి విసరటం లాంటివి మరీ చిన్నపిల్లలలో, తలని గోడకి, తలుపులకి కొట్టుకోడం లాంటివి కాస్త పెద్ద పిల్లల్లో కన్పిస్తూంటుంది. వీటివల దెబ్బలు తగిలే ప్రమాదంఉంది. ఇలాంటిపిల్లల మానసిక ప్రవృత్తిని పరీక్షించడం అవసరం. పెద్దలు వీరితో ఎక్కువకాలం గడపాలి. వారికి ఆహారాన్ని సకాలంలో అందజేయడం, దగ్గరుండి నిద్రపుచ్చడం, ఆటలు, పాటలు నేర్పడం వల్ల వీటిని మాన్పవచ్చు. మరీ ఎక్కువగా ఉంటే డాక్టరు సలహా తీసుకోవాలి

ఊపిరి బిగపట్టడం :— కొంతమంది పిల్లలలో బాగా ఏడ్చినప్పుడు వూపిరి బిగపట్టడం, కళ్ళ తేలవేయడం, వళ్లంతా చల్లబడటం, శరీరం నీలంగా మారటం, బిగుసుకుపోవటం, కొందరికి స్పృహతప్పడం కూడా జరుగుతుంది.

సాధారణంగా ఆరు సంవత్సరాలలోపు పిల్లల లోనే యిలా జరుగుతుంది. అడిగిన వస్తువుని యివ్వకపోవటం వల్లనో, పిల్లలని కొట్టడం వల్లకానీ, శరీరంలో బాధ ఏదయినా కలిగినప్పుడు యిలా వస్తూ ఉంటుంది. దీన్నే మన వాళ్ళు చిన్నబిడ్డ గుణం అంటూ ఉంటారు. ఇది దానంతటదే తగ్గిపోతుంది. పిల్లల్ని ఎగరేయడం, ముదురుమీద కాల్చడం, ఇంజక్షన్‌లు, మందులు యిప్పించడం అనవసరం. క్రమేణా దానంతటదే తగ్గిపోతుంది. కొన్ని రోజుల తర్వాత అది ఏ కారణం వల్ల వస్తూందో పెద్దలకి తెలుస్తుంది. అలాంటి కారణాలని నివారించడం వల్ల ఈ వూపిరి బిగపట్టడం రాకుండా చూడవచ్చు.





■ ఎస్. వి. రామారావుగారి పేరు తెలుగు పాఠకులకి బాగా తెలిసినదే! వీరు ఇక్కడ రెండు డిగ్రీలు (బి.ఏ.,బి.కామ్.) తీసుకున్న తర్వాత మదరాసు లలితకళల కళాశాలలో 'చదువుకు'ని ఇంగ్లాండ్ వెళ్ళిపోయారు; అక్కడ వారు ఎన్నో ప్రదర్శనలు చేశారు, సన్మానాలు పొందారు. కొంతకాలం అక్కడ ఉన్న తర్వాత ఆయన అమెరికాకి వెళ్ళిపోయారు. ప్రస్తుతం కెంటక్కీ విశ్వవిద్యాలయంలో ఉంటున్నారు.

ఇటీవలే వారు కొన్ని ప్రదర్శనలు జరిపారు.

ఒకటి 'ఇవాన్స్‌విల్ మ్యూసియమ్ ఆఫ్ ఆర్ట్స్ ఎండ్ సైన్స్'లో. (ఇవాన్స్‌విల్ ఇండియానా రాష్ట్రంలో ఒక పట్నం.)

ఈ ప్రదర్శనలో ఆయన చూపించిన బొమ్మలలో కొన్ని 'నీలాంబరధర, ఉండవల్లి గుహలు, దీపావళి' అను శీర్షికలు కలవి.


కెంటక్కీ రాష్ట్రంలోని లూయీవిల్‌లో ఉండే జె. బి. స్పీడ్ ఆర్ట్ మ్యూసియమ్‌లో ఈ సంవత్సరం మార్చిలో వీరి ప్రదర్శన ఒకటి ఉజ్వలంగా జరిగింది.

మరొక ప్రదర్శన కెంటక్కీ రాష్ట్రంలోని 'లెక్సింగ్‌టన్'లో జరిగింది. (నవంబరు 1971 లో.) ఇక్కడ ప్రదర్శనమయిన బొమ్మలు కొన్ని మొదట చెప్పిన వాటిలోనూ ఉన్నాయి.

రామారావుగారు పొందిన ప్రశంసలు ఇన్నీ అన్నీ కావు!

ఆయన ప్రతిభని చాటే కొన్ని వివరాలు—

* 1961 లో బొంబాయిలో జరిగిన ఆల్ ఇండియా ఆర్ట్స్ ఎక్సిబిషన్ అవార్డు



రావు



పొందారు.


* 1964 లో ప్రపంచంలోకెల్లా ఉత్తములయిన 'లితోగ్రాఫర్‌గా' లండన్‌లోని స్లేడ్‌స్కూల్‌వారు ఎన్నుకున్నారు.

*, 1965 లో లార్డ్ క్రాఫ్ట్ ఏవార్డు గెలిచారు, లండన్‌లో.

* 1963 లో పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లో వీరి పటాలు ప్రదర్శించారు.

* 1965 లో గ్లాస్గో (స్కాట్లాండ్) నగరంలో వీరి ఏకచిత్రకారుడి ప్రదర్శనం జరిగింది.

* 1968 లో బాస్టన్ నగరంలోని కోడ్లీ సొసయిటీ ఎక్సిబిషన్‌లో వీరి బొమ్మలు ప్రదర్శించారు.



* 1969— న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీవారు వీరి 'ప్రింట్'లని ప్రదర్శించారు.

* 1969 లోనే సిన్సిన్నాటీ ఆర్టిస్ట్స్ ప్రదర్శనలో రామారావుగారి బొమ్మలని చూపించారు.

రామారావుగారి చిత్రాలు ఈ క్రింది సంస్థలలో ఉన్నాయి—

* స్లేడ్‌స్కూల్, లండన్.

* బ్రిటిష్ కౌన్సిల్, లండన్.

* మ్యూజియమ్ ఆఫ్ మాడర్న్ ఆర్ట్స్, న్యూయార్క్.

* నఫీల్డ్ ఫౌండేషన్, లండన్.

* విక్టోరియా ఎండ్ ఆల్బర్ట్ మ్యూసియమ్, లండన్.

* నేషనల్ గాలరీ ఆఫ్ మాడర్న్ ఆర్ట్, న్యూఢిల్లీ.

* ఆంధ్ర, కేరళ, తమిళనాడు ప్రభుత్వాల చిత్ర ప్రదర్శనశాలలలో.

చిత్రకారుడు శ్రీ ఎస్. వి. రామారావు గారిని, ఆయన గీసిన చిత్రాలలో కొన్నిటిని ఈ పేజీలలో చూడవచ్చు. (ఊ. వి.) ●



అప్పలసామి ఆత్మహత్య

అగేహానంద

బస్టాండును కావిలించుకుని గంటన్నర సేపు తపస్సు చేసినా భాగ్యనగరవాసి అప్పలసామికి బస్సు దొరకలేదు. మామూలుగా నెమ్మదస్తుడైనా ఈసారి నిజంగా కోపం వచ్చేసిందతనికి. 'వెధవ బస్సు' అని గట్టిగా తిట్టుకుని చేసేదేం లేక కాలినడక మొదలెట్టాడు. ఏదీ ఆలోచించకుండా వుండగలగడం మెదడుకు చేతకాని పనుల్లో ఒకటి. కాని శివుడాజ్ఞ లేనిదే చీమకూడా కుట్టదంటారు. ఆ పరమేశ్వరుని అనుమతి లభించినట్లుంది, అప్పలసామి మెదడులో కందిరీగల్లా లేచాయి ఆలోచనలు. ఈ కుళ్ళు సంఘాన్ని సంస్కరించి పారేయాలని ఒక్కసారిగా అయిడియా వచ్చిందతనికి; పైగా ఇంతకాలం ఆ అయిడియా రానందుకు ఆశ్చర్యంకూడా కలిగింది కాస్సేపు. సంఘంలోవున్న కుళ్ళుకూ, ఆర్టీసీ బస్సులకూ ఏం సంబంధం లేదంటే వినిపించుకునే మూడ్‌లో లేడు అతను. దేశంలో లంచగొండితనం బలిసిపోబట్టే తనకిప్పుడు నడవాల్సిన ఖర్మ పట్టిందనవచ్చు— అదేమంటే —

తనుమాత్రం ఎంతకాలం సహించి వూరుకోగలడు. మనిషి ఓర్పును కరకరా నమిలి మింగేస్తోంది ఈ సమాజం. అసలది సమాజం తప్పుకాదు; అది రోగంతో బాధ పడుతూంది. ఫుట్‌పాత్‌మీద ఎవరో రోగిష్టివాడు అడుక్కుంటుంటే ఐదు పైసలబిళ్ళ వాడిపైకి విసిరేసి రెండు నిముషాలు మౌనంగా వాడికోసం జాలిపడి మళ్లీ ముందుకు సాగాడు. ఇలాంటి సంఘటనలవల్ల సంఘాన్ని సంస్కరించాలనీ, లోకోద్ధరణకు పూనుకోవాలనీ, అంధకారంలో — అంటే అజ్ఞానాంధకారంలో దారితెలియక కొట్టుమిట్టాడుతున్న అశేష మానవాళికీ వెలుగు కిరణమై వ్యాపించాలనీ అప్పలస్వామికి ఉబలాటం క్షణక్షణానికీ పాకిస్థానంవాడి కోపంలా పెరిగిపోతుంది.

తనలో మాత్రం సలసలా మరిగే రక్తం ప్రవహించడం లేదూ! ఎందుకులేదు, బోలెడుంది. లేదని అనే దమ్ము లెవరికేనా వుంటే రమ్మనండి. బెంగాలీ కుర్రాడైనా

సరే—తాను గడ్డం గీక్కుంటున్నప్పుడు వచ్చిచూస్తే లెంపలేసుకుని మరీ వప్పుకుంటాడు. మొన్నోసారి పక్కింటి బామ్మగారు సరిగ్గా తాను గడ్డం చేసుకుంటున్న క్షణముకే తీరుబాటు చేసుకునివచ్చి కళ్ళు తిరిగి పడిపోయి రెండ్రోజులు ఊష్ణం తెచ్చుకున్నారు. ఇక తేలాల్సింది తన రక్తం పొగలు సెగలు కక్కేంత వేడిగా వుందా అని. చిద్విలాసంగా నవ్వుకున్నాడు అప్పలసామి. పిచ్చివాడా! నిప్పు ఎక్కడేనా చల్లగా వుంటుందా? ప్రవహించే నీరు అపరిశుభ్రంగా వుంటుందా? కాని, ఇక్కడ అర్జంటుగా మన రాజధాని మధ్యగా ప్రవహిస్తున్న మూసీనదీ దాని తాలూకు కంపు గుర్తుకు రావడంతో అప్పలసామి మొహంలో చిర్నవ్వు ఎగిరిపోయింది. ఓక్షణంపాటు ఆగి సర్ది చెప్పుకున్నాడు. ఇందాక బస్సు దొరక్కుండా పోయినప్పుడు కండక్టరును ఎంత గట్టిగా ఝూడించి పారేశాడు. ఫూర్ ఫెలో! బస్సుతో వెళ్ళిపోయాడుగాని లేకపోతే తానన్న మాటలకు ఆ బస్సుకిందేపడి సూయిసైడ్ చేసుకునేవాడు. ఆ తరవాత అతడిని ఆత్మహత్యకు ప్రోత్సహించినందుకు చట్టంకింద తను అరెస్టయ్యేవాడు. ఇంకా నయం! అయినా తన కోపపు వేడినీ, సలసలా కాగుతూన్న రక్తపు వేడినీ ఇలా సాధారణ మానవులమీద చూపించకూడదు—ఇలా వెంటనే తీర్మానించుకున్నాడు అప్పలసామి.

ఎందుకేనా మంచిదని అనుమాన నివృత్తి కోసం తోవలో, థర్మామీటర్ కొనుక్కుని మరీ వెళ్ళాడు గదికి. తీరాచూస్తే ఎర్రగీతకు కొద్దిగా కిందికివుంది పాదరసం. తలుపులు వేసుకుని మరీ వ్యథపడ్డాడు—ఇలా చెడిపోయిన థర్మామీటర్‌ను తనకంటగట్టిన సమాజంమీద జాలి, కోపం మరీ ఎక్కువైపోయాయి అతనికి. ఇక వూరుకుని లాభంలేదు. బ్రహ్మచారిగా వుండగానే నడుం బిగించాలి—గృహస్థాశ్రమం స్వీకరిస్తే వీలుపడకపోవచ్చు. కట్టుకున్న కోమలి కొంగుచ్చుకు తిరగడానికీ, ఆవిడ అందించిన చిరుగు సంచీ పుచ్చుకుని వెచ్చాలు తీసుకు రావడానికీ రోజులు అంకితమైపోతాయి. యువకుడైన తను చలిమిడి ముద్దలా చతికిల పడిపోగూడదు—వెంటనే కార్యదీక్ష పూని రంగంలోకి దూకాలి.

ఇలా ఎంతమంది చెడిపోయిన థర్మామీటర్లు కొనుక్కుని బాధపడుతున్నారో తలచుకుంటే గుండె తరుక్కుపోయింది అతనికి. ఆ రాత్రి బలవంతంమీద నిద్రాపుకుని ఆలోచించి ఆలోచించి ఒకనిర్ణయానికి వచ్చాడు. గాంధీజీ అన్నట్టు మనిషిని మార్చాలి కాని పరిమార్చకూడదు. గాంధీగారి దేశంలోపుట్టి తాను నక్సలైట్ బ్రాండు ఆలోచనలు దగ్గరికి రానివ్వకూడదు. ఇకపోతే తనకు మిగిలింది కలం. ఈ అయిడియా రాగానే ఒక్కగెంతులో బట్టలస్టాండుమీద పడి ఫాంటు జేబులు వెదికి చూచుకున్నాడు. అమ్మయ్య! తన పేనా భద్రంగానేవుంది. ఇక తను ఏమాత్రం ఆలస్యంలేకుండా తావులకు తావులు రాసి పారేస్తాడు. ఈ మనుషులంతా అది చదువుకుని సిగ్గుతో తలలు వాల్చుకుంటారు. వాళ్ళ మెదడులో తాను చెడామడా ఏకిన విషయాలు సైకిళ్ళేసుకుని మరీ తిరుగుతాయి. ఒకటోరెండో అలా బస్సులో ఇంకొంచందూరం పోయి వాళ్ళ హృదయాల్లో పరివర్తన తీసుకువస్తాయి. ఇక ఈ సంఘం బాగుపడేందుకు కట్టెకట్టెం పెట్టాడు.

నిశ్చింతగా నిద్రపోయాడు అప్పలసామి లైటేనా ఆర్పకుండా.

మర్నాడు కూడా అదే ఆలోచనలో సతమత మయ్యాడు అప్పలసామి. లోకాన్నుద్ధరిద్దామనే ఆకాంక్ష అతన్ని ఆఫీసులో ఏపనీ చేయనివ్వలేదు ఆ రోజంతా. జనరల్‌గా వ్యాసాలు రాస్తే లాభంలేదని లంచ్‌టైం లోపల నిర్ణయించుకున్నాడు. చాలామందికి వ్యాసాలంటే పడదు. కథలైతే అంతా చదువుతారు. థీమ్‌కోసం ఏదేనా తీవ్ర సమస్యను వెదికి మరీ మొదలెట్టదలుచుకున్నాడు.

'సమాజంలో ఇది తీవ్ర సమస్య అనీ అది కాదనీ అంటానికి వీల్లేదు,' బర్కిలీ వెలిగించుకుంటూ జవాబిచ్చాడు కుప్పుసామి, 'ఒకసారి విప్లవంవస్తే అన్నీ సరుకుంటాయి...'

'నేనడిగింది కథ వ్రాయడానికి థీం కోసం.' అప్పలసామి జ్ఞాపకం చేశాడు.

'అదే నేనూ చెబుతున్నాను. విప్లవం ఎప్పుడో వస్తుంది, ఈ సంఘం బాగుపడుతుందనే భావాలతో చేతులు ముడుచుక్కూర్చోకుండా ఆ విప్లవం త్వరలో రావడానికి దోహదంచేయి. విప్లవాత్మకమైన రచనలు చేసి ప్రజలను ఉత్తేజపరుచు. సర్వమానవ సమానత్వం తీసుకువచ్చి ఈ సంఘంలోని తారతమ్యాలను రూపుమాపే సంచలనంకోసం కృషిచేయి. రష్యాలో చైనాలో వచ్చి మనదేశంలో విప్లవం రాకపోవడం అంతర్జాతీయ స్థాయిలో మనకు తలవంపులు కలుగజేయడం లేదూ?'

ఇలా ఉపదేశంచేసి రాయల్ ఎన్‌ఫీల్డ్ మీద బుల్లెట్‌లా దూసుకుపోయాడు కుప్పుసామి.

'కుప్పుసామి వెళ్ళిపోయిన తరవాత జ్ఞాపకం వచ్చింది అప్పలసామికి, వాడజేటీ ఫెడరేషన్ సభ్యుడని! హారా! అనుకున్నాడు. ఇంకా నయం వెధవ తన్ను బ్రెయిన్‌వాష్ చేశాడుకాడు. కుప్పుసామికి మోటారుసైకిలూ, తొందరా వున్నందుకు మొదటిసారి సంతోషించాడు. అప్పలసామి. ఇంతలో తన కర్తవ్యం గుర్తుకువచ్చి తోవలో సహోద్యోగి వెంకటసామి ఇంట్లో దూరాడు.

'నిరుద్యోగ సమస్య,' రెండు ముక్కల్లో తేల్చాడు. వెంకటసామి 'సోషలిజం, సోషలిజం అంటూ ఎన్ని నినాదాలేసినా లాభం లేదు. మొదట కావలిసింది ప్రతివాడికీ పని—శోషలిజంకాదు. కొత్త ఫ్యాక్టరీలు తెరవాలి, కొత్త డాములు కట్టాలి, కొత్త మిల్లులు ప్రారంభించాలి, అలా అయితేనే గాని దేశంలో వుత్పత్తి పెరగదు. ఇంత మంది ఇంజనీర్లు వుద్యోగాల్లేక ఏడుస్తూంటే ఏ దేశంమాత్రం బాగుపడుతూంది? వీళ్ళవుసురు కొట్టి ఎంతవచ్చని దేశమైనా భగ్గున మండిపోతుంది. మరి పాకిస్థానంవాడు దురాక్రమణ చేశాడంటే చేయడూ! పైగా వాడికి అమెరికా, చైనాల మద్దత్తు కూడా...'

మన దేశంలో నిరుద్యోగ సమస్యకూ, పాకిస్థానంవాడి దురాక్రమణకూ, 'తనడిగిన ప్రశ్నకూ సంబంధమేమిటో అప్పలసామికి అంతుపట్టలేదు. అతనికి తెలిసిందల్లా వెంకటసామి తమ్ముడు కృష్ణసామి ఇంజనీరింగు రెండవ సంవత్సరం చదువుతున్నాడని తమ్ముడు బి. ఈ. పాసయేలోగా (అంటే మరో పదేళ్ళలోగా) దేశంలో నిరుద్యోగ సమస్యను నిర్మూలించడమో

అని అర్థం వచ్చేలా అందరి దగ్గరా వెంకటసామి గోడు వెళ్లబోసుకుంటాడు.

వెంకటసామి అంతుపొంతు లేకుండా లెక్చరు దంచేస్తుంటే బోరుకొట్టి తలకాయ అటు వేపు తిప్పితే వెంకటసామి కూతురు కనిపించింది. తలుపు చాటుగా నిలబడి అప్పలసామినే కన్నార్పకుండా చూస్తోంది. అప్పలసామి అటు చూడగానే సిగ్గుపడి లోపలికి తుర్రుమని పారిపోయింది. కాని, ఆ చూపుల్లోని సందేశం అప్పలసామికి అప్పుడే అందింది. ఆ అమాయక కళ్ల లోతుల్లోంచి ప్రసరించే వెలుతురు చూడగలిగాడు. ఇక ఆలస్యం అయితే వున్న మెదడు కాస్తా వెంకటసామి తినేస్తే కథలు రాసుకోవడానికి తనకేం వుండదు.

ఒకటి, రెండు, మూడు...మనసులో అనుకుని తెరిచివున్న తలుపుల్లోంచి ఒక్క అదటున పరుగెత్తి రోడ్డుమీద పడ్డాడు. ఈ వెంకటసామి ఐదేళ్ల కూతురు (ఇక్కడ పాఠకులను నిరుత్సాహపరిస్తే క్షమించాలి) పెరిగి పెద్దదౌతూంది. మన దేశంలో పుట్టిన ప్రతి ఆడపిల్లకూ పెళ్లి కంపల్సరీ. పెళ్లి అంటే వెంటనే కట్నం జ్ఞాపకం వస్తూంది మనకు.

ఆ రాత్రి నిద్రాహారాలు మాని కాగితాలక్కాగితాలు రాశాడు అప్పలసామి. మర్నాడు పక్కింటి ముత్తుసామిచేత ఆఫీసుకు లీవు లెటర్ పంపించేసి కూర్చుని ఆ కాగితాల్లోంచి ఏరిఏరి ఓ పదికాగితాలు బయటకు

అప్పలసామి...

లాగాడు. వాటిమీద ఇష్టం వచ్చినట్టు ఒకటినుండి పది అంకెలువేసి కవర్లోకి తోసి. జి. పి. ఓ. కు వెళ్లి మరీ పోస్టు చేశాడు.

ఆ తరవాత నిశ్చింతగా సాయంత్రందాకా నిద్రపోయాడు. కథ తిరిగి వస్తుందన్న బెంగ ఏమాత్రంలేదు. అది తిరిగి రాకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాడు. ఉదాహరణకు స్టాంపులతోకూడిన చిరునామాగల కవరు జతచేయలేదు.

అప్పలసామి నిరీక్షణకూ, అచంచల ఆత్మవిశ్వాసానికీ, ఫలితంగా, ఓరోజు ఆఫీసు నుండి మొహం వేళ్లాడేసుకునివచ్చి నీరసంగా తలుపుతీసినప్పుడు పోస్టుమాన్ పడేసిపోయిన పత్రిక కనిపించింది. అప్పలసామి బ్రహ్మానంద భరితుడై ఆరోజంతా సంతోషించి మర్నాడు ఆఫీసులో కనబడ్డ వాడికల్లా ఈ శుభవార్త చెప్పుకోసాగాడు. ఆ కనబడ్డ వాళ్లంతా కూడబలుక్కుని ఓ పార్టీ కూడ వూడగొట్టారు, ఆ సాయంత్రమే.

అయినా ఫరవాలేదులే అనుకున్నాడు అప్పలసామి. వీళ్లంతా అమాయకులు, వీళ్లను క్షమించు అంటూ ఆ రోజు రాత్రి మరిచిపోకుండా భగవంతుణ్ణి ప్రార్థించాడు. కథను ఎనభై రెండోసారి చదువుకుని మురిసిపోయాడు. వరకట్నాచారాన్నీ, దాన్ని పుచ్చుకునే వాళ్లనూ, ఇచ్చేవాళ్లనూ నిష్పక్షపాతంగా, నిర్మొహమాటంగా కట్టిగట్టి దుమ్మెత్తి పోశాడు దాంట్లో. వీరేశలింగం పంతులుగారికంటే ఘాటుగా రాశాడు తను. అబ్బ! ఏం డైలాగులు. ఇక వరకట్న సమస్య పూర్తిగా సమసిపోవడానికి ఎక్కువరోజులు పట్టవు. దేశ పౌరుడుగా తన పవిత్ర కర్తవ్యాన్ని, విధిని నిర్వహించాడు. తెలంగాణా, రాయలసీమా, ఆంధ్రా అనే భేదాల్లేకుండా తెలుగు వాళ్లంతా ఏకమై వరకట్న దురాచార పిశాచాన్ని తగులబెట్టి ఆ బూడిదను ఈసా, మూసానదుల పవిత్ర సంగమంలో కలిపే రోజు జంబో జెట్ లో త్వరలోనే వస్తుంది.

అప్పలసామి ఇలా చంకలు గుద్దుకుంటున్న తరుణంలోనే పత్రిక తెచ్చిన పోస్టుమానే రోజుకొకటి చొప్పున మూడు పోస్టుకార్డులు మోసుకొచ్చాడు. ఆ పుత్తరాలు వరసగా ఇలా వున్నాయి.

ఒరే తమ్ముడూ,

నీవు పంపిన పత్రికా, పుత్తరం అందాయి. అది నీవు రాసినకథ అని అట్టే నమ్మకం కుదరేదు కాని నీపేరు కింద ఎర్రసిరాతో గీతలుగీసి మరీ పంపావు గనక అలానే అనుకుంటున్నాను. కథపేరు బావుంది. కథకి పత్రికలవాళ్లేసిన బొమ్మ ఇంకా బావుంది.


కాని, ఏంట్రా మరీ బరితెగించి రాశావు? అన్నయ్యకు తెలిస్తే ఇంకేమైనా వుందా. వాడు ఎంతో కష్టపడి నీకు పదివేల కట్నం కుదిరిస్తే ఇప్పుడిట్రా ఇలాంటికథలు రాయడం? పెళ్లైంతరవాత రాసుకోకూడదూ, మరీ చోద్యంగా వుంది నీపని.

మీ అక్కయ్య,
వెంకటసుబ్బమ్మ.

ఈ పుత్తరం చదివి అవతలికి గిరాటేశాడు అప్పలసామి. రెండు నెలదాకా అక్కయ్యకు పుత్తరం రాయకూడదు అని తీర్మానించుకున్నాడు.

ఒరే అప్పలూ,

నీవు పత్రిక ఎందుకు పంపావో అర్థం కాలేదు నాకు మొదట. తెరిచిచూస్తే ఓ కథపేరూ దాని పక్కన నీపేరు అండర్లైన్ చేసివుంటే బోధపడింది. చాలా సంతోషించానుకూడా. ఇంకా కథ పూర్తిగా



చదవలేదు- మరో రెండ్రోజుల్లో పూర్తి చేస్తాను. నీవు కథరాసిన సంగతి తెలియగానే నాక్కూడా మూడ్ వచ్చి ఏక బిగిన్నాలుగు కథలు రాశాను. అవి పత్రికకు ఎలా పంపాలి? పత్రిక సంపాదకుడు నీకు తెలుసునా? నా కథలుకూడా అచ్చయేట్లు చూడగలవా? ఈ విషయాలు తెలియ జేస్తూ వెంటనే వ్రాయగలరు.

ఇట్లు,

నారాయణసామి

ఈ వుత్తరాన్ని చింపి పోగులెట్టి వాడి ఛస్తే వుత్తరం రాయకూడదని శపథం చేశాడు అప్పలసామి.

ఒరే అప్పిగా,

ఏదోలే అని వూరుకుంటే (శుతిమించి రాగాన పడుతుందే నీ వ్యవహారం. పిచ్చిపిచ్చి వేషాలేస్తే పళ్ళు ఊడేస్తాను. బాగుపడే లక్షణాలు వున్నవాడు రాసే కథేనా అది? పైగా తగుదునమ్మా అని డబ్బుతగలేసుకుని అన్ని పత్రికలు కొని అందరికీ పోస్టులో పంపుతావా—ఏమిటి నీ వుద్దేశ్యం? నాలుగు డబ్బులు కళ్ళజూసే వుద్యోగం దొరగ్గానే కళ్ళు నెత్తిమీదికి వచ్చాయా? నరికేస్తా జాగ్రత్త — కట్నముూ, దురాచారమూ గ్రుటా అంటే.

ఈ శుక్రవారం సెలవు తీసుకునిరా. వీరాసామిగారమ్మాయిని సెటిల్ చేశాను, చూద్దువుగాని.

మీ అన్నయ్య,

కుమారసామి.

మూడో వుత్తరం చదివి కళ్ళు తిరిగి పడిపోయాడు. అన్న బురమీసాలు జ్ఞాపకం వచ్చి ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు. ఆ రాత్రంతా కూర్చునిఅన్నవుత్తరంఒకలక్షా ఎనిమిదివేల తొంభై రెండుసార్లు చదువుకొని శోషవచ్చి మంచంమీద పడిపోయాడు.

ఆ పై నెల్లో అప్పలసామి పెళ్లి వీరాసామి అమ్మాయి సుబ్బలక్ష్మితో ఘనంగా జరిగింది.

ఆంధ్రదేశం ఒక మహోజ్వల రచయితను కోల్పోయింది.

వారఫలం

2-6-1972 శుక్రవారం మొదలు
8-6-1972 గురువారం వరకు

మేషం అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో మీరెంత శ్రమపడినా, ప్రయోజనం ఉండదు.

స్త్రీలకు:- కుటుంబ వ్యవహారాల్లో చికాకులు ఏర్పడతాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

వృషభం వృత్తిలో అనుకూలాల వార్తలను వింటారు నూతన వ్యవహారాలు లాభిస్తాయి. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి.

స్త్రీలకు:- ఆరోగ్యం బాగుంటుంది విలాస వస్తువులు కొంటారు.

మిథునం అనవసరమైన శ్రమ కలుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు:- కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం: మీ ప్రయత్నాలు సులువుగా నెరవేరతాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వారం మధ్యలో చికాకులు ఏర్పడతాయి. ఎవరినీ గుడ్డిగా నమ్మడం తగదు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి.

స్త్రీలకు:- ఆరోగ్యం బాగుంటుంది. నూతన వస్తువులను కొంటారు.

సింహం: వ్యాపారంలో శ్రమ మీరిన అనుకూలత లభిస్తుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. వారం ఆఖరులో వ్యతిరేక పరిస్థితి ఏర్పడుతుంది.

స్త్రీలకు:- కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

కన్య మీ ఆలోచనలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. పోటీవారితో వాదప్రతివాదాలు తగవు. ఇతరుల నిమిత్తం శ్రమకు గురి కాగలరు. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు లాభిస్తాయి.

స్త్రీలకు:- ఆరోగ్యం బాగుంటుంది. బంధు మిత్రులను కలుసుకొంటారు.

తుల అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు ఏర్పడతాయి.

స్త్రీలకు:- పోటీవారిలో గౌరవం లభిస్తుంది. అలంకార వస్తువులు కొంటారు.

వృశ్చికం: వృత్తిలో పోటీవారి పోటీ తగ్గుతుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు:- ఆరోగ్యం బాగుంటుంది వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు: ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. మిత్రులు సహాయం చేస్తారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. వారం ఆఖరులో సామాన్యమైన పనులకు కూడా మీరు ఎంతో కృషి చేయవలసి వస్తుంది.

స్త్రీలకు:- కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

మకరం: అన్ని వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి.

స్త్రీలకు:- ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

కుంభం మీరు తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. ప్రయాణాలలో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి.

స్త్రీలకు:- కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

మీనం వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వారం మధ్యలో ఉద్యోగంలో శ్రమ కలుగుతుంది. చికాకులు ఏర్పడతాయి. వారం ఆఖరులో అనుకూల పరిస్థితులు ఏర్పడ గలవు.

స్త్రీలకు:- ఆరోగ్యం బాగుంటుంది. నూతన విషయాలను తెలుసు కొంటారు.

—మహేష్

సీరియల్



రాగధార

విమలారామం

జరిగిన కథ

మాధవరావు ఆ వూళ్లోకి స్కూలు మాస్టారిగా వచ్చాడు. ఎవరికో ఉపకారం చెయ్యబోతే అతను కుక్కకాటుకు గురి అయ్యాడు. రామ్మగారు అతన్ని యింటికి తీసుకువచ్చింది. అనురాధ తొలి చూపుల్లోనే అతన్ని ఆకర్షించింది. ఆమె తండ్రి అభిప్రాయం ప్రకారం అతను ఆ యింట్లోనే వుండిపోవలసి వచ్చింది. ఆ రోజున తూలుతూ వచ్చాడు మాధవరావు. అతనుకూడా తన తండ్రిలాగా తాగుబోతు అయినందుకు విచారించింది అనురాధ. అతనికి హితబోధ చేసింది. మాధవరావు తప్పు తెలుసుకున్నాడు. ఆతర్వాత అనురాధ అతనికి మరింత చేరువైపోయింది. ఆ తర్వాత అతనిదగ్గర చదువుకోవడం ఆరంభించింది. రంగరాజు కొడుకు రాజారావు ఊరికి ప్రెసిడెంటుగా నెగ్గాడని ఆమె చాలా బాధపడింది. మాధవికి పెళ్లయి అత్తవారింటికి వెళ్లిపోయింది. రాజారావు రాధని నిర్బంధించాడు. మాధవరావుకు సంబంధించిన ఒక రహస్యాన్ని వెల్లడించాడు. రాధ నమ్మలేదు. రాజారావు అత్యాచారం చెయ్యబోగా ఆమెకి స్పృహతప్పింది. మాధవరావు ఆమెని రక్షించాడు. దెబ్బలుతగిలిన మాధవరావు రాధ సపర్యలతో కోలుకుంటాడు.

15

దేవుడు అన్నిచోట్ల ఒకేసారి తను పుట్టించిన జీవుల్ని సాకలేక అందరికీ తల్లుల్ని ప్రసాదించాడని ఒక సామెత ఉంది.

అందుకనే 'అమ్మా' అన్న మాటలో అమృతానికి లేని మాధుర్యము, అరవిందంలో లేని చల్లదనము ఉన్నాయి. ఈ అనుభూతి ప్రతిజీవికి దేవుడడక్కుండా ఇచ్చిన వరం!

కాని, ఈ లోకంలో అటువంటి భాగ్యం లేని దురదృష్టవంతులు కొందరున్నారు. నాలా తల్లి ప్రేమకు ఏ అదృష్టహీనుడూ దూరం కాడు... దూరమయినా నాలా శిలలా మారిపోలేదు.

తల్లిదండ్రుల ఆదరాభిమానాలకు నోచుకోని నిర్భాగ్యుడిని నేను. అనాథగా పుట్టడం వేరు. అందరూ ఉండి అనాథ కావటం వేరు. మొదటి తెగవారికి ప్రపంచం సానుభూతి, తోటివాళ్ళ మన్నన లభించవచ్చు. కాని, రెండవ తరగతివారికి సహవాసుల సానుభూతి లభించదు సరికదా అవమానం, అవహేళన ఎదురవుతాయి!

నా బాల్యం అంతా విషాదంగా గడిచింది.

తల్లి ఉండీ లేనివాడిని నేను. నేను పుట్టిన కొద్ది కాలానికే నా తల్లికి మతిస్థిమితం తప్పిందట! ఎందుకలా జరిగిందన్నది ఇదమిద్ధంగా ఎవ్వరూ చెప్పకపోయినా కారణాలు అందరికీ స్పష్టంగా తెలిసినవే!

ఎవ్వరూ ఆమెను గురించి పట్టించుకోలేదు. ప్రాణం మిగిలింది కనుక బ్రతికింది... ప్రపంచంతో సంబంధం లేకుండా తన లోకంలో గడిపింది. స్పృహవున్న తల్లి అయితే కొడుకు మేడమెట్లపైనుంచి దొర్లి పడిపోతుంటే కళ్ళప్పగించి చూస్తుందా? మహారాణిలా పుట్టిపెరిగిన స్త్రీ ప్రపంచంతో సంబంధంలేని పిచ్చిదయింది!

అలా మెట్లపైనుంచి క్రిందపడికూడ పిడిరాయిలా బ్రతికాను నేను.

'నాన్న' అనే వ్యక్తి నాకు ఉన్నాడని తెలుసుకొని... ఆయన ప్రేమకు నేను నోచుకోలేదు.

ఏడు తరాలుగా కూడబెట్టిన ఆస్తికి ఏకైక వారసుడు నా తండ్రి. రెండు మహాభవంతులు, రెండు పెద్ద కంపెనీలు, బీచికి దగ్గరగా మంచి బంగళా, బంగారం పండించే మాగాణి భూములు ... వీటిని సంరక్షించేవాళ్ళు వేరుగా ఉంటే చిన్నతనం నుండి అతి గారాబంగా పెరిగిన నా తండ్రి వినోదాలకు, విలాసాలకు బానిస కావటంలో ఆశ్చర్యమేముంది?

ఆయన కళ్లు తెరచేసరికి ఆస్తి హరించిపోవటం మొదలుపెట్టింది. పోయిన దానికోసం బాధపడే వ్యక్తి జీవితాన్ని అనుభవించలేడని ప్రతి విలాస పురుషుడు అనుకుంటాడు. అలవాటుపడిన విలాస జీవితాన్నుంచి మరలటం అతని తరం కాదు. నాతండ్రి విషయంలోను అంతే జరిగింది. తనకున్న ఆస్తి ఎంతో మేనేజరు లెక్క చెప్పవల్సి వచ్చినప్పుడు ఇక ఆ వ్యక్తికి పతనం కాక మరేమిటి?

వినోదానికి, విలాసానికి కావల్సింది డబ్బు! అవసరమైనప్పుడు తనకింత డబ్బు కావాలని ఆయన అడగటం ... అంతడబ్బు లేదంటూనే ఆ మేనేజరు డబ్బు తెచ్చి యివ్వటం జరుగుతూండేది. దానితో సామర్థ్యంగల మేనేజరు ఉండటం వల్లనే ఆదాయం బాగా వస్తోందని నాన్నగారు

భ్రమించటం ఆ భ్రమలోనే ఏళ్లు, పూళ్ళు గడచి పోయాయి.

అటువంటి బాధ్యతా రహితుడైన తండ్రికి రెండవ కొడుకుని నేను. నా కంటె నాలుగేళ్లు పెద్దవాడైన నా అన్న మానాన్న 'నోట్లోంచి ఊడి పడ్డాడని' చిన్నప్పుడంతా పొగడ్త కోసం అన్నమాటను అన్నివిధాల సార్థక పరచుకున్నాడు!

ఇంతమంది ఉండీ ... ఆగర్భ శ్రీమంతుని పుత్రుడయి కూడ ఒంటరిగా నాలోకంలో నేనుండి పోయిన అనాధుడిని నేను.

తల్లిపాలు త్రాగి రెండేళ్ళు పెరిగిన నేను ఒక్కసారిగా తల్లిప్రేమకు ఎందుకు దూరమయ్యానో తెలుసుకోలేక పోయాను. కాని, శంభుతాత నేను పెద్దయ్యాక చెప్పిన విషయాలను బట్టి మా కుటుంబం ఎందుకు విచ్ఛిన్నమయిపోయిందో పూర్తిగా గ్రహించాను.

అన్నయ్య పుట్టినప్పటి నుంచి అమ్మ కేదో అనారోగ్యంగా ఉండేది. ఇంతలో నేను కడుపున పడ్డాను. దానివల్ల పిల వాడిని సాకటానికి కష్టమయి ఒకదాది కావల్సి వచ్చింది. తన లోకంలో పడివున్న నాన్న గార్కి ఈ విషయంపై శ్రద్ధాసక్తులు ఎలా ఉంటాయి! అమ్మ కోరిక విని తనొక బాధ్యత కల వ్యక్తిని అన్నయ్య సంరక్షణ కోసం తెస్తానని మేనేజరు లోకనాధం అన్నాడు.

కుటుంబానికి అన్నివిధాల పెద్ద దిక్కుగా ఉన్న లోకనాధం తానన్ని విధాల సమర్థుడనని నిరూపించుకున్నాడు. ఆ రోజుల్లోనే భర్తను పోగొట్టుకొని ఆరేళ్ల కుమార్తెతో ఆశ్రయం కోసం అన్నగారింటికి వచ్చింది చెల్లెలు అన్నపూర్ణ.

ఈ విషయం తన మాటకారి తనంతో అమ్మ చెవిని వేసాడు అతను ... 'మా పూర్ణ బొత్తిగా అమాయకురాలమ్మా! అందకనే తన దుఃఖాన్ని మర్చిపోయి నట్లు ఉంటుంది, మీకు ఆసరాగా ఉన్నట్లు ఉంటుంది ... పరాయివాళ్లకన్న మన అమ్మాయి అయితే పిల్లాడిని బాగ చూసుకుంటుంది. ఆపైన మీ యిష్టం.' అని నచ్చజెప్పాడు. సానుభూతితో, సహృదయంతో అమ్మ అన్నపూర్ణను ఆహ్వానించింది.... మూడేళ్ళ పిల్లాడిని ఆమె చేతుల్లో పెట్టి సంరక్షించమంది.



క్రొత్తలో అన్నగారింటినుంచి రోజూ వెళ్ళి వచ్చేది అన్నపూర్ణ. తన కూతురు రజనిని, ఇటు అన్నయ్యను చూసుకోవటం కష్టంగా ఉన్నట్లు ఆమె మనసులోని మాట బయట పెట్టింది. 'నేనే నీకు చెబుదా మనుకున్నాను. నీ కభ్యంతరమేమో నని ఇన్నాళ్ళు సందేహించాను. నువ్వు నాకు పరాయిదానివి కాదు కదా! నీ రజనిని తీసుకు వచ్చి ఇక్కడే వుండు. అన్నయ్యగారితో నేను చెప్తాను.' అని అమ్మ చెప్పింది.

కావల్సింది లభించింది. అన్నపూర్ణ తన కుమార్తెతో మా ఇంటిలో స్థిర నివాసం ఏర్పరచుకొంటుంది.

అన్నపూర్ణ తన బ్రతుకులో నిప్పులు పోస్తుందని అమ్మ ఎప్పుడూ అనుకోలేదు. 'అక్కయ్యా' అంటూ నోరారా పిలుస్తూ తన్ను కాలు క్రింద పెట్టకుండా చేసే అన్నపూర్ణ తన అమృతమయ జీవితంలో విషపు చుక్కలు రాల్చే కాలనాగు అని అమ్మ కెలా తెలుస్తుంది?

అమృతము, హాలాహలము పాల సముద్రం నుంచే పుట్టాయి. తన మధుర వాక్కులలో ప్రేమను పంచి యిచ్చిన అన్నపూర్ణే అమ్మను మరొకనాడు ఈసడించు కుంటుందని ఎవరూ ఊహించ లేక పోయారు.

నవ మాసాలు మోసి నన్ను కన్నతల్లి నేను గర్భంలో వున్న రోజుల్లో మాత్రమే ఏ మాత్రమో సుఖం అనుభవించింది. నేను భూమిమీద పడి కెవ్వుమని ఏడ్చిన ఏడ్పు నా తల్లికి రాబోయే కష్టాలకు నాంది కాగలదని నాకు తెలియదు ... నా తల్లికి తెలియదు.

అమ్మ ఆరోగ్యం మొదటి నుంచీ అంతంత మాత్రంగానే వుంది. నేను పుట్టాక తన గదిలోంచి బయటకు రాలేని స్థితిలోకి వచ్చింది. నాన్నగారి తరఫు తెలిసి అమ్మ పుట్టింటి వాళ్లెవరూ ఆసరాకి రాలేదు. అభిమానంతో అమ్మ ఎవరికీ కబురు చెయ్యలేదు. అన్నపూర్ణే అన్నిటికీ దిక్కయింది.

అప్పటికే ఆమె మా యింటికి వచ్చి ఆరు నెలలు దాటింది. అమ్మను అన్ని వేళల్లోను కనిపెట్టుకొని సేవ చేసింది. మరి అమ్మకు ఆమెపై అభిమాన మేర్పడ

రా గ ధా ర

టంలో ఆశ్చర్య మేముంది?

అమ్మ ఒకటి అప్పగిస్తే తాను పదింతలు అందుకుంది అన్నపూర్ణ. ఇంటి బాధ్యతనంతా తానే స్వీకరించింది ఆమె. దీనివల్ల భవిష్యత్తు విషాదపూరిత మవుతుందని అమ్మ ఎప్పుడూ ఊహించ లేదు. అమ్మకు కావల్సింది...తన్ను, తన బిడ్డల్ని అభిమానంతో చూసే వ్యక్తి. ఆ అభిమానాన్ని అన్నపూర్ణ అందించింది. అది మాత్రం నిజం! అందువల్లనే అమ్మ అన్నపూర్ణను ఎప్పుడూ అనుమానించ లేదు.

బహుశ అన్నపూర్ణ మా యింట మొదట ఏ దురుద్దేశ్యంతోనూ చేరక పోయి వుండవచ్చు. కాని, సాధారణ సంసారం నించి ధనికులింట కాలు పెట్టిన వ్యక్తి ఆమె. ఆ వైభవం చూసి ఆమె మనసు చలించి వుంటుంది. అందులో పరిస్థితులు అనుకూలించాయి. ఇంటియజమానికిల్లుపట్టదు. యజమానురాలు రోగిష్టిది. ఆస్తి సంరక్షకుడు స్వయంగా తనకు అన్న. ఇప్పుడు ఇంటి బాధ్యత అంతా తనది. రోజూ తన చేతులమీదుగా ఎన్నో వచ్చునోట్లు మారి పోతున్నాయి. ఇంతకన్నా మంచి అవకాశం ఎవరికి మాత్రం లభిస్తుంది?

అన్నపూర్ణ సహజంగా అందకత్తె. పుష్టికరమైన ఆహారం తీసుకుంటూ తన గతాన్ని మరచి నిశ్చింతగా ఇంటికంతటికీ తానే ఏలికగా మసులుతున్నప్పుడు శరీర లావణ్యం కాంతులు విరజిమ్మటంలో ఆశ్చర్యమేముంది ?

ఆ కాంతులతో ఒకనాడు విలాస జీవితమే పరమావధిగా భావిస్తున్న నా తండ్రి కళ్ళు మిరిమిట్లు గొలిపాయి!

దీపం మీదకు మధురతరమైన భోజ్యం మనుకొని మిడత దుముకుతుంది. సంయోగంలో క్షణికమైన రాక్షసానందాన్ని అనుభవిస్తుంది. మరుక్షణంలో తానే మసి అయిపోతుంది! అటువంటిదే నా తండ్రి జీవితల కూడ!

'పెట్టని కోటలాంటి ఐశ్వర్యం రక్షణగా ఉంటే భవిష్యత్తు గురించి నీకు భయమెందుకు? వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోకు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అన్న అన్నగారి మాటల్ని అక్షరాల నమ్మింది... ఆచరణలో పెట్టింది. ఏమీ తెలియదనుకున్న— అన్నీ తెలుసుకున్న అన్నపూర్ణ.

ఆసరాయిచ్చిన చేతినే కాల్చివేసింది ఆమె. అభిమానించిన వ్యక్తినే అవమానించింది. ఆమె. చోటిచ్చిన సహృదయనే వెడల నడిపింది ఆమె!

నా తల్లి గుండెలు బ్రద్దలు కావూ? తను నమ్మినవాళ్ళే మోసం చేసినప్పుడు ఆమె లలిత హృదయం తూట్లుపడి చలించి పోదూ ?

అవును! అమ్మ పిచ్చిదయిపోయింది. తాను బ్రతికుండీ నన్ను అనాధుడిని చేసింది. శంభుతాత తప్ప నా ఆలనా పాలనా చూసేవాళ్ళు లేకపోయారు. ఎంత మందివున్నా మాతృస్థానాన్ని ఎవరు భర్తీ చేయగలరు ?

తాతకి ఎన్నో పనులుండేవి? అయినా, తానే నాకు నీళ్ళుపోసి బట్టలు తొడిగి బువ్వపెట్టి ఆటలాడించేవాడు. కొన్నేళ్ళు నాకు తాతే సర్వస్వమయ్యాడు.

అన్నయ్యకు తలదువ్వే రజని నన్ను

దైవం-జీవం

శ్రావణ కుంకుమ
కన్నియ మనసు నీకోసం,
శ్రావణ పౌర్ణమి
రేరా వెన్నెల నాకోసం!
సంద్రములోని చంద్ర బింబము
మురిపెము గొలిపే ముత్యపుమేడ,
వయ్యారంగా వంపులు తిరిగి
అలలే మాలలుగా
చంద్రుడు నీవైతే, నేనే
జాజుల మాలనులే!
నింగిలో నీవున్నా, నేనే
కలువను మరవవు లే!

పాటలలోని భావములన్నీ
రాగము బంధువులే,
రాగములోని నాదములన్నీ
హృదయపు బాసలు లే!
హృదయము నీవైతే, ఓహో
హారమె నాజీవం!
జీవుడు నేనయితే, ఆహా
నీవే నా దైవం!

—ఆకొండ గౌరీదేవి

దగ్గరకు చేరనిచ్చేది కాదు. నేను దగ్గరకి వెళ్ళబోతే కసురుకునేది. నేనంటే ఎందుకు అసహ్యించుకునేదో నా కిప్పటికీ అర్థంకాదు. అయినా, కసిరితే ఏడ్వటం తప్ప మనోభావాల కనుగుణంగా నడుచుకునే వయస్సు కాదు నాది. అందువల్ల తాత బుజ్జగింపులో అన్నీ మర్చిపోయేవాడిని.

అందరికీ అమ్మ ఉంటుందని ...నాకూ అమ్మ ఉందని తెల్సుకునే వయస్సు వచ్చే వరకీ...అమ్మ అనే వ్యక్తి పిచ్చిది ఎందుకు కావాలో తెలిసింది కాదు. బాల్య చాపల్యంతో అమ్మ గదిదాకా వెళ్ళి ఆమె చూసే వెర్రి చూపులకు భయపడి వెనక్కు వచ్చేసే వాడిని. దానితో నాకు అమ్మ కావాలన్న కోరిక ఆదిలోనే అణగిపోయింది. అలా నీలాకాశం లోకి చూస్తూ ఎన్నో గంటలు గడిపేవాడిని.

అందరి మీదా కర్రపెత్తనం చేసే అన్నపూర్ణను చూస్తే నాకు మరింత భయంగా ఉండేది.

'అందరికీ నాన్నలు ఉంటారు. అందరి నాన్నలు తమ పిల్లల్ని వొళ్ళోకి తీసుకొని బుజ్జగిస్తారు' అని తెల్సుకోలేని నేను నాన్నంటే ఒక ఆజానుబాహుడైన వ్యక్తి... ఇంట్లో అందరిపైన కేకలువేస్తూ... తిరిగే వ్యక్తిగా మాత్రమే నాకు పరిచయమయ్యాడు. నన్ను భయపెట్టే వ్యక్తులు, అసహ్యించుకునేవాళ్ళు నా చుట్టూ తిరుగుతున్నా శంభుతాత చేతుల్లో నా భయాలన్నీ మరచి హాయిగా నిద్రపోయేవాడిని.

తాత తోడిదే లోకమైపోయింది నాకు. తనకు తెలిసిన మాటలన్నీ మొదట నేర్పినవాడు అతడే! ఎన్నోపాటలు నేర్పేవాడు, మరెన్నోకథలు చెప్పేవాడు. నేను తాత, బంతిఆట ఆడుకునేవాళ్ళం. అతడు తోటపని చేస్తుంటే నేనుకూడ ఉడతాభక్తితో కలుపుతీసేవాడిని. దానికెంతో మురిసిపోయేవాడు. ఏమిటేమిటో సూక్తులు చెప్పేవాడు. అన్నీ అర్థమయినట్లు తల వూపేవాడిని. అతడే నాకు మొదటి గురువు. ఎంతటి విషాదంలో నయినా చిరునవ్వులతో బ్రతకటం నేర్పినవాడు శంభుతాతే! అంతకుమించిన అభిమాని, శ్రేయోభిలాషి నాకెవ్వరూ లేరు.

శంభుతాత ఆరోగ్యం మంచిదికాదు. తన కాయశక్తులా ప్రతిపని చేసేవాడే కాని ఎప్పుడూ దగ్గుతో బాధపడేవాడు. తరచు జ్వరం వచ్చేది. అతడు లేవలేనప్పుడు నా అవసరాలు తీర్చేవాళ్ళు లేకపోయేవారు. వంటవాడికికూడా నేనంత చులకనైపోయా నన్నమాట! మళ్ళీ తాత కులాసాగాలేచి తిరిగితేకాని నాకు నీళ్ళుపోసి వేళకు అన్నం పెట్టే గతి లేకపోయేది.

నాకప్పుడు నాలగేళ్ళు. అప్పటి ఒక సంఘటన ఈనాటికీ గుర్తుంది. తాతకు జ్వరంవచ్చి ఒళ్ళు తెలియకుండ పడి వున్నాడు. నేను దొడ్లో ఆడిఆడి ఆకలితో వంటయింటివైపు వెళ్ళాను. అప్పుడే రజని అన్నంతిని చేయి కడుక్కొని వెళ్ళిపోయింది. నేను నాయరుని అన్నం పెట్టమన్నాను. అతడేదో కసురుకొని దొడ్లోకి వెళిపోయాడు. నేను బిక్కముఖం వేసుకొని చూస్తూండి పోయాను. ఎంతసేపటికీ అతడు రాలేదు.

రాగధార 4

నాకు ఆకలితో కడుపు మండిపోతోంది. మరి ఏ ఆశతో వెళ్ళానో అన్నపూర్ణతో చెబుదామని అటు గది వైపు వెళ్ళాను. తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. నెమ్మదిగా తలుపులు తోసుకొని లోపలికి వెళ్ళాను.


ఆ దృశ్యం ఇప్పటికీ గుర్తు! నాన్నగారు...ఆయన కౌగిట్లో అన్నపూర్ణ! అలా ఎందుకు ఉన్నారో తెలియని వయసు. నన్ను చూసి ఆమె ఉలిక్కిపడి లేవటం నాకు తెలుసు. తర్వాత ఏదో తిడుతూ నన్ను చితక బాదింది ఆమె. నా తండ్రి ఆమెను వారించలేదు. వారి రసవత్తర ఘట్టంలో పుడకలా ప్రవేశించిన నేను ఎంతో అపరాధిని నాకానాడు ఏం తెలుసు?

ఆ దెబ్బలతో దడుసుకొని జ్వరం తెచ్చుకున్నాను. చచ్చిపోవాల్సిన వాడిని, జాతక చక్రం వేరుగా వుండి బతికాను.

నేను స్వస్థత చెందేసరికి నన్ను సంరక్షించటాని కొక స్త్రీ ఏర్పాటయింది. ఆమె ఆంట్ అనీ, నా మీద ప్రేమ చేత కాకపోయినా తన స్వేచ్ఛా విహారానికి అడ్డు రాకుండా ఉండేటందుకు నా కొక 'దాది'ని ఏర్పాటు చేసింది అన్నపూర్ణ.

అక్కడినుంచి నేను ఆంట్ అనీ చేతుల్లో పెరిగాను. ఆమెవల్లనే మాతృప్రేమ ఎలా ఉంటుందో చవి చూశాను. అదే జరక్కపోతే ఆ పసి హృదయంలో మానవాళిపై అసహ్యం కరడుగట్టి రాక్షసుడిగా మారి వుండేవాడిని.

శంభుతాత తర్వాత నన్ను కన్నబిడ్డలా ప్రేమతో చూసుకున్న వ్యక్తి ఆంట్ అనీ. ఆమె పొత్తిళ్ళలో అనురాగాన్ని చవిచూసి విజ్ఞాన వివేకాలను సంపాదించుకొని



ఇదిగో. నాకు టికెట్ దొరుకుతుందో లేదో చెప్పు!

బాల్యాన్ని అతి మధురంగా గడిపాను:

నాకు పదేళ్ల వయస్సు వచ్చేవరకు ఇంట్లోనే అన్నీ చెప్పింది ఆంటీ అనీ. ఆమెకు రాని విద్య లేదేమోననిపించేది. రంగులతో చిత్రాలు వేయటం, లేండ్ స్కేప్స్ యథాతథంగా చిత్రించటం ఆమె దగ్గరే అంత చిన్నతనంలో నేర్చుకున్నాను. ఆమె చక్కగా సానెట్సు చదువుతుంటే చెవులు రిక్కించుకొని వినేవాడిని. ఆమెకు తెలుగుభాషతో కూడ మంచి పరిచయముంది. బైబిలు కథలు ఎంత చక్కగా చెప్పగలదో భారత రామాయణాలు అంత వివరంగా చెప్పగలదు.

పొయిట్రీ, గణితం, గ్రమర్, హిస్టరీ వివరంగా నేర్పింది. అంత చిన్న వయస్సులో షేక్స్‌పియర్ డ్రామాలు, మిల్టన్ పొయిట్రీ నాకు సుపరిచితాలయ్యాయంటే అదంతా ఆమె చలవేనని చెప్పాలి. తెలుగు పద్యాలకు అర్థాలు చెప్పటం ఆమెకు కొంచెం కష్టమయ్యేది. నా ప్రశ్నలకు తట్టుకోలేక ఆమె ఆ పద్యాలనర్థం చేసుకోటానికి రోజల్లా గంటసేపు కష్టపడేది. వేమన పద్యాలంటే మరింత ఆసక్తిగా వుండేది నాకు.

ఒక విధంగా చెప్పాలంటే నా జ్ఞాన తృష్ణ ఆమెకు అవిధిని పెట్టింది. శ్రమ పెట్టి నిద్రాహారాలు లేకుండా చేసింది. క్రమంగా ఆమె ఆరోగ్యం క్షీణించింది.

ఒక పిచ్చితల్లికి పుట్టి అందరూ ఉండి అనాథుడిగా బ్రతుకుతున్న నన్ను చూసి ఆ ప్రేమమూర్తి నాకు దేవుడు చేసిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకుంది. కాని, అదే ఆమె ఆరోగ్యాన్ని నాశనం చేసింది. ఇదేమీ తెలియని నేను ఆమె రాగధారలలో పునీతుడనై పెరిగాను.

ఒకసారి ఆమెను అడిగినట్లు గుర్తు. '...ఆంటీ నువ్వెప్పుడూ ఎక్కడికీ వెళ్లవు? నిన్ను చూడ్డానికి ఎవరూ రారు? నీకెవ్వరూ లేరా?...'

ఆమె సజల నేత్రాలతో చిరునవ్వు తెచ్చుకొని, 'నాకు నీకంటె ఎవ్వరూ లేరు బాబూ! నువ్వుండగా ఇంకెవరు కావాలి నాకు?' అని అంది.

అటువంటి త్యాగమూర్తికి నేనేమీ చేయలేకపోయాను. నేను దురదృష్టవంతుడిని. ఆమె గురించి ఏ వివరాలు తెల్సుకోలేక పోయాను. ఆమెకు ఆరోగ్యం చేకూర్చే పనేమీ చేయలేక పోయాను. ఎక్కడి నుండి వచ్చిందో నాకు తెలియదు. నాకు తెలియని వ్యక్తి మాతృప్రేమను నాకు చవిచూపింది. నా బ్రతుక్కి అర్థం చూపించింది:

అటువంటి నా పెంపుడు తల్లి ఒక నాడు హఠాత్తుగా మరణించింది. నన్ను మళ్ళీ అనాథుడిని చేసి వెళ్ళిపోయింది.

తిరిగి రోగగ్రస్తుడయిన శంభుతాత, నేను మిగిలాము.

* * *

అంతవరకు చెప్పి అతని కంఠం గాద్గదికమవటంతో కొంతసేపు మౌనం వహించాడు.

బరువెక్కిన మనస్సుతో అతని హృదయావేదనని అర్థం చేసుకుంటూ అతని కరతలాన్ని నిమిరుతూ ఉండిపోయా నేను.

*

ఆంటీ అనే స్మృతులతో విషాదంగా గడుపుతున్న నేను దేనిమీద ధ్యాసలేక

పళ్లు - గుణాలు

జీడి పండు

జీడిమామిడి పళ్ళు— నల్లజీడి పళ్ళు అని జీడిపళ్ళు రెండు రకాలు.

జీడిమామిడి పండుని మొక్కజీడి పండని కూడా అంటారు. వగురుగా తియ్యగా ఉంటుంది. ఇది వేడి చేస్తుంది. క్రిమి రోగం, వాతం, మేహవాత నొప్పులు, ఓడ వాళ్ళకు వచ్చే స్కర్వీ అనే రోగం, కుష్ఠు రోగం, ఉబ్బురోగం గలవారికిది మేలు చేస్తుంది. అగ్నిదీప్తిని, దేహపుష్టిని ఇస్తుంది.

పచ్చిది తింటే గొంతుక దురద, దగ్గు కలుగుతుంది ఈ పండు యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు :—1. బాదంపప్పు, 2. వేడి నీళ్ళు, 3. వేపగింజలు.

నల్లజీడిపండు వేడి చేస్తుంది. జ్ఞాపకశక్తి నధికం చేస్తుంది. దేహపుష్టినిస్తుంది. వీర్యాన్ని అధికం చేస్తుంది. కఫవాతాలను దగ్గును అణచి వేస్తుంది.

మేహరోగాన్ని అధికం చేస్తుంది. బాగా వేడి చేస్తుంది. ఈ పండు యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు :—1. మోదుగచెక్క రసం 2. పంచదార కలిపిన ఆవుపాలు.

పనస పండు

పనస పళ్లలో కొన్ని రకాలున్నాయి. పనస తొనలు తియ్యగా సువాసనకలిగి రుచిగా ఉంటాయి. రక్తాన్ని, ఇంద్రియాన్ని వృద్ధి పొందిస్తాయి. పైత్యాన్ని అణచివేస్తాయి. శరీరానికి బలాన్నిస్తాయి. మెదడుకి, నరాలకు సత్తువనిస్తాయి.

అజీర్ణం, అండవృద్ధిరోగం, అగ్నిమాంద్యం. కడుపునొప్పి, శీతపైత్యం, దాహం వీనిని పుట్టిస్తాయి.

పనసతొనల యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:— 1. నూనె, 2. అరటిపళ్ళు.

వెలగ పండు

బాగా పండిన వెలగపండు త్రిదోషహరమైనది. కఫం, పైత్యం, ఊపిరిగొట్టు నొప్పి, గ్రహణి, చర్ది, ఎక్కిళ్ళు, శూల, అగ్నిమాంద్యం, మూలవ్యాధి, శ్వాస, దగ్గు, అరుచి, అలసట వలన కలిగిన నీరసం, వమనం, దాహం వీనిని అణస్తుంది. మిక్కిలి మేహశాంతి, పైత్యశాంతి చేస్తుంది. ఇది ఎంతో పథ్యమయినది.

దీనిలోని విత్తులను తీసివేసి పంచదారతో కలిపి పుచ్చుకోడం శ్రేష్టం. దీని విత్తనాలు సులభంగా జీర్ణంకావు. వెలగపళ్లలోని విత్తనాలను తీసి ఎండబెట్టి— చూర్ణంచేసి— పంచదారకలిపి పుచ్చుకుంటే వీర్యవృద్ధి చేకూరుతుంది.

వెలగకాయ రసాన్ని పుక్కిలించినట్లయిని పళ్ళకుబలం చేకూరుతుంది. నోటిపూత తగ్గుతుంది.

వెలగచెట్టు యొక్క వేరుతో గంధాన్నితీసి కనురెప్పల పైనా, కణతల పైనా, నొసటి పైనా పూస్తే— బాగా నిద్రపడుతుంది.

వెలగపళ్ళు అధికంగా తింటే గుండెకు, గొంతుకకు నష్టం వాటిల్లుతుంది. పచ్చి వెలక్కాయలు అధికంగాతింటే కడుపు బిగపడుతుంది. కంఠం బొంగురు పోతుంది. కడుపులో క్రిములు పుడతాయి. మలబద్ధం చేస్తుంది.

వెలగపండు, కాయల యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:— 1. పంచదార, 2. వేపగింజలు, 3. తేనె, 4. పెద్దసోపు.

సేకరణ: ఆకుండి నారాయణమూర్తి

'ప్రశ్నావళి' శీర్షిక ప్రశ్నలను పంపేవారు కవరుమీద స్పష్టంగా 'ప్రశ్నావళి,' ఆంధ్ర సచిత్ర వార పత్రిక, మద్రాసు — 1.' అని వ్రాయకోరుతున్నాము.— సం॥

రాగధార

ఒంటరిగా శూన్యంలోకి చూస్తూ గడిపే వాడిని. తాత ఎంత బుజ్జగించినా మనస్సును సమాధాన పరచుకోలేకపోయాను.

కొన్ని రోజులు నాగదిలోంచి బయటకి రాలేదు. అయినా తాత తప్ప నా విషయం పట్టించుకున్నవాళ్లు లేకపోయారు. అతన్ని నొప్పించలేక నాలుగు మెతుకులు తినే వాడిని.

అప్పుడప్పుడు అన్నయ్య, రజని తమ స్నేహితులను తీసుకువచ్చి ఏవో పార్టీలు చేస్తూ హడావిడి చేసేవారు; ఎప్పుడూ వాళ్ళు నన్ను పిలవలేదు. నేను అటు వెళ్ల లేదు.

తరచు డాక్టరు వచ్చి అమ్మను పరీక్షించటం నాకు తెలుసు. కాని, ఆమె ఎప్పుడూ నన్ను గుర్తుపట్టలేదు. అందుకనే, ఆంటీ అనే ప్రేమతో నా తల్లినే మరిచి పోయాను నేను.

ఒకనాడు అర్ధరాత్రివేళ అమ్మ గదిలోంచి పెద్దగా ఏడుపు వినిపించింది. ఎందుకో నాకు ఆమెను చూడాలనిపించింది. బయట హాల్లోకి వచ్చాను. ఎవ్వరి అలికిడి లేదు

అమ్మ గదిదగ్గరకువెళ్లాను. గది బయట గడియ పెట్టివుంది. తలుపు సందులోంచి చూసాను. అమ్మజుట్టు చిక్కులుపడి ఆమె ముఖాన్ని వికృత పరుస్తోంది. ఆమె ఒంటి నిండా చిరుగుల గుడ్డలున్నాయి. ఎక్కడో పైనపెట్టిన దీపం వెలుతురులో ఆమె కన్నీటిధారలు భయపెట్టాయి.

నా ఉద్వేగాన్ని అణచుకోలేక గబుక్కున తలుపుగడియ తీసాను. ఆ చప్పుడుకి తలెత్తింది అమ్మ. నేను గుమ్మంలో నిలబడి ఆమెవైపు తదేకంగా చూసాను.

'ఎవరు?' ఆమె గొంతు మొదటిసారి విన్నట్లయింది నాకు. అంతవరకు అమ్మ అనే వ్యక్తి ఉందని — ఆమె పిచ్చిదని — ఎవ్వరినీ చూడదని—మాట్లాడదని మాత్రం నాకు తెలుసు. కానీ, ఇప్పుడు అమ్మ ప్రశ్నించింది.

చకితుడినై, 'నేను మధూని అమ్మా!' అన్నాను.

'మధూవా?...ఎందుకొచ్చావు?'

అమ్మ ఇలా మాట్లాడుతుందని ఊహించని నేను తెలియని భయంతో కంపించాను.

'నిన్ను చూద్దామని వచ్చాను.'

'ఇలా దగ్గరకు రాబాబూ!'

అమ్మ చేతులు చాచింది. అనాలోచితంగా నేను ఆమెవైపు నడిచాను. ఇంతలో వెనక్కు ఎవరో, 'వెళకు. నిన్ను పీక పిసికి చంపుతుంది...' అని అరవటం వినిపించింది. వెనక్కి తిరిగాను. గుమ్మంలో అన్నపూర్ణ!

'నిన్నేం చేయను బాబూ!...నా దగ్గరకి రా?...' అంటూ అమ్మ బతిమాలటం—'...చస్తావురా వెధవా! బయటకు తగలడు. మీతో వేగలేక చస్తున్నాను...' ఇటు అన్నపూర్ణ అరవటం నన్ను బేజారెత్తించాయి.

'...నా బాబూ....రావూ!...' అంటూ అమ్మ పైకిలేచి నావైపు రాబోయింది. ఒక్క అంగలో నన్ను చేరుకొని, 'రా వెధవా!' అంటూ నన్ను బయటకు లాక్కుపోయింది అన్నపూర్ణ. గుమ్మం దగ్గరకి వస్తున్న అమ్మను లోపలికొక్క త్రోపు త్రోసి బయట గడియ పెట్టింది ఆమె.

'అమ్మా!' అని నేను అరిచాను.

'ఏం ఇన్నాళ్లు అక్కర్లేక పోయిన అమ్మ ఇప్పుడు కావల్సి వచ్చిందా? పోయి పడుకోరా వెధవా! దానిచేతుల్లో పడితే

లస్సీ

నిమ్మకాయ	— ఒకముక్క ($\frac{1}{2}$)
మజ్జిగ	— ఒకగ్లాసు
పల్చనిగంజి	— ఒకగ్లాసు
ఐస్‌ముక్క	— చిన్నది.
పచ్చిమిరప,అల్లం ముక్కలు	— కొన్ని.
ఉప్పు	— తగినంత.

తయారు చేయువిధానం:—

గ్లాసెడు పల్చనిగంజిలో గ్లాసు మజ్జిగ కలపాలి. బాగా కలిపింతర్వాత నిమ్మరసం పిండాలి. తగినంత ఉప్పు వేసెయ్యాలి. పచ్చిమిరప, అల్లంముక్కలను వేసి చిన్న 'ఐస్' ముక్క వేసుకుని త్రాగితే ఈ వేసవికాలంలో చల్లగా, ఆహ్లాదకరంగా, రుచిగా కూడా ఉంటుంది. ఈ పానీయాన్ని ఏరోజుకారోజు తయారు చేసుకోవాలి. ఎక్కువశ్రమ లేకుండా ఖర్చుపడకుండా త్వరగా చేసుకోగలిగి అందరికీ అందుబాటులో ఉండగలిగిన పానీయం లస్సీ ఒక్కటే.

—మూర్తిశ్రీ జయసౌజన్య

ఏక పిసిగి చంపుతుంది...అది చస్తేకాని ఈ ఇంటికి శని విరగడవదు...' అంటూ పెద్దగా అరుస్తూ నా గదిలోకి నన్ను త్రోసి వెళ్ళిపోయింది అన్నపూర్ణ.

నాకు దుఃఖం ఆగలేదు. ప్రక్కమీద పడుకొని వెక్కివెక్కి ఏడ్చాను, ఎప్పుడు వచ్చాడో శంభుతాత నా భుజంపై చేయి వేసి ఓదార్పుగా జోకొట్టాడు. కాని, తన గదిలో తలుపుకేసి తల కొట్టుకుంటూ ఏడుస్తున్న అమ్మ ఏడ్పులు నాకు వినిపిస్తూనే ఉన్నాయి. ఈ ఇంట్లో అంతా రాక్షసులేమో ననిపించి వణికిపోయాను నేను.

నా మనస్సులో ఏర్పడిన నలత నయం కాకుండానే అన్నపూర్ణ కోరిక నెరవేరింది. జన్మనిచ్చిన ఏడేళ్లకు మాతృమూర్తిని చేరబోయి భంగపడిన నేను తిరిగి ఆమెను చూడలేక పోయాను.

ఆ సంఘటన జరిగిన కొద్ది రోజుల్లోనే అమ్మకు పెద్ద జబ్బు చేసింది. లోకం కోసం డాక్టర్లని తెప్పించింది అన్నపూర్ణ. చేయవల్సిన ఆర్భాటం చేసింది. మందుల కయిన లెక్కలు వందలమీద లెక్క చూపించి తన దాతృత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పుకుంది.

ఒకనాడుదయం తాతవచ్చి పక్కమీద నుంచి నన్ను లేపుతూ... 'మహాతల్లికి శాప విముక్తి కల్గింది బాబూ!' అని కంట తడిపెట్టాడు.

అతనిమాట అర్థంకాక, 'ఏమిటి తాతా' అని అడిగాను.

'అమ్మ చచ్చిపోయింది బాబూ!' అని తాత ఏడ్చేసాడు.

నా నెత్తిమీద పిడుగు పడినట్లయింది. ఆ అదిరిపాటు తప్ప నాకు దుఃఖం రాలేదు. ఆరోట్ అనీ తెల్సినంతగా అమ్మ నాకు తెలియదు. అమ్మ పోయిందంటే నాలో ఏదో వెలితి ఏర్పడింది. ఆ బాధ ఎటువంటిదో కొన్నేళ్లకుకాని నాకు తెలిసి రాలేదు. నాకే అవకాశం కలిగి ఉంటే నాతల్లిని బ్రతికించుకునే వాడినేమో!... ఇప్పటికీ ఆ తీరనికోరిక నా మనస్సులో కదలి కలతపెడుతూ వుంటుంది.'

భరించలేని దుఃఖంతో అతనొక క్షణం మాట్లాడలేక పోయాడు.

'బాధపడకండి. మనకీలోటు ఎప్పటికీ తరగనిది. గుండె రాయి చేసుకోవాలి.' స్వయంగా అనుభవించిన నాకు ఆలోటు తెలియనిది కాదు.

(ఇంకా వుంది)

యుగపద నిర్వచనం



బులుసు వెంకటరమణయ్య — ధర్మపథం

సత్ప్రవర్తన కలవు మనిషిని చూచి అందరూ 'ఈయన కృతయుగం నాటి మనిషి' అనిన్నీ, దుర్మార్గుడి దౌర్జన్యాన్ని చూచి 'ఇది కలియుగం' అనిన్నీ అంటూ ఉండడం మనం చూస్తున్నాము.

యుగాలు నాలుగింటిలో కృతయుగంలో సత్యధర్మాలు సంపూర్ణంగా ఉండేవనీ, అప్పుడు ధర్మం నాలుగుపాదాలతో నడిచేదనీ అంటారు. త్రేతాయుగంలో ధర్మం మూడుపాదాలతో మాత్రమే నడిచేదట! ద్వాపరయుగంలో న్యాయం సగం మాత్రం ఉండడం వల్ల ధర్మం రెండుపాదాలతోనే నడిచేదట! కలియుగంలో అన్యాయం మూడువంతులు, న్యాయం ఒకవంతు ఉండడంబట్టి ధర్మం ఒంటికాలిపైనే నిలిచి ఉందనిన్నీ చెప్తారు.

అయితే ధర్మాధర్మాలు కాలంపైని ఆధారపడి ఉన్నాయా? మానవుల ప్రవర్తనపయి ఆధారపడి ఉన్నాయా? అని ఆలోచిస్తే— ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటాయని తెలుసుకోవచ్చు. దుర్మార్గులు కృతయుగంలోనూ ఉన్నారు. మంచివారు కలియుగంలోనూ ఉన్నారు. అంటే కలికాలం కృతయుగంలోనూ ఉండేది. కృతయుగం కలియుగంలోనూ ఉంటుంది. ధర్మాధర్మాల పాళ్ళననుసరించి— అప్పటి సందర్భాన్నిబట్టి పూర్వం యుగవిభాగం జరిగిందేకాని వేరు కాదు. కాలాన్ని బట్టి మంచి చెడ్డలను నిశ్చయించనక్కర్లేదు.

యుగధర్మం పరిపాలించేవారి ప్రవర్తనపైనే ఆధారపడి వుంటుంది. ఈ విషయం మనుధర్మ శాస్త్రంలోనే ఉన్నది.

'కృతం త్రేతాయుగం చైవ
ద్వాపరం కలిరేవ చ,
రాజ్ఞో వృత్తాని సర్వాణి
రాజా హి యుగముచ్యతే.'

కృతయుగం, త్రేతాయుగం; ద్వాపరయుగం, కలియుగం అనేవి పాలించే వారి చేష్టిత విశేషాలే! అందువల్ల పాలకుడే యుగమని చెప్పాలని అభిప్రాయం.

రాజు ధర్మంగా పాలన చేస్తే— ఆ సమయమే కృతయుగం; అధర్మ పరిపాలన ఉంటే—అదే కలియుగం! అందువల్ల ప్రజా పాలకులు న్యాయాన్ని పాటిస్తే ఈ కలియుగమే కృతయుగంగా మారుతుంది.

ఇప్పుడు ప్రజాపరిపాలకులైన మంత్రులు (ప్రజాప్రభుత్వంలో రాజు ఉండడు కాబట్టి) మంచి వాటినైనా ఇష్టం లేకపోతే తోసివేసి కలియుగాన్ని సార్థకం చెయ్యవచ్చు. స్వార్థాపేక్ష లేక ధర్మాన్నీ, న్యాయాన్నీ గమనించి కృతయుగాన్ని సృష్టించవచ్చు.

అయితే ప్రజలందరూ కోరేది కృతయుగమే! పరిపాలన సక్రమంగా జరిగితే— ప్రజలు కలలు కంటున్న రామరాజ్యం ప్రత్యక్షం అవుతుంది. ●

నర-సింహం



పుదిచెర్ల
సాంబశివరావు

నరసింహం ఎంతసేపు బతిమిలాడినా సింహం వినడంలేదు. నాలుగు బాది వీపు బద్దలుగొట్టి చెప్పటమేకాని బతిమాలి నచ్చచెప్పటం నరసింహానికి తెలియనే తెలియదు. కాని ఇప్పుడాపని లాభంలేదు. సింహం జబ్బునపడి మెత్తకిచ్చిపోయింది. అందువలన కోపాన్ని సాధ్యమైనంతవరకూ అదచిపెడుతున్నాడు నరసింహం. బతిమి లాడ్డం మొదలుపెట్టాడు.

'మా బుజ్జినికదూ! ఇంద...కొంచెం... కొంచమంటే కొంచెమే తిని ఎంగిలిపడుదూ' అంటూ గుప్పెడు మాంసం సింహం నోటి దగ్గర పెట్టాడు. ఎంత చెప్పినా ఆ సింహం తాబట్టిన కుందేటికి మూడేకాళ్లంటూంది. కనీసం వాసనకూడా చూడకుండా తల అవతలకు తిప్పుకొంది. మధ్య మధ్య 'గుర్...'అని మాత్రం అంటూంది. అతని కన్నులమీద గుంపుగా వ్రాలిన తెల్లని కను బొమ్మలు మధ్య మధ్య పైకిలేస్తూ కోపాన్ని సూచిస్తున్నాయి.

ఇంకొకప్పుడైతే ఆ సింహాన్ని చీల్చి చెండాడేవాడు. కాని ఇప్పటి పరిస్థితి వేరు.

'ఒరేగ్ రాజా! ఇప్పుడు గనక నువ్విది తినకపోతే నన్ను చంపుకు తిన్నంత ఒట్టు! ఆఁ!' అని సింహం కన్నుల్లోకి దీనంగా చూస్తూ తన ముడతలుబడిన మొఖాన్ని దాని మొఖాని కానించి జుంజురులను నిమురసాగాడు. అది పిల్లిలాగా మూలుగుతూ అక్కడనుండి లేచి నాలుగడుగులు వేసి, ఇంక నడవటానికి శక్తిలేక అక్కడే కూలి పోయింది.

నరసింహం గుండె నీరయింది. కన్నులు చెమర్చాయి. ఇనుప చువ్వలగేటును బిగించి నరసింహం ఇవతలకొచ్చాడు. లోపలనుండి సింహం 'చెయ్యని నేరానికి జైల్లోపడ్డ వానిలాగా చూస్తూంది. దాని కన్నులు నిప్పుకణికల్లా మెరుస్తున్నాయి— దుఃఖించ డానికి కన్నీటి బిందువులుగూడా లభించని అభాగ్యుని కన్నుల్లాగా!

నరసింహం బయటకొచ్చాడు. టయిం చూశాడు. సర్కస్ ప్రారంభం కావటానికి ఇంకా ఎక్కువ సమయం లేదు. బయటకు చూశాడు.

సర్కస్ చూడటానికి జనం ఎగబడ్డారు. లోపలగా ఇటువైపుగా —

జనం! బుకింగ్ దగ్గర!!

జనం ఆనందంగా నవ్వుతూ పేలుతూ—

జనం అటూ ఇటూ—

కోతుల్లాగా, ఎలుగు బంట్లల్లాగా, ఒంటెల్లాగా, ఏనుగుల్లాగా, పులుల్లాగ, సింహాలలాగా—

ఎగబడ్డారు!

నరసింహం లోపల డేరాలవైపు చూశాడు. సర్కస్ మనుషులు సిద్ధమవు తున్నారు. నవ్వించేవాళ్లూ, పైన ఎగిరే వాళ్లూ, దూకేవాళ్లూ...

పులులూ సింహాలతో ఆడుకొని జనాన్ని ఆనందపెట్టే వాళ్లూ వాళ్ల పనుల్లో వాళ్లు!

నరసింహం మేనేజరు జేరా వైపు పోయాడు.

లోపలకు చూశాడు. మేనేజరున్నాడు.

'సార్! రాజుకి ఒంట్లో ఏం బాగా లేదు!' దేరాదగ్గరకుపోయి నరసింహం గొణిగాడు.

'హలో మిష్టర్ నరసింహం! రారా! ఇలాకూర్చో! ఆఁ! ఏమిటి!' అంటూ మేనేజర్ ఆహ్వానించాడు.

నరసింహం రెండడుగులు ముందుకు వేశాడు. కూర్చోలేదు.

ఎక్కడో పల్లెటూళ్లో దిక్కూ దివాణమూ లేక బఱ్ఱెగొడ్లు గాచుకుంటూ బతికే తనను తెచ్చి ఇంతవానిని జేసిన ఆ మేనేజరుగారంటే నరసింహానికి భయమూ భక్తీ ఉన్నాయి.

అందుకని వినయంగా నించొనే అన్నాడు.

'మన పెద్దసింహం రాజుగానికి యేం బాగువ లేదు; నీరసంగా ఉందిసార్'

'ఔను! మొన్న కలకత్తాలో మనం ప్రదర్శన పెట్టినపుడే హుషారుగా చెయ్యలేదు.'

'అప్పుడే కొంచెం జ్వరాలు వచ్చిందండీ! మళ్లీ వెంటనే ప్రయాణాలవల్ల బాగా దెబ్బతిన్నది. అసలే ముసలితనంగదా...' నెరసిన తన తలవెంట్రుకలను చేత్తో వెనక్కుదువ్వుకొంటూ నరసింహం సింహం స్థితి వివరించడానికి ప్రయత్నిస్తున్నాడు.

'ముసలితనమైతే మాత్రం పనిచెయ్యక తప్పుతుందటోయ్!'

'కానీ...అది యివ్వాళ మరీ యిదిగా ఉందండి. నాలుగడుగులైనా వెయ్యలేకుండా ఉంది!'

'ఈ ఊళ్లో ఇదే మొదటి ప్రదర్శన గదా! అందులో మనరాజు జేసే వింత వింత ఫీట్లనుగురించి ఎంతో గొప్పగా ప్రకటనలు చేస్తిమాయెను. ఇప్పుడది లేకపోతే మన సర్కస్ కంపెనీ పరువేమైనా ఉంటుందా!'

'క్షమించండి సార్! ఏమైనాసరే! ఇవాళ నేను రాజుచేత ఏమీ చేయించలేను.'

'నరసింహం!' పెద్దగా గర్జించాడు మేనేజరు. నరసింహం మేనేజరు మొఖం వైపు చూశాడు. మేనేజరు కన్నుల్లో సింహాలు కనపడ్డాయి గర్జిస్తూ. నరసింహం ఉలికిపడలేదు. పెద్ద పెద్ద సింహాలనే కుక్కల్లాగా జేసినవాడు నరసింహం మరి!

'మీరు నాకు చేసిన సాయానికి నేనెప్పుడూ కృతజ్ఞుణ్ణేసార్! నా జీవితమంతా మీ సర్కస్ కంపెనీకే అంకితం చేశాను. ఆ సంగతి మీకు బాగా తెలును. ప్రపంచంలో మరే సర్కస్‌వాళ్ళూ చేయించలేని విధంగా నేను సింహాలచేత ఎన్నో ఫీట్లు చేయించాను. సింహాలలో ఒక సింహంగా మెలిగాను. వాటిసంగతి నాకు బాగా తెలుసు. నా సంగతి మీకు బాగా తెలుసు...'

'మిష్టర్ నరసింహం! ఇదిగో ఇవి చూడు!' ఆరోజు వచ్చిన కొన్ని వార్తాపత్రికలను నరసింహం ముందు పెట్టాడు మేనేజరు. వాటినిండా ఆ సర్కస్ కంపెనీ ప్రకటనలు ఉన్నాయి. నరసింహం చూస్తున్నాడు.

'ప్రపంచంలో మొట్టమొదటి సారిగా అద్భుత ప్రదర్శన. సింహంనోట్లో నరసింహం అనే ధైర్యశాలి శవ తలను పెట్టడం!'

'మంచి తరుణము మించిపోవును! మరే సర్కస్‌లోనూ లేని వింతవింత ఫీట్లు. ప్రపంచ ప్రఖ్యాతమైన నరసింహం గారిచే సింహము లాడింపబడును.'

'మీరెప్పుడూ కనీవినీ యెరుగనట్టిది! సింహంనోట్లో మనిషి తలదూర్చడం!'

నరసింహం ఒక్కొక్క పత్రికనే చూసి అవతల పెడుతున్నాడు.

'చూశావా నరసింహం! నీమీద మన సర్కస్ కంపెనీ పెట్టుకున్న ఆశలు చూశావా! నీ ఒక్కనికి బతుకుతెరువు చూపినందుకు నన్ను పొగుడుతున్నావు, బాగుంది. కానీ నీమీద ఆధారపడి బతుకున్న మన సర్కస్ కంపెనీలో పనిచేసే వందలమంది సర్కస్ కళాకారులంతా...'

'సార్! అలాగే కానివ్వండి! అలాగే కానివ్వండీ!' నరసింహం విసురుగా వెళిపోయాడు.

మేనేజరు నరసింహం పోయినవైపే కన్నార్పకుండా కాసేపు చూచి పిస్టల్ అందుకున్నాడు.

సర్కస్ బెల్లు కొట్టారు.

సర్కస్ ప్రారంభమయింది.

నవ్వించేవాళ్లు వచ్చారు. జనం నవ్వారు. ఆడవాళ్ళు వచ్చారు. పైకి కాళ్లు తొక్కుతూ. జనం ఆశగా చూశారు.

ఒక్కొక్కటే జరిగిపోతూ ఉంది.

నరసింహం డ్రెస్ చేసుకుంటున్నాడు. ఎకువచ్చనిరంగుతో కన్నులు మిరుమిట్లు గొల్పుతున్న కోటు తొడుక్కున్నాడు. మేనేజర్ ఆ కోటును నరసింహంకోసం రష్యానుండి తెచ్చాడు. అది తొడుక్కుంటున్నప్పుడల్లా మేనేజరు కన్నుల్లో మెదులుతాడు,

నరసింహం కొరడా అందుకొన్నాడు.

తనకు కాలం సమీపించింది.

సింహం దగ్గరకు పోయాడు. తలుపు తెరిచాడు. సింహం మూలుగుతూ పడి ఉంది. పసిపిల్ల నాలిలాగా చూస్తూంది.

అది మూడునెలల పిల్లగా ఉన్నప్పటి నుండీ నరసింహం దగ్గరే పెరిగింది. సీసాలో పాలుపోసి పీక దానినోట్లో పెట్టి తానే దానికి తల్లి అయినట్టు పెంచాడు. వింత ప్రేమ ఉన్నా అప్పుడప్పుడూ కొరడా దెబ్బలు రుచి చూపిస్తూ తండ్రిప్రేమ ఎలా ఉంటుందో గూడా దానికి తెలిసి వచ్చేటట్టుగా చేశాడు.

'ఇప్పుడు మీరెంతో ఆసక్తితో ఎప్పుడా ఎప్పుడా అని ఎదురు చూస్తున్న అద్భుత ప్రదర్శన. మిష్టర్ నరసింహం...ప్రపంచంలో మరే సర్కస్‌వాళ్లూ చెయ్యలేని అద్భుతం...మిష్టర్ నరసింహం...సింహాలకి సింహం...మిష్టర్ నరసింహం...' అనౌన్సరు చెపుతున్నాడు.

నరసింహం సింహాన్ని ఎత్తుకున్నాడు. మెడపైన వేసుకొని గోదా దగ్గరకొస్తున్నాడు జనమంతా ఆనందంతో కరతాళ ధ్వనులు చేస్తున్నారు.

మేనేజరు ఆ ప్రక్కనే నుంచున్నాడు. గుండ్రంగా ఒకదాని ప్రక్కన ఒకటి పెట్టి ఉన్న ఇనుప చువ్వలమధ్య నరసింహం ఉన్నాడు సింహంతో.

ఎప్పుడూ సింహంమీద ఎక్కి అక్కడకు వచ్చేవాడు నరసింహం. కానీ ఈసారి తానే సింహం పాత్రని ఎందుకు వహించాడో మేనేజరు ఒక్కడే ఊహించ గలిగాడు.

నరసింహం సింహాన్ని కిందపెట్టాడు.

సింహం నిశ్చ ప్రయత్నం చేస్తూంది హుషారుగా ఉండటానికి.

నర - సింహం

మొదటిపేటు మంటలతో మండుతున్న రింగులోంచి సింహం అవతలకు ధుమకటం. నరసింహం సింహానికి సంజ్ఞలు చేస్తున్నాడు. సింహం ఊరక చూస్తూ మూలుగుతూ ఉంది.

జనం చూస్తూ ఉన్నారు.

నరసింహం సంజ్ఞలు చేస్తూ ఉన్నాడు.

మేనేజర్ భయపడుతున్నాడు

జనం కన్నార్పటంలేదు.

సింహం లేవలేక పోతూ ఉంది.

జనం చప్పట్లు గొట్టారు...

వికటాళిగా!

ఈలలు వేశారు—

హేళనగా!

నవ్వుతున్నారు—

అవమానకరంగా!

నరసింహం సింహం కళ్ళల్లోకి చూశాడు. మేనేజరు మొఖంలోకి చూశాడు. జనాన్ని చూశాడు. జనం కళ్ళల్లో... మొఖాల్లో...

నరసింహం పిడికిలి బిగుసుకుంది. చేయి లేచింది.

'ఛెళ్'—

మన్నది కొరడా!

జనమంతా ఉలిక్కిపడ్డారు—

పిడుగులు పడినంత పెద్దగా అరిచింది సింహం.

లేచి నుంచుంది.

కదల్లేక మళ్ళీ కూలబడింది,

జనం ఒకటేనవ్వు! 'ముసల్ది... ముసలోడు...' అరుపులు.

'ఛెళ్ళు... ఛెళ్ళు... ఛెళ్ళు...' నరసింహం బాదుతున్నాడు. సింహం మెలికలు తిరిగిపోతూంది. ఎగిరెగిరి పడుతూంది.

జనం ఆనందంగా చూస్తున్నారు,

ఉన్నట్టుండి సింహం రింగులోంచి అవతలకు దూకింది

జనం ఆనందంగా చప్పట్లుగొట్టారు.

నరసింహం కన్నీరు తుడుచుకొన్నాడు,

మేనేజర్ మూతిమీద చిరునవ్వు మెరిసింది.

'మిష్టర్ నరసింహం! ఇంద ఇది తీసికో ఎందుకైనా మంచిది... అది పగబట్టి ఉండొచ్చు!' మేనేజర్ పిస్టల్ అందించాడు. నరసింహం దాన్ని జేబులో వేసుకున్నాడు.

ఇప్పుడు అసలైనది...

సింహంనోట్లో నరసింహంతల పెట్టాలి!

నరసింహం సింహంవైపు చూశాడు.

అది ఆటే చూస్తూంది పచ్చని కళ్ళుల్తో.

నరసింహం చిటికేశాడు. సింహం నోరు తెరచింది. జనమంతా నోరు తెరచారు ఊపిరి బిగబట్టి!

నరసింహం సింహం నోట్లో తల పెట్టాడు...

జనమంతా కొన్ని క్షణాలలా నిర్విణ్ణులై తేరుకొని డేరా లెగిరేటట్టు హర్షధ్వానాలు చేశారు.

నరసింహం తల బయటకు తీశాడు. నరసింహం మొండెమూ తలా కలసే ఉండటం చూసి మేనేజరు అక్కడనుండి వెళ్ళిపోయాడు తృప్తిగా!

సింహం నేలకూలింది. విగళ్వాసప్రారంభమయింది. అంతా నరసింహంవైపే చూస్తున్నారు సింహాన్ని ఎవరూ చూడటం లేదు. నరసింహం సింహాన్ని ఎత్తికొని కరతాళధ్వనులమధ్య లోపలకు పోయాడు.

సర్కస్ అయిపోయింది. ఎటువాళ్ళు అటుపోయారు.

మర్నాడు...

నరసింహం కనబడలేదు.

పిష్టలూ... పిష్టలు కాల్పులవలన మరణించిన సింహమూ ఇనపచువ్వలమధ్య ఉన్నాయి.

నరసింహం ఇప్పుడు వాళ్ళ ఊళ్ళోనే బ్రాగోడ్లు కాచుకొని బతుకుతున్నాడని వినికిడి. ●

ఇంటిలోని పోరం...

క్రిష్ణగిరిలో 40 ఏళ్ళ భైరమ్మాళ్ అనే ఆమె కుటుంబ కలహాలను భరించలేక, వాటికి తట్టుకోలేక, ఇల్లు విడచి వూరవతలకు వెళ్ళి దారిన వున్న ఓ చెట్టుకు వురి పోసుకుని, నిశ్చింతగా, ప్రాణాలు తీసుకుందట—

సినిమా ఛాన్సు దొరకక విరక్తితో ఆత్మహత్య చేసుకున్న యువకుడు

తిరుప్పూరు తాలూకా వెంకటేశపురానికి చెందిన 24 ఏళ్ళ వెంకటాచలం అనే యువకుడు సినిమాలో నటించాలని శతవిధాల ప్రయత్నించి, కుదరక, మనస్సు విరిగిపోయి, కత్తితో పొడుచుకుని, తన జీవితం చాలించాడట.



కుటుంబనియంత్రణ ప్రచారంలో 'మినీ' చీరలు !

కుటుంబ నియంత్రణ కోసం అధికారులు అనేకరకం కొత్త మార్గాలు తొక్కుతున్నారట. మైసూరు రాష్ట్రానికి చెందిన బాగేపల్లి అనే వూరిలో యీ కుటుంబ నియంత్రణ ఆపరేషను చేయించుకున్న ప్రతి ఆడవారికి పదిహేను రూపాయలతో ఓ చీర కూడా పారితోషికంగా యివ్వ నారంభించారట. ఆ క్యాంపులో వున్న డాక్టరు వద్ద యీ ఫక్కీలో ఆపరేషను చేయించుకున్న ఆడవారు తిరిగి ఆమె వద్దకు వెళ్ళి, 'మీరు మాకిచ్చిన చీరలు లుంగీ పంచలు లాగా వున్నాయి. చుట్టూ ఓ చుట్టైనా తిరగడం లేదు' అన్నారట. ఈ విషయం పత్రికా విలేఖరులకు చెప్తూ 'మనం అలాంటపుడు ఆవేశ పడకుండా, వారిని సంతృప్తిపరచాలి. లేకపోతే మిగతా వారిని ఆపరేషనుకు రాకుండ వీరు యాగీ చేయగలరు' అన్నారట. పోయింటే... కానీ యింతకీ అంత చిన్న చీరలసలు ఏల యివ్వ వలసి వచ్చెనో...

ఒక వారం విపరీతం — ఫాలాక్షుడు

శాస్త్రజ్ఞుని ఆత్మార్పణ

మే నాలుగో తేదీన ఢిల్లీ ఇండియన్ ఎగ్రికల్చరల్ రిసర్చి ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ వినోద్, హెచ్. షా అనే ఆయన ఆత్మహత్య చేసుకున్నారట. 'చెడు చేతులలో పడి పాడైపోతున్న వైద్యశాస్త్ర నిపుణులను వుద్రేకపరచి యువకులైన శాస్త్రవేత్తలకు కనువిప్పు కలుగజేయడానికే' తాను ఆత్మార్పణం చేసుకున్నట్లు డాక్టర్ షా ఓ ఉత్తరంలో రాశారట. ఆయన ఆరకంగా చనిపోడం కేవలం పిరికితనమని మరో శాస్త్రవేత్త అన్నారట. ఆయన నలా అన్నందుకు 20—40 మధ్య వయస్సున్న కొంతమంది శాస్త్రవేత్తలు బాధపడ్డారట.

ఆర్థిక స్తోమతకి కొత్త కొలమానం !

ఓ మనిషి ఆర్థిక స్థితిని కొలవాలంటే ఆతను వుంటున్న తీరుగాని, ధరించిన బట్టలు, తదితర వస్తువును గాని, మరి ఏ రకమైన పటాటోపాన్ని గానీ చూసి నిర్ణయించ రాదనీ, ఒక రోజుకు ఆతడు ఎన్ని పాలు త్రాగుతున్నాడో చూసి, దానిని బట్టి చెప్పాలని మైసూరు ముఖ్యమంత్రి దేవరాజఅర్సు అన్నారట— మనదేశంలో చాలా ధనికుడు కూడా కనీసం దేహానికి కావల్సినన్ని పాలు త్రాగకపోడం విచారకరమైన విషయం ఆవటాని ఆయన అన్నారట—దీని భావమేమి?




అక్రమ సంబంధం—ఆస్తి హత్య

తిరుపత్తూరుకు చెందిన 28 ఏళ్ళ మునియమ్మ అనే ఆమెకు 32 ఏళ్ళ చిన్నమొదలియార్ అనే ఆతనికి అక్రమ సంబంధం వున్నదట మునియమ్మ విధవట. ఆమెకు సంక్రమించిన ఆస్తిని తన పేర పెట్టమని చిన్నమొదలియారు రోజూ ఆమెను నేపుకు తినేవాడట. ఆమె ఎన్నిరకాలుగా చెప్పినా లొంగలేదని, చివరికి ఆమెను షికారు వంకన వూరి చివరకు తీసుకుపోయి, అక్కడ ఆమె పీక కోసి, పారిపోయాడట. నెత్తురు వరదలుగా కారుతూంటే మునియమ్మ ప్రాణాలను చేతో పట్టుకుని, యింటికి చేరి, తన కూతురు 12 ఏళ్ళ సుశీలకు అన్ని విషయాలూ వివరంగా చెప్పి, చనిపోయిందట.

హత్యలు—చపాతీలు !

చాంబల్ లోయలో సర్వోదయ సంస్థకు లొంగిపోయిన బందిపోట్లలో ఒకతన్ని అక్కడి వాడు 'మీరు యింతవరకూ ఎంత మందిని చంపి వుంటారు బాబూ?' అనడిగితే, ఆ బందిపోటు ఇన్ని



'మీరింతవరకూ ఎన్ని చపాతీలు తిని వుంటారు బాబూ?' అనడిగాడట. అనగా తాను అంత లెక్కలేనంత పద్ధతిన చాలామందిని చంపాడనమాట— బాపురే...

ప్రేమ త్యాగం కోరితే...

తిరువణ్ణామలై తాలూకా సోమాస్‌పాడి అనే గ్రామానికి చెందిన 27 ఏళ్ళ రామమూర్తి అదే వూరుకు చెందిన 17 ఏళ్ళ చిన్నతాయి అనే ఆమెను లేవదీసుకుని వేలూరుకు వెళ్ళి, అక్కడ కాపురం పెట్టాడట. ఈ వత్తా తెలుసుకుని, చిన్నతాయి తల్లి వేలూరు వెళ్ళి భయపెట్టి తన కూతురును సోమాస్‌పాడికి తెచ్చేసిందట. ఆమె వెనుక రామమూర్తి కూడా ఆ వూరు వెళితే, వూరి పెద్దలంతా పంచాయితీ పెట్టి, చిన్నతాయికీ, రామమూర్తికీ, ఏ సంబంధం లేదని, ఆతనిక ఆమెను కలువరాదనీ తీర్పు చెప్పారట. దాంతో ఆగ్రహం పట్టలేక,

రామమూర్తి వంటరిగా దొరికిన చిన్నతాయి ముఖానికి గుడ్డ వేసి పట్టుకుని, వూరి అవతలకు తీసుకు వెళ్ళి కత్తితో ఏడు సార్లు పొడిచి చంపేశాడట—ప్రేమ త్యాగాన్ని కోరితే— కామం పగను కోరుతుందంటా రిందుకే గాబోలు.

అవీ — ఇవీ ...

కార్లు — కాలుష్యం

మనదేశంలోనే కార్ల సంఖ్య మితిమీరి పోయిందా అనిపిస్తుంది. మదరాసు, బొంబాయి, ఢిల్లీవంటి నగరాలు చూస్తే; ఇక పాశ్చాత్యదేశాల సంగతి వేరే చెప్ప నవసరం లేదు. వీధులమీద రద్దీ యేకాక ఈ వాహనాల ఇంజన్లలో మండే ఇంధనాల పొగలు భూగోళంమీద వాతావరణాన్నే కలుషితం చేసే స్తున్నాయని నిపుణులు చెపుతున్నారు. 'పొల్యూషన్' లేక 'మైల' ముందుకి వెళ్ళిన దేశాలకి ఒక పెద్ద సమస్య అయి పోయింది!

నూనెనికాల్చే ఇంజన్ కాక విద్యుచ్ఛక్తిమీద వెళ్ళే కార్లు ఈ సమస్యకి పరిష్కారం అని కొందరు అంటున్నారు.

ఇది నిజమే కాని విద్యుచ్ఛక్తిని వినియోగించటం ఎలాగ? మరీ పెద్ద బాటరీలు కావాలికదా!

ఒక టన్ను బరువు మోసే ఒక ట్రక్కుకి కావలసిన బాటరీల భారం 1914 పవున్లట!

'ఎలెక్ట్రిక్ కార్ల' మీద విపరీతమయిన పరిశోధన జరుగుతోంది. మెస్సర్‌ష్మిట్ కంపెనీ వారు చేసిన ఒక 'ట్రక్కు' ఒకటి కొంతకాలంగా సంతృప్తికరంగా పని చేస్తోంది — పయిన చెప్పిన బరువు వివరాలు దానివే. అయితే, ఈ వాహనం దేహం బరువు 792 పవున్లు మాత్రమే. విద్యుచ్ఛక్తితో నడిచే కార్లకి ఇంజన్ మొదలయిన బరువయిన భాగాలు ఉండవు.

ఈ ట్రక్కు వేగం ఎంత? గంటకి సుమారు 50 మైళ్ళ వేగం దాకా సాధించగలదు ఇది.

దాని పవర్ ఎంత? సుమారు 44 కిలోవాట్లు..

ఒకసారి బాటరీ ఛార్జిచేస్తే బాటరీ ఎన్నిమైళ్ళ వస్తుంది. 40 నుంచి 65 మైళ్ళదాకా....

(కోల్నర్ స్టాట్ ఆన్ జెయిగర్ పత్రిక వ్యాసం ఆధారంగా.)

భిలాయ్‌లో నాటిక పోటీలు

భిలాయినగర్‌లో ప్రప్రథమంగా రాష్ట్ర స్థాయిలో జరిగిన వెంకటేశ్వర నాటక కళాపరిషత్ నాటిక పోటీలలో ఆరురాష్ట్రాలనుండి పదహారు నాటక సమాజములు పాల్గొన్నాయి — ఈ నాటకోత్సవములు ఏప్రిల్ 29, 30, తేదీలలో నెహ్రూ సాంస్కృతిక భవన్‌లో జరుపబడినాయి.

ఈ పోటీలకు ప్రారంభోత్సవం శాస్త్రయుక్త (మైన రంగ పూజతో, శ్రీమతి చంద్రకళ అహూజా భిలాయి కర్మాగారపు జనరల్ మేనేజర్ గారిసతీమణి) గారిచే గావించబడింది.

పోటీల రెండవ రోజున, ప్రఖ్యాత రచయిత

రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు:

ప్రచురణకి స్వీకరింపబడని తమ వ్రాత ప్రతులని తిప్పి పంపమని కోరే రచయితలు వ్రాత ప్రతులతో బాటే తగినంత తపాలా బిళ్ళలు అతికించిన స్వంత చిరునామాతో కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు. స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పి పంపబడవు. వ్రాత ప్రతులతో కాక విడిగా స్వంత చిరునామా, తగినంత పోస్టేజీ కల కవర్లు పంపినా వ్రాత ప్రతులు తిప్పి పంపబడవు.

ప్రచురణకి స్వీకరింపబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

నవలలు:

ప్రచురణకి స్వీకరింపబడని నవలల వ్రాత ప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాత ప్రతులతో స్వంత చిరునామాగల, తగినంత పోస్టేజి అతికించిన కవర్లు పంపనవసరం లేదు. 100 అరఠావు పేజీల పైబడి ఉన్న వ్రాతప్రతులే నవలల కింద పరిగణింపబడుతాయి.

కార్టూన్లు:

ప్రచురణకి స్వీకరింపబడని కార్టూన్లు తిప్పి పంపమని కోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాగల, తగినంత పోస్టేజి అతికించిన కవర్లు జతపరచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులని, కార్టూన్లని వీలయినంత భద్రంగా తిప్పి పంపే ప్రయత్నాలు చేస్తాము. కాని, వాటి విషయమై ఎటువంటి బాధ్యతనీ స్వీకరించలేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్లు పంపగలరు.

సంపాదకుడు
ఆంధ్రసచిత్ర వారపత్రిక



శ్రీ మొక్కపాటి నాగేశ్వరరావుగారివద్ద వీణ నేర్చుకుంటున్న అమెరికన్ విద్యార్థి శ్రీ ఎడ్వర్డ్ హాన్సెన్.

అవీ-ఇవీ...

శ్రీ గొల్లపూడి మారుతీరావు గారికీ స్థానిక రచయిత శ్రీ ఓరుగంటి నరసింహారావు గార్కీ ఘన సన్మానం జరుపబడింది.

ఈ పోటీలకు ప్రధాన న్యాయ నిర్ణేతగా శ్రీ వానమామలై సోమయాజులుగారు ఇతర న్యాయ నిర్ణేతలుగా, ప్రముఖ రచయిత్రి శ్రీమతి డి. కామేశ్వరి, శ్రీ డార్వార్, భిలాయి ఉక్కు డిప్యూటీ (ట్రాఫిక్ మేనేజర్) గారలు వ్యవహరించారు—

రెండు రోజులు జయప్రదంగా జరిగిన ఈ ఉత్సవాల్లోని విజేతలకు శ్రీమతి బి. దుర్గాశాస్త్రి బహుమతి ప్రదానం చేశారు.


పలువురి ప్రశంసలన్ని అందుకున్న యీపోటీ ఉత్సవాల్లో సహకరించిన అందరికీ ప్రధాన కార్యదర్శి శ్రీ తాతా అప్పారావుగారి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. —(ఓ. వి.)

లక్నో ఆంధ్ర సంఘం రజతోత్సవాలు

1972 లో లక్నో ఆంధ్ర సంఘం తన రజతోత్సవం జరుపుకుంది. ఈ సందర్భంలో జరిగిన వేడుకలకి శ్రీయుతులు కమలాపతి త్రిపాఠీ (ముఖ్యమంత్రి), బెజవాడ గోపాలరెడ్డి (గవర్నర్), చంద్రభానుగుప్త (మాజీ ముఖ్యమంత్రి) వచ్చారు. యామినీ కృష్ణమూర్తి నాట్య ప్రదర్శన జరిగింది.

లక్నో ఆంధ్ర సంఘంవారు రజతోత్సవ సందర్భంగా ఒక సంచిక కూడా వెలువరించారు.

ఈ సంచికలో వివిధ ప్రముఖుల వ్యాసాలు ఉన్నాయి. (ఓ. వి.)



న్యూఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనాసంస్థలో నెలకొల్పబడిన అణుశక్తి పరిశోధన ప్రయోగశాల ఆవిష్కరణ మహోత్సవములో పాల్గొన్న డాక్టర్ విక్రమ్ సారాభాయ్ (ఎడమనుండి రెండవవారు) డాక్టర్ ఎమ్. ఎస్. స్వామినాథన్, శ్రీ సి. సుబ్రహ్మణ్యం, శ్రీమతి ఇందిరాగాంధీ ప్రభృతులు.

హాస్యనటుడు నాగేష్ పరిచయం

తమిళరంగంలో దేదీప్యమానంగా వెలుగొందే నాగేష్ ఎస్. ఆర్. కంబైన్స్‌వారి 'హంతకులు — దేవాంతకులు' చిత్రంలో ముఖ్యపాత్రను పోషించారు. ఈ చిత్రంలోని తన పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది— కడుపుబ్బ నవ్విస్తుంది, అన్నారు, సెట్లో కలిసినప్పుడు.

ఎస్. ఆర్. కంబైన్స్ అధినేతల్లో ఒకరైన ఎం. కె. రాధ తనకు చాలా కావలసినవాడని, అందుచేతనే తాను అంగీకరించడం (పాత్రను) జరిగిందని చెప్పారు. తన్ను రాచబిడ్డలాగా మర్యాద చేసినట్టు చెపుతూ, యూనిట్‌సభ్యులందరూ తనకు సహాకరించినట్టు వెల్లడించారు.

ప్రధానపాత్ర ...

'కళకి భాష అడ్డంరాదు—పైగా నాకు తెలుగు బాగావచ్చు — నా డైలాగులను నేనే చెప్పాను' అన్నారు నాగేష్. నేను ప్రధాన పాత్ర వహించి విడుదలయ్యే మొదటి తెలుగు చిత్రం యిదే అవుతుంది, అన్నారు.

'తమిళ నిర్మాతలకి, తెలుగు నిర్మాతలకి చాలా వ్యత్యాసం అగుపిస్తుంది,' అని చెప్పారు, నాగేష్. 'స్నేహానికి, మంచితనానికి జోహారుచేసే మనస్తత్వం తెలుగువాళ్ళకుంది' అన్నారు.

తెలుగు ప్రేక్షకులు నాగేష్ నటించిన 'సర్వర్ సుందరం' చిత్రాన్ని ఆదరించారు. అతగాడు తెరపై కనిపిస్తేనే కరతాళ ధ్వనులు చేస్తారే...మరి అతడు చిత్రం ఆద్యంతం కనిపిస్తే?

జెర్రీలూయిస్ అభిమాని

ప్రస్తుతం నాగేష్ 'పాపం పసివాడు, మంచివాళ్ళకు మంచివాడు' చిత్రాల్లో నటిస్తున్నాడు. తనకంటూ ఒక ప్రత్యేక బాణిని యేర్పరచుకున్న నాగేష్ చిత్ర చిత్రానికీ వ్యత్యాసమైన నటన్ను అగుపరుస్తూ ప్రేక్షకులను రంజింపచేస్తున్నాడు. తనకు నచ్చిన నటుడు జెర్రీలూయిస్ అట. వీలుంటే అతగాణ్ణి ఒకసారి చూడాలన్న ఆశ వుందట నాగేష్‌కి.

నాగేష్‌ను కేవలం హాస్యనటుడు అనలేం, కారణం—అతడు క్యారెక్టర్ ఆర్టిస్టు గనక. ఎంత బాగా నవ్వించగలడో, అంతకు రెండింతలు ఏడిపించగలడు నాగేష్.

మనసున్న మనిషి

ఇంత పెద్ద నటుడుగదా— అనగింజంత అహంకూడా లేదాయనకు. అందరితో మనసు విప్పి మాట్లాడే స్వభావం ఆయనది. సెట్లోవుంటే కాలం గడిచిందే తెలియదు. ఒక్కసారి వింటే చాలు, ఒకపేజీ డైలాగయినా ఒకే టేక్‌లో 'ఓకే'అయ్యేలా నటించగల సమర్థుడు, నాగేష్.

'హంతకులు—దేవాంతకులు' చిత్రంతో నాగేష్ నటనకు ప్రజలు బ్రహ్మరథం పడతారు. ఆయనకి పదే పదే చిత్రాల్లో కనిపించండి అంటూ ఉత్తరాలూ వ్రాస్తారు. దక్షిణ భారత చలన చిత్రరంగంలో సంచలనం కలిగించిన నటుడు నాగేష్. తెలుగులో తన తఢాకాను చూపించబోతున్నాడు నాగేష్.

—శ్రీనివాస్



'హంతకులు—దేవాంతకులు'లో నాగేష్.

సినిమా

వేదనిలయంలో జయలలిత ప్రవేశం

అందాల బరిణె జయలలిత ఆళ్వార్ పేటలో బ్రహ్మాండమైన ఇల్లు కట్టించింది. ఆ యింటికి 'వేదనిలయం' అని పేరు పెట్టింది. మే 15న, సోమవారం ఉదయం ఆరుగంటలకు నటి జయలలిత ఆ కొత్త యింట్లోకి ప్రవేశించింది. పూర్ణకుంభంతో, పూజా పునస్కారాలతో గృహప్రవేశ మహోత్సవం జరిపింది గ్లామర్ క్వీన్.

గృహప్రవేశానికి వచ్చిన అతిథులను, జయలలిత సాదరంగా ఆహ్వానించింది. రాణివాసమా అనిపించింది, ఆమె నిర్మించిన యిల్లు. సినిమా వాళ్ళకెవ్వరికీ యింత చక్కటి ఇల్లు లేదనుకుంటాను. తెలుగు, తమిళ దర్శక, నిర్మాతలు, హాస్యాత్రికేయులు ఈ వుత్సవానికి విజయం చేశారు. నాటి సాయంత్రం ప్రముఖ నటుడు ఎన్టీరామారావు, విజయా పూర్ణచంద్రరావులు వచ్చి, జయలలితకు శుభాశిస్సులు తెలిపారు. నటీమణులు జయంతి, కె. ఆర్. విజయ, భారతి, షీలా, పద్మిని, నేపథ్యగాయకులు సుశీల, జానకి గృహప్రవేశానికి వచ్చారు. 15 వ తేదీ సాయంత్రం షడ్రసోపేతమైన విందు, కర్ణపేయమైన చిట్టిబాబు వీణ కచ్చేరి గృహప్రవేశానికి వచ్చినవాళ్లని సంతుష్టాంతరంగుల్ని చేసింది.

గృహప్రవేశ సంరంభానికి వేలసంఖ్యలో జనం రావడం నాకు తెలిసి యిదే ప్రథమం—విద్యుద్దీపాలంకరణలతో, వచ్చతోరణాలతో, వేదనిలయం భూతలస్వర్గమా అనిపించింది. భవంతికి ముందు ఆమె తల్లి స్వర్గీయ సంధ్య ఛాయాచిత్రం అమర్చబడింది. ఆమె యీ ఆనందసమయంలో వుండివుంటే, ఎంత బాగుండేది, అనిపించింది.


వెండితెరకి కొత్త గాయకుడు

జయప్రద పిక్చర్స్ కలర్‌లో నిర్మిస్తున్న 'పండంటి కాపురం' చిత్రంలో రాజబాబుకి ఒక కొత్త గాయకుడిచేత సంగీత దర్శకుడు కోదండపాణి పాడించారు. ఆ గాయకుడి పేరు ఆనంద్. అప్పలాచార్య వ్రాసిన

'ఆడిపాడే కాలంలోనే అనుభవించాలి

తెనెలూరే ప్రాయంలోనే తోడుకావాలి.'

అన్న సిక్సిక్ పాటను ఎస్. పి. బి, సుశీల, ఆనంద్, పుష్పలతలు ఆలాపించారు. ఈపాట చిత్రంలో కృష్ణ — విజయనిర్మల; రాజబాబు—సంధ్యారాణిలపై మే16 నుండి మైసూరు ప్రాంతపు సుందర ప్రదేశాల్లో చిత్రీకరింపబడుతూంది. పి. లక్ష్మీదీపక్ దర్శకుడు.



'నీతి—నిజాయితీ' లో షబ్నమ్.

ఆనంద్‌కి అభినందన

పై పాటను విన్నవాళ్ళు, ఆనంద్‌కి ఆనందించే మంచిరోజులు వున్నాయని, వెండితెరకి మరొక చక్కటి గాయకుడు లభించాడని చెప్పారు. సంగీత సారథి కోదండపాణి, ప్రముఖ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం, హాస్యనటుడు రాజబాబు ఆనంద్‌ను అభినందించారు. 'నాకు యీ అవకాశాన్ని యిచ్చి, ప్రోత్సహించిన ప్రభాకరరెడ్డి, కోదండపాణి, లక్ష్మీదీపక్‌గార్లను ఆ జన్మాంతం మరువలేను' అన్నారు ఆ వర్ధమాన గాయకుడు ఆనంద్.



'హంతకులు—దేవాంతకులు' లో కృష్ణంరాజు, రాజసులోచన.

అపూర్వమైన పాత్రలో జమున


'పండంటి కాపురం'లో జమున అపూర్వమైన పాత్రను పోషిస్తూంది. ఇంతవరకు జమున ఎన్నో క్లిష్టపాత్రలను ప్రతిభావంతంగా, సునాయాసంగా పోషించిన విషయం పాఠకులకు తెలుసు. గత 20 యేండ్లనుండి, తనకొక ప్రత్యేక స్థానాన్ని యేర్పరచుకున్న ఏకైక తార జమున.

డాక్టర్ వ్రాసిన కథ

క్యారెక్టరు నటుడు డాక్టర్ ప్రభాకరరెడ్డి వ్రాసిన కథ యిది. కథానాయికగా జమున అద్వితీయంగా నటిస్తున్నారని తెలిసింది. మరి ఆవిడ చెయ్యకపోతే... యింకెవరు చేస్తారు? ఈ చిత్రానికి మద్దిపట్ల సూరి మాటలను, కోదండపాణి సంగీతాన్ని,



'మాయింటి వెలుగు'లో నిర్మల.



అన్నపూర్ణా సినీ ఎంటర్ ప్రైజెస్ పాట రికార్డింగ్ సందర్భంలో తీసిన చిత్రం. కె. విశ్వనాథ్, సుశీల, ఘంటసాల.

వి. ఎస్. ఆర్. స్వామి ఛాయను, అనంతరాం కళను, గోపాలరావు కూర్పును నిర్వహిస్తున్నారు. వెండితెర దిగ్గజాలు అనిపించుకునే ఎస్వీ రంగారావు, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, రాజబాబు, అల్లు రామలింగయ్య, మిక్కిలినేని, సరోజాదేవి, దేవిక ప్రధానపాత్రధారులు. నాయకీనాయకులుగా విజయనిర్మల, కృష్ణ నటిస్తున్న యీ చిత్రం త్వరలో పూర్ణాద్వారా విడుదలవుతుంది. 'పచ్చని సంసారం' తెచ్చిపెట్టిన పేరును, మరింత ఎక్కువ అయ్యేట్టు లక్ష్మీదీపక్ కృషిచేస్తున్నారు.

దంపతులుగా శోభన్—జయంతి

శ్రీధర్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఆనంద రామం గారి 'ప్రేమ సూత్రం' చిత్రంలో శోభన్‌బాబు, జయంతి దంపతులుగా నటిస్తున్నారు. నాయిక పాత్రను శారద పోషిస్తుంది. ప్రధాన భూమికలను కె. వి. చలం, విజయభాను, నిర్మల, కొత్తనటి జయ ధరిస్తున్నారు. ఈ చిత్రానికి భమిడిపాటి మాటలను, జె. సత్యనారాయణ ఛాయను, బి. గోపాలం కూర్పును, రమేష్ నాయుడు సంగీతాన్ని, రాఘవేంద్రరావు సహాయ దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు. సూర్యచంద్రరావు, గిరిబాబులు నిర్మించే యీ చిత్రానికి స్క్రీన్‌ప్లే, దర్శకత్వాన్ని కె. ఎస్. ప్రకాశరావు చేపట్టారు.

మే 11 న జెమినీ రికార్డింగ్ థియేటర్లో డాక్టర్ నారాయణ రెడ్డి వ్రాసిన రెండు పాటలకు రమేష్‌నాయుడు బాణీలు కూర్చగా, ఒకదాన్ని సుశీల, రెండవదాన్ని సుశీల, రామకృష్ణ పాడారు. జూన్ 18 నుండి షూటింగు ప్రారంభం.

రామకృష్ణకు మంచిరోజులు

ప్రముఖ నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు హస్తవాసి చాలా మంచిది. చలం సినిమాలన్నీ ఆయన చేతనే ప్రారంభించ బడతాయి. రామకృష్ణచేత ప్రప్రథమంగా పాడించిన ఘనత మధుసూదనరావుకు చెందుతుంది. ఆయన అప్పుడే అన్నారు: 'రామకృష్ణ చాలా బాగా పాడుతున్నాడు. మంచి భవిష్యత్తు వుంటుంది.' ఆ మాటలు నిజమయ్యే సమయం ఆసన్నమైంది. కారణం— శ్రీధర్ ప్రొడక్షన్స్‌లో రామకృష్ణ పాడిన పాటను అందరూ మెచ్చుకున్నారు. వాయిస్‌లో మంచి గ్రిప్ వుంది, అన్నారు. ఇతగాడు ప్రముఖ గాయకి సుశీలకు తమ్ముడవుతాడు.

ప్రకాశరావు—శోభన్ కాంబినేషన్

1971 లో సంచలనం కలిగించిన

దర్శకుడు కె. ఎస్. ప్రకాశరావు; 'తాసిల్దారు గారి అమ్మాయి' ద్వారా అంతస్తును పెంచుకున్న హీరో శోభన్‌బాబుల కాంబినేషన్‌లో శ్రీకాంత్ అండ్ శ్రీకాంత్ ఎంటర్‌ప్రైజెస్ మే 17 న ఒక సముజ్వల సౌంఘికాన్ని ప్రారంభించారు. ఈ చిత్రానికి సముద్రాల రచన్ను, ఆదినారాయణరావు సంగీతాన్ని, శ్రీకాంత్ ఛాయను, బి. చలం కళను, ఎస్. వి. ఎస్. కృష్ణ కూర్పును, రామదుర్గె ప్రొడక్షన్ను, అసోసియేట్ డైరెక్షన్ను రాఘవేంద్రరావు, ప్రకాశరావు నిర్వహిస్తున్నారు. శ్రీకాంత్ సహితా, శ్రీకాంత్ పటేల్ నిర్మించే యీ చిత్రంలో నాగభూషణం, నాగయ్య, వివేకానందమూర్తి, కాంచన, విశ్వరలక్ష్మి ప్రధాన పాత్రదారులు. రాజశ్రీ విడుదలచేసే యీ చిత్రానికి మధుభాయ్‌పటేల్ ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

జీవనతరంగాలు

పాటల రికార్డింగ్

సురేష్ మూవీస్ నిర్మించనున్న 'జీవన తరంగాలు' చిత్రానికిగాను, డాక్టర్ నారాయణరెడ్డి వ్రాసిన రెండు పాటలు, మే15, 16 తేదుల్లో విజయాగార్డెన్ థియేటర్లో రికార్డింగు జరిగింది. ద్రోహి చిత్రానికి సంగీత సారధ్యం వహించిన రాఘునలు ఈ కథకి సంగీత దర్శకుడు. తన యూనిట్‌లో పనిచేసే వ్యక్తులకు ప్రమోషన్ ఇవ్వాలన్న మనస్తత్వం రామానాయుడుకు వుంది.

ప్రముఖ నవలగా బహుళ ప్రజాదరణ పొందిన 'జీవన తరంగాలు' షూటింగు మే 25 న వాహినీలో ప్రారంభమవుతోంది. 'రైతుకుటుంబం' ఫేం తాతినేని రామారావు దర్శకత్వం నెరపుతున్న యీ నవలా చిత్రానికి ఎస్. వెంకటరత్నం డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ. డి. రామానాయుడు, మాధవి ప్రసాద్ కలిసి నిర్మిస్తున్న యీ చిత్రంలో శోభన్‌బాబు కథానాయకుడు. నాయికగా వాణిశ్రీ నటిస్తుంది. ముఖ్య పాత్రలను లక్ష్మి, సూర్యకాంతం, గుమ్మడి, కృష్ణంరాజు, చంద్రమోహన్, రాజబాబు, సత్యనారాయణ (గెస్టు) ధరిస్తున్నారు. నవయుగ విడుదల.

'దేశంకోసం'

సురేష్ మూవీస్ భారీయెత్తున సెప్టెంబర్‌లో ప్రారంభిస్తారు 'దేశంకోసం' వర్ణ చిత్రాన్ని. నటసామ్రాట్ నాగేశ్వరరావు నాయకుడు.

ఛేర్మన్‌గా చలం !

సుచిత్రా ఆర్ట్స్ నిర్మించనున్న చిత్రానికి 'ఛేర్మన్ చలమయ్య' అని పేరు పెట్టారు. గుత్తా రామినీడు నిర్మిస్తూ, దర్శకత్వం నెరపనున్న యీ సామాజిక చిత్రానికి చలం సినిమా అనుకరణను, రాజశ్రీ రచన్ను చేసేట్టారు. ప్రస్తుతం పేపర్ వర్కు జరుగుతూవుంది.



నటి భారతి

(చిత్రకారుడు: శ్రీ ఎం. ఆర్. ఎన్. ప్రసాదరావు)

దత్తపుత్రుడు

రీ — రికార్డింగ్

బాక్సాఫీస్ ఫార్ములా తెలిసిన కొద్దిమందిలో రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్ అధినేత తమ్మారెడ్డి కృష్ణమూర్తి ఒకరు. ఇంతవరకు యీ సంస్థ నిర్మించిన చిత్రాలన్నీ ప్రజాదరణపొందినవే. ఇప్పుడు 'దత్తపుత్రుడు' వర్ణచిత్రం తయారైంది. మే 16తో రీ—రికార్డింగ్ కూడా పూర్తయింది. ఈ చిత్రాన్ని, తమ్మారెడ్డి కృష్ణమూర్తి కుమారుడు లెనిన్‌బాబు డైరెక్ట్ చేశారు. ప్రధానపాత్రలను నాగేశ్వరరావు, వాణిశ్రీ, నాగభూషణం, రామకృష్ణ, వె. నిర్మల, పద్మనాభం, రమాప్రభ, సత్యనారాయణ, నిర్మల పోషించారు. ఈ చిత్రానికి చలపతిరావు సంగీతాన్ని, ఎస్. వెంకటరత్నం ఛాయాగ్రహణాన్ని, అక్కినేని సంజీవి కూర్పును, జి. వి. సుబ్బారావు కళను, భీమేశ్వరరావు సహాయ దర్శకత్వాన్ని నిర్వహించారు. జూన్‌లో లక్ష్మీవిడుదల.

సినిమా డైరీ

- మహేశ్వరీ మూవీస్ వారి 'మా యింటి వెలుగు' 11 రీళ్లు తయారైంది. విజయ్ దర్శకుడు.
- రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్ 'దత్తపుత్రుడు' రీ—రికార్డింగ్ మే 16తో పూర్తయింది. టి. లెనిన్‌బాబు దర్శకుడు.
- మమతా ప్రొడక్షన్స్ 'కాలం మారింది' 8 రీళ్ళు తయారైంది. కె. విశ్వనాథ్ దర్శకుడు.
- శ్రీకాంత్ అండ్ శ్రీకాంత్ ఎంటర్‌ప్రైజెస్ వారి చిత్రం మే 17న సత్యాలో ప్రారంభం అయింది. కె. ఎస్. ప్రకాశరావు దర్శకుడు.
- జయశంకర్ అండ్ కో యొక్క షూటింగు వీనస్‌లో మే 15, 16 తేదీలలో జరిగింది ఎం. మల్లికార్జునరావు దర్శకుడు.
- జ్ఞయప్రద పిక్చర్స్ 'పడంటికాపురం' షూటింగ్ మే16 నుండి మైసూర్‌పరిసర ప్రాంతాలో ప్రారంభం అయింది. 23 వరకూ జరుగుతుంది. పి. లక్ష్మీదీపక్ దర్శకుడు.
- త్రివేణి ప్రొడక్షన్స్ 'బడి పంతులు' 8 రీళ్లు తయారైంది. పి. చంద్రశేఖరరెడ్డి దర్శకుడు.



'నటి జయంతి'
(చిత్రకారుడు: కొండూరు నాగేశ్వరరావు)

కొత్త దర్శకుడు

'దత్తపుత్రుడు' సినిమాను చూసిన పెద్దల్ని దర్శకుడు లెనిన్‌బాబును గూర్చి అడిగాను. అందరూ ఆయన్ని గురించి గొప్పగా చెప్పారు. 'పాటల చిత్రీకరణలో లెనిన్‌బాబు ఘటికుడు' అన్నారు. 'ఈ చిత్రం లెనిన్‌బాబుకి పేరు ప్రతిష్ఠలను తెస్తుంది.—ఆయన తండ్రికి ధన ప్రాప్తిని కలిగిస్తుంది' అని చెప్పారు.

'దత్తపుత్రుడు' విడుదలంగానే తరువాయి, లెనిన్‌బాబు దర్శకత్వంలో మరొక చిత్రం ప్రారంభమవుతుంది. ఆ చిత్రంలో శోభన్‌బాబు నాయకుడు.

బడిపంతులుగా రామారావు


త్రివేణీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న నను లాల సాంఘికమే 'బడిపంతులు'. ఈ కథ మలయాళ, కన్నడ భాషల్లో విజయఢంకా మ్రోగించింది. తెలుగులో అనేకమైన మార్పు చేర్పులతో నిర్మితమవుతున్న యీ చిత్రానికి డి. వి. నరసరాజు రచయిత. ఈ చిత్రంలో ఎన్టీ రామారావు బడిపంతులు గనే మారిపోయి నటించారు. 'రక్తసంబంధం' తర్వాత రామారావు ప్రేక్షకుల చేత కన్నీరుగార్పించే ఈ పాత్రను ప్రతిభా వంతంగా పోషించారు. నందమూరికి హిట్ చిత్రం అవుతుంది. రామారావుకు అర్ధాంగిగా అంజలీదేవి మంచి సపోర్టు నిచ్చింది. వీరిద్దరి కాంబినేషన్‌లో చాలాకాలం తర్వాత వస్తున్న చిత్రం యిదేననుకుంటాను. ఈ చిత్రానికి మహదేవన్ సంగీతాన్ని, ఎన్. కృష్ణరావు కళను, వి. ఎస్. ఆర్. స్వామి ఛాయను నిర్వహిస్తున్నారు. పి. పేర్రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి పి. చంద్రశేఖరరెడ్డి దర్శకుడు. 'బడిపంతులు' విడుదలతో చంద్రశేఖరరెడ్డి దశ మారుతుంది. రామారావు అభిమానులకు ఈ చిత్రం పరిపూర్ణ ఆనందాన్ని యివ్వడం తథ్యం. ఇప్పటికి రీ రీళ్ల చిత్రం తయారైంది. ముఖ్యపాత్రలను నాగభూషణం, రామకృష్ణ, కృష్ణంరాజు, రాజబాబు, అల్లు రామలింగయ్య, రావి కొండలరావు, జయంతి, విజయలలిత, సూర్యకాంతం, కుమారి టి. పద్మిని పోషించారు. సెప్టెంబర్ 15 న పూర్ణాద్వారా విడుదలవుతుంది.

తండ్రి—తనయుడు—మనుమడుగా ఎన్. టి. రామారావు

ఎస్. వి. టి. నిర్మిస్తున్న చిక్కటి చక్కటి చిత్రం 'కులగౌరవం'లో నటరత్న రామారావు మూడు పాత్రలను అద్వితీయంగా పోషించారు. 'తండ్రి—తనయుడు—మనవడు' భూమికలను ధరించి రామారావు ఆయాపాత్రలకున్న వ్యత్యాసాన్ని తన సున్నితమైన నటనతో ఆవిష్కరించారు. మూడింటిని అసాధారణ ప్రజ్ఞతో పోషించారు. నాయికగా జయంతి కన్నడం కన్నా మిన్నగా నటించింది. ఈ చిత్రానికి సముద్రాల రచన్ను, టి. జి. లింగప్ప సంగీతాన్ని, మార్కస్ బార్ట్లే ఛాయాగ్రహణాన్ని నిర్వహించారు. కన్నడ చిత్రాన్ని డైరెక్ట్ చేసిన పేకేటి శివరాం తెలుగు ప్రతిని మరింత గొప్పగా డైరెక్ట్ చేశారు. త్రివిక్రమరావు నిర్మిస్తున్న 'కులగౌరవం' విజయా పిక్చర్స్ ద్వారా విడుదలవుతుంది.



'మానవుడు—దానవుడు'లో శోభన్‌బాబు, శారద.



రష్యా పయనం సాగించి, స్వదేశానికి ఆగమించిన పి. పుల్లయ్యను గ్రీట్ చేస్తున్న జగ్గయ్య. శ్రీ పుల్లయ్య వెనుక శ్రీమతి శాంతకుమారి నుంచుని ఉన్నారు.

పద్మశ్రీ పిక్చర్స్

అరవై దాటినా, ఇరవై వున్నవారివలె కనిపిస్తారు పి. పుల్లయ్య. సెట్లోనయితే నేమి, విడిగానయితేనేమి హాస్యరుగా, నవ్వుతూ సాక్షాత్కరిస్తారు పుల్లయ్య. ఆయన చిత్రాల్లోకూడా హాస్యరుపాలు ఎక్కువ కనిపిస్తుంది.

పద్మశ్రీ పిక్చర్స్ ఒక వర్ణచిత్రాన్ని నిర్మిస్తున్నారు. (సారథీ స్టుడియోలో)

సినిమా

ఈ చిత్రం 10 రీళ్ళు తయారైంది. ఆరు పాటలను చిత్రీకరించారు. (కన్నుల పండువైన) ప్రకృతి రామణీయకతతో విలసిల్లే ప్రదేశాల్లో అయిదు పాటలను చిత్రీకరించారు. ఒకటి పుట్టినరోజు పాట మాత్రం యిన్‌డోర్‌లో పిక్చరైజ్ చేశారు. ఈ చిత్రంలో కెమెరామెన్ కె. ఎస్. ప్రసాద్ తన హీరాయిజమ్‌ని ప్రదర్శించారు. ఇటీ

వల వచ్చినది తెలుగు, తమిళ చిత్రంలో యింత గొప్ప ఫోటోగ్రఫీని నేను చూడ లేదు. హీరో నాగేశ్వరరావును చూస్తే, 'బతుకు తెరువు' రోజులు జ్ఞాపకానికి వస్తాయి. అంత అందంగా యీ చిత్రంలో కనిపిస్తారు. నేనుమాత్రం ఏం తక్కువ అన్నట్టుగా మహదేవన్ బాణీలను కూర్చారు. ఆరుపాటల్లో, అయిదు హిట్‌కాగల సూచనలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రానికి ఆచార్య ఆత్రేయ మాటలు పాటలను వ్రాశారు. వి. వెంకటేశ్వర్లు నిర్మిస్తున్న

మీకు తెలుసా?

'మా యింటి వెలుగు' చిత్రంలో శ్రీకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తున్నారు.

సంజయ్ చిత్రంలో రామకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తున్నారు.

శ్రీధర్ ప్రొడక్షన్స్‌లో శోభన్ — శారద దంపతులుగా నటిస్తున్నారు.

అన్నపూర్ణా సినీ ఎంటర్‌ప్రైజెస్ వారి చిత్రంలో విలన్‌పాత్ర కనిపించదట.

తమిళ నటుడు రవిచంద్రన్, మళయాలనటి షీలా రహస్యంగా వివాహం చేసుకొన్నారట.

ఒక ప్రముఖ నిర్మాత తీసే జానపదాన్ని, పితాచార్య డైరెక్ట్ చేస్తారట.

సంజయ్‌గాంధీకి స్వంతమైన ఒక పారిశ్రామిక సంస్థలో ప్రఖ్యాత హిందీ నటుడు దిలీప్‌కుమార్ ఒక డైరెక్టరట.

యీ చిత్రంలో నాగేశ్వ్రరి, లక్ష్మి, శాంతకుమారి, సూర్యకాంతం, ఎస్వీ రంగారావు, గుమ్మడి, రాజబాబు, జగ్గయ్య (గెస్టు) ప్రధాన పాత్రధారులు. శ్రీ ఫిలింస్ విడుదల.

నిజం నిరూపిస్తా!

శ్రీరాం పిక్చర్స్ కలర్‌లో నిర్మించిన క్రైం థ్రిల్లర్ 'నిజం నిరూపిస్తా' విడుదలకు పూరకలు వేస్తూంది. కన్నడంలో తనకొక ప్రత్యేకతను సంపాయించుకున్న జానకిరాంకు తెలుగులో తొలి అనుభవం యిది.

అనే డైరెక్ట్ చేశారు 'నిజం నిరూపిస్తా'ని. కథను నమయుల్లా, మాటలను ఆరుద్ర వ్రాశారు. సంగీతాన్ని సత్యం, ఛాయను జానకీరాం నిర్వహించారు.

ఆంధ్రా జేమ్స్‌బాండ్ కృష్ణ హీరోగా నటించాడు. ముఖ్యపాత్రలను విజయలలిత, ప్రభాకరరెడ్డి, త్యాగరాజు, గా జ బా బు హాలెన్, లక్ష్మీఛాయ, మిక్కిలినేని, రావు గోపాలరావు, సంజీవి, రామదాసు, రవి పోషించారు. జానకీరాంకి మొదటి అనుభవమే అయినా, చిత్రం చూసినవాళ్ళకి ఆయనకిది యిరవై ఒకటో చిత్రపు అనుభవమా అన్నంతగా డైరెక్షన్ వుందట. ఈ చిత్రం త్వరలో శ్రీ ఫిలిమ్స్ (ఆంధ్రా), అజంతా మూవీస్ (మైసూర్), పి. ఎన్. ఆర్ పిక్చర్స్ (నార్తెర్న్స్) ద్వారా విడుదల అవుతుంది.

హంతకులు_దేవాంతకులు

ఎస్. ఆర్. కంబైన్స్ నిర్మించిన సస్పెన్స్ థ్రిల్లర్ యిది. తమిళ నటుడు నాగేష్ ఆద్యంతం నవ్వుల వర్షం కురిపించిన చిత్రం యిది. హీరో కృష్ణ హుషారుగా నటించిన చిత్రం యిది: జ్యోతిలక్ష్మి నాయికగా, రాజసులోచన విల్లీగా, సత్యనారాయణ, కృష్ణంరాజు దుష్టులుగా కనిపించిన చిత్రం యిది. కథను విజయా బాపినీడు, మాటలను దాసరి నారాయణరావు, సంగీతాన్ని సత్యం, ఛాయను కన్నప్ప నిర్వహించిన చిత్రం యిది. ఎన్. వి. సుబ్బరాజు, ఎం. కె. రాధ కలిసి నిర్మించిన చిత్రం యిది. అన్నపూర్ణా విడుదలచేసే క్రయిమ్ చిత్రమ్ యిది.


రహస్య వివాహం!

తమిళనటుడు రవిచంద్రన్, మళయాల నటి షీలాను రహస్యంగా పెండ్లి చేసుకున్నాడు. ఈ నటుడికి యిది రెండవ వివాహం. వీళ్లిద్దరూ కుముదమ్ ఆర్ట్స్ పేరిట ఒక తమిళ చిత్రాన్ని నిర్మిస్తారట.

గండం గడచింది!

జానపద బ్రహ్మగా పేరుబడసిన విఠలాచార్యకి టైం బాగులేదు ఇటీవల ఒక పెద్ద గండం తప్పింది. విఠలాచార్య, దక్షిణ దేశ యాత్రను ముగించి మద్రాసుకు తిరిగి వచ్చేటప్పుడు మధురాంతకం వద్ద ఆయన కారు చక్రాల్లో ఒకటి విడిపోయి, సుడిగుండంలో చిక్కుకున్నట్టు రంగులరాట్నం లాగా కారు తిరిగిందట. పైగా ఆ రోజు వర్షపు జల్లుకూడా వుందట. రోడ్డుపై ఆ వేళలో ఏ బండీ రానందున, కారును డ్రైవర్ ఎలాగో కంట్రోల్‌చేసి, అపాయాన్ని తప్పించాడట.

–శ్రీనివాస్



'మంచిరోజులు వచ్చాయి'లో నాగేశ్వరరావు.

చిత్రసమీక్ష:

మంచిరోజులు వచ్చాయి

జెమినీవారు ఈస్ట్మన్ కలర్‌లో నిర్మించిన మంచిరోజులు వచ్చాయి చిత్రాన్ని మే 10వ తేదీ సాయంత్రం 6–30 గంటలకు జెమినీలో రికార్డింగ్ థియేటరులో పత్రికా ప్రతినిధులకు ప్రత్యేకంగా చూపించారు.

ధనిక వర్గానికి, పేద వర్గానికి మధ్య చెలరేగిన సంఘర్షణ ద్వారా సోషలిజానికి నాంది పలకటం ఈ చిత్రంలోని విశేషం.

ధనిక వర్గం ప్రతినిధి బంగారయ్య, పేదల ప్రతినిధి గోపాలం పోటీపడతారు. ఎన్నికల్లో నిలబడతారు. గోపాలం ఓడిపోయేట్లయితే అతను ఊరువదలిపోవాలనీ, బంగారయ్య ఓడిపోతే అతని కూతుర్ని గోపాలానికిచ్చి పెళ్ళి చెయ్యాలని పత్రాలు రాసుకుంటారు. ఎన్నికల్లో గోపాలం గెలిచాడు. అనటం కన్నా — ధన బలానికీ; జన బలానికి జరిగిన పోటీలో జన బలమే జయించింది.

గోపాలం గెలుపు బంగారయ్యలో తీవ్రమయిన సంచలనాన్ని కలిగించింది. కూతురు యీ ఒప్పందం విని మండిపడుతుంది. తానీ ఒప్పందానికి కట్టుబడనంటుంది. ఈలోగా గోపాలం తాళిబొట్టుతో సహా వూళ్ళో జనాన్నందర్నీ వెంటేసుకుని బంగారయ్య భవనానికి వచ్చాడు.

బంగారయ్య దిక్కుతోచక ఆత్మహత్యా ప్రయత్నం చేస్తాడు. తన పెళ్ళి గోపాలం చేత తాళి కట్టించుకుని, తల్లి మాంగల్యం నిలుపుతుందామ్మాయి. ఆమెకు తాళికట్టిన భర్త గోపాలం అంటే అయిష్టం. అతని పేదరికమంటే అసహ్యం. ఆ కొంపలో నిలబడటమంటేనే వళ్ళంతా కంపరం పుట్టుకొస్తుంటుంది.

ఈ పరిస్థితుల్లో — రెండు వర్గాలకు ప్రాతినిధ్యం వహించిన తన భార్యను, ఏవిధంగా మార్చగలుగుతాడు గోపాలం అన్నది దర్శకుడు శ్రీ వి. మధుసూదనరావు ఎంతో ఆసక్తిదాయకంగా చిత్రీకరించారు.

గోపాలంగా పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు, అతని భార్యగా కాంచన, గోపాలం తండ్రిగా గుమ్మడి, తల్లిగా నిర్మల, బంగారయ్యగా ధూళిపాళ, కావయ్యగా నాగభూషణం, గోపాలం చెల్లెలుగా గీతాంజలి నటించారు.

బొల్లిముంత శివరామకృష్ణ సంభాషణలు, పి. ఎస్. సెల్వరాజ్ ఛాయాగ్రహణం, ఉమానాథ్ కూర్పు, టి. చలపతిరావు సంగీతం నిర్వహించిన యీ చిత్రానికి వి. మధుసూదనరావు దర్శకుడు. యస్. యస్. బాలన్ నిర్మాత. ఆంధ్రప్రదేశ్ అంతటా యీ చిత్రం మే 12న నవయుగ ఫిలింస్‌ద్వారా విడుదలయింది.

— మోహన్ కుమార్



శ్రీమతి జమున ఇటీవల గుంటూరు లయన్స్ క్లబ్ లేడీస్ నైట్ సందర్భంలో మాట్లాడారు.

పుస్తకాలు

బిల్హణీయము

చిత్రకవి సింగరాచార్య ప్రణీతము. పాకెట్ సైజు 10+176 పేజీలు. వెల: సాధా ప్రతి రు. 2.50 లైబ్రరీ ఎడిషను రు. 4—25. ప్రకాశకులు యం. శేషాచలం అండ్ కో., మచిలీపట్నం, మద్రాస్, సికింద్రాబాదు.

విమర్శనాత్మక సంప్రదాయ సాహితీ ప్రచురణలలో ఇది పదహారవది. పేరుపడిన శృంగార ప్రబంధం. దీనిని రచించిన సింగరాచార్యకవి మరణించిన తర్వాత ఆయన కుమారుడు నరసింహాచార్యులు అర్థాపేక్షనో, మరేకారణాన్నో దీనిని పండిపెద్ది కృష్ణస్వామి కృతిగా మార్చి తదనుకూలంగా అవతారికా, ఆశ్వాసాంత గద్యలను మార్చివేసినాడు. ఇది శ్రీరామునికి అంకితం చెయ్యబడింది. కాని ప్రథమాశ్వాసాంతంలోని చక్రబంధాన్ని బట్టి కవి సింగరాచార్యుడనీ, ఇది చంపభూపాలుకి కృతిగా ఇవ్వబడిందని యథార్థం తెలుస్తున్నది. సింగరాచార్యుని గ్రంథాంతరం రాఘవపాండవీయం కూడా నరాంకితం (వీరాంకభూపాలకృతి) అయినట్లే తెలుస్తున్నది. బిల్హణీయం 'బిల్హణోపాఖ్యానం'గా గ్రంథంలో పేర్కొనబడి ఉన్నది.

ఈ రసవత్ప్రబంధం తొలిసారి రమారమి 100 ఏళ్ళ క్రిందట 1873లో ప్రకటించబడింది తర్వాత పురాణం—సూర్యనారాయణ తీర్థులుగారు, వేదంవారు, వావిళ్లవారు కూడా ప్రకటించారు ప్రస్తుత ప్రకాశకులు, మద్రాసు ఓరియంటల్ లైబ్రరీలోని ప్రాచీన పండితుని వ్రాతప్రతిని అనుసరించి సరియైన సంస్కర్తలచే సంస్కరింపజేసి చాలా అందంగా ప్రకటించడం ఎంతో ప్రశంసనీయం.

బహుభాషావేత్తలూ, సుప్రసిద్ధ విద్వత్కవి విమర్శకులు, సరళహృదయులూ అయిన స్వామీ శ్రీ శివశంకరస్వామివారు దీనికి 'ఆలోకాన్ని' కూర్చి, అందాన్ని ఇనుమడింపజేశారు. అందులో సంస్కృతాంధ్ర బిల్హణీయములను గురించిన అనేక విషయాలను తెలియజేశారు. ఔచిత్యానౌచిత్యాలను వివరించి చక్కని వృత్తాంతాన్ని అంగీకరణంలో చేర్పుకొని పరిశోధన గట్టిగా చెప్పారు. బిల్హణకవిని గురించిన విషయాలను సమగ్రంగానూ, సంగ్రహంగానూ వెల్లడించారు.

సంపాదకులు, తాము స్వీకరించిన పాఠాన్ని గూర్చి, పాఠాంతరాలను గూర్చి తగిన కారణాలన్ని వివరించారు. దానివల్ల వారు గ్రహించిన పాఠాల ఔచిత్యం స్పష్టమవుతున్నది. గ్రంథంలో అక్కడక్కడ అథస్సూచికలో ప్రకాశమైన పాఠాంతరాలు నివ్వడం ఎంతో సముచితమై ఉన్నది. ఇట్టి చక్కని గ్రంథాన్ని అన్ని హంగులతోనూ ప్రకటించిన ఎమెస్కో వారు అభినందనీయులు.

—అంగీరస

మాట నిలుపుకున్న నటుడు! నిజమయిన రేప్ సీను! న్యూవేవ్ పేరిట సెక్స్ ఉధృతం!

మాట ఇవ్వటం ఒక ఎత్తు. దాన్ని నిలుపుకోవటం మరోక ఎత్తు. సాధారణంగా సినిమా రంగంలో వాగ్దానాలు ఇస్తూ వుండటం— వాటిని కాపాడుకోక పోవటం పరిపాటిగా జరుగుతూ ఉంటాయి. కానీ హిందీ హాస్య నటుడు మహమూద్ ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుని తన ఘనతను మరింత పెంచుకున్నాడు.

ఏ. వి. యం. వారు 'సర్వర్ సుందరం' చిత్రాన్ని హిందీలో 'మై సుందర్ హూ' పేరిట తీశారు. అందులో మహమూద్ టైటిల్ పాత్ర పోషించాడు. ఆ చిత్రం షూటింగ్ జరిగేటపుడు సి. మోహన్ అనే వ్యక్తి ప్రొడక్షన్‌లో ఉండేవాడు. అతను తరచూ సెట్స్‌లో మహమూద్‌తో ఈ చిత్రం సిల్వర్ జూబిలీ చేసుకుంటుందని చెప్పేవాడు. ఆ చిత్రంమీద అతనికి గల నమ్మకమూ, దృఢనిర్ణయమూ, మహమూద్‌ని ఆకర్షించాయి. 'ఈ చిత్రం నువ్వు చెప్పినట్టు నిజంగా సిల్వర్ జూబిలీ అయితే— నిన్ను నిర్మాతని చేస్తాను' అన్నాడు మహమూద్.

నిజంగానే ఆ చిత్రం సిల్వర్ జూబిలీ చేసుకుంది. మహమూద్— మోహన్‌కి ఇచ్చిన వాగ్దానం నిలబెట్టుకున్నాడు. అతన్ని తన స్వంత చిత్రానికి నిర్మాతను చేశాడు. ఆ చిత్రంపేరు 'గరమ్ మసాలా' అలాంటి మాట ఇచ్చి నిలబెట్టుకోవటం చెప్పుకోదగిన గొప్పే మరి!

* * *

సినిమాల్లో రేప్ సీన్లు తీసే ముందు ఆయా నటీనటులతో ఆ సన్నివేశాన్ని గురించి వివరించి చెప్పటం సాంప్రదాయం. ఇటీవల విడుదలయి బాక్సాఫీస్ దగ్గర పెద్ద సంచలనం లేవదీసిన 'దోరహా' చిత్రంలో నాయికగా నటించిన 'రాధ'—తనకు చెప్పకుండానే రేప్ సీను తీశారని అంటుంది.

'నాకు మొదటగాని, తీసే ముందుగాని సన్నివేశం వివరించి చెప్పలేదు. శ్యామ్‌ పెన్ (ఆ చిత్రంలో విలన్) నిజంగానే నన్ను పట్టుకుని వల్లువలు లాగుతున్నప్పుడు షాకైపోయాను. భయం కంపిత నయ్యాను. అతని పట్టు నుంచి విడిపించుకోటానికి అతన్ని నిజంగానే కొట్టాను. తిట్టాను. ఏడ్చాను. కావలిస్తే అతన్ని కనుక్కోండి!' అన్నది రాధ!

'సినిమా విజయవంతం కావచ్చు. కాని అలాంటి భయంకరమయిన సన్నివేశం ఉన్నదంటే నటించి ఉండేదాన్నికాదు. ఆర్టిస్టుకి సీక్వెన్స్ గురించి చెప్పకుండా అలాంటివి తీయటం నిర్మాతలకు మర్యాద కాదు.' అని కూడా అన్నదామె.

ఆమెకు తెలుసో లేదో కాని—ఆ సన్నివేశమే ఆ చిత్ర ఆర్థిక విజయానికి కారణం.

* * *

మరోక చిత్రం 'జరూరత్' పేరుత విడుదలయింది. ఇందులో 'దోరహా' కన్న ఘోరమైన సెక్సుంది. వీటిని 'న్యూవేవ్' చిత్రాలంటున్నారు. జరూరత్‌లో రెండు సన్నివేశాలు చాలా జుగుప్సాకరంగా ఉన్నాయి. మరి వీటిని సెన్సారువారు ఎలా అంగీకరించారో, అర్థం కాదు — న్యూవేవ్ చిత్రాలని లిబరల్‌గా వదిలేశారా? పార్లమెంటులో ఈ చిత్రాల మీద చర్చ జరిగింది. ప్రధాన మంత్రి వరకూ వెళ్ళింది. వెంటనే ఆ చిత్రాల మీద చర్యలు తీసుకునేదాకా వచ్చింది వ్యవహారం. ఇలాంటి అశ్లీల, అసభ్య సన్నివేశాలను సహించి ఉదార బుద్ధి కనబరచ గలిగిన సెన్సారువారు—మరి దక్షిణాది చిత్రాలలో ద్వంద్వార్థాలు లేని మామూలు సంభాషణలను పాటల్లోని కొన్ని బిట్స్‌ను కూడా తీసివేయమంటున్నారు. ఎందుకీ పక్షపాతం?

—మోహన్ కుమార్

పుస్తకాలు

సంపూర్ణ రామాయణం

చలన చిత్ర నాటకం. పాకెట్ సైజు 128 పుటలు. వెల రూ. 2—50. ప్రచురణ: యం. శేషాచలం అండ్ కో, మచిలీపట్నం మద్రాసు, సికింద్రాబాదు.

నవ్యకవిత్వంతో పాటు సంప్రదాయకవిత్వాన్నీ, నవలలతోపాటు కథలనీ, నాటకాలతోపాటు పిల్లల సాహిత్యాన్నీ విరివిగా ప్రకటిస్తూ ఉన్న ఎమెస్కో వారు సినిమా స్క్రిప్టులను కూడా ప్రచురించడం ప్రారంభించారు. వాల్మీకి మహర్షి ప్రవచించిన దివ్యగాథను శ్రీరామజననముమొదలు పట్టాభిషేకము వరకూ సర్వ సమగ్రంగా సంకల్పించి చేసిన రూపకల్పనే ఈ 'సంపూర్ణ రామాయణం.' రచన శ్రీ ఆరుద్ర, ముళ్ళపూడి వెంకటరమణగార్లది. పాటలు శ్రీ దేవులపల్లి, డా. నారాయణరెడ్డి, శ్రీ ఆరుద్ర, శ్రీ దాశరథి, శ్రీ కొసరాజుగార్లవి. పద్యాలు కీ. శే. శ్రీ పానుగంటి, శ్రీ గబ్బిట వెంకటరావు గార్లవి. క్రాంతి ప్రెస్ ముద్రణ. కథకు సంబంధించిన 8 పేజీల ఛాయా చిత్రాలు పుస్తకం మధ్య చేర్చబడ్డాయి.

సినిమా స్క్రిప్టుకీ, నాటకానికీ చాలా భేదం వుంది. నాటకం చూచినా, చదివినా రసవంతంగా వుంటుంది. సినిమా మనస్సును ఆకర్షించినట్లు స్క్రిప్టు ఆకర్షించలేదు. నాటకంలో రంగాలు పరిమితంగా ఉంటాయి. సంభాషణ లేని రంగమే ఉండదు. స్క్రిప్టులో లెక్కలేనన్ని రంగాలు! సంభాషణలు లేనివెన్నో ఉంటాయి. ఒక్క నిమిషం పాటు ఉండే రంగాలూ సినిమాలో చూపబడతాయి. ఆరీతినే సంభాషణలు లేని రంగాలతో సహా యిందులో తొంభైకి పైగానే రంగాలు ఉన్నవి.

పద్యాలను అభినయానుకూలంగాను, అర్థావబోధకంగానూ, తన ఇచ్చవచ్చినట్లు విరిచి, రాగయుక్తంగా పలికి సభ్యులను రంజింప జేసే పద్ధతిని రమారమి 45 ఏళ్ళ క్రిందట అమరజీవి శ్రీ కపిలవాయి ప్రవేశపెట్టారు. ఆయన వాటిలో కొన్ని మార్పులున్నూ చేశారు. ఆపద్ధతిలోనే యిందులోనూ 'చిదిమినపిల్లారు, స్థిరమ్మైన వడి ఎడ,' మొదలైన ప్రసిద్ధమైన పానుగంటివారి పద్యాలు, పద్యాలుగాకాకుండా కొన్ని చోట్ల బహుపాదాలతోనూ కొన్ని చోట్ల వచన రూపంగానూ వడిచాయి. ఏది పద్యమో ఏది గద్యమో తెలుసుకోవడం కష్టమే! పాటలు పాడినప్పుడే రక్తికట్టించగలవు కాని ముద్రణలో ఉన్నప్పుడు పేలవంగానే కానవస్తాయి. వాటికి రాగసూచన అయినా ఉంటే కొంత మేలు! సినిమా పాటలకు రాగనియమం లేనందున యిందులో సూచించలేదేమో అనిపిస్తుంది.

శ్లోకాలనూ, పద్యాలనూ చదివేటప్పుడు కొన్ని హ్రస్వాలను దీర్ఘాలుగా చదవడం ఉన్నది. కాని ముద్రణలో హ్రస్వాలు హ్రస్వాలుగానే ఉండడం ఉచితం. (చూ. పుట 19, 21, 69 88 మొ.)

అలాగే—పద్యం శ్లోకం పూర్తి అయ్యాక—మళ్ళీ మొదటి పదం ఎత్తుకుని చదవడం ఉన్నది. కాని ముద్రణలో ఆపదాలను చివర చేర్చనక్కర్లేదు. ఇందులో అవి—చేర్చబడి ఉన్నవి. (చూ. పుట 85, 86 మొ.)

సంస్కృత శ్లోకాలను ముద్రింప జేసేటప్పుడు ఎంతో శ్రద్ధ వుండాలి. అవి యిందులో తప్పులతో పడ్డాయి

తెలుగులో అయితే— 'మేము కోరే అలావేశం' అని అంటే అనవచ్చును గాని, సంస్కృత విషయంలో అలా చెప్పలేము కదా! శివతాండవ స్తోత్ర శ్లోకం, (పుట 12) చివర మార్పడ సరికాదు. అది సంబోధనాంతమయితే 'జయతి' అనే శ్లోకాది సున్న క్రియ కుదరదు. సంస్కృతం తెలియనప్పుడు ఇష్టం వచ్చినట్లు మార్చడం చాలా పొరపాటు. ప్రసిద్ధమైన 'గురుర్బ్రహ్మ' వంటి సామాన్య శ్లోకాలు కూడా తప్పులతోటే ఉన్నవి.


'తాటకి—మందోదరి' అనే పేర్లు తాటకి, మండోదరిగా ఇందులో మార్చబడ్డాయి. మార్పు ఎందుకు జరిగినదో? మండోదరి అని వాడుకలో ఉన్నా తాటకి అనేది వింతగా ఉన్నది. 'మేం వాడుతున్నాం' అంటే—సమాధానం అనవసరం


ఇట్టి పుస్తకంలో ముద్రారాక్షసాలు ఉన్నాయని వేరే చెప్పనక్కరలేదు. అయినా అవి చదివే వారి పఠనానికి అడ్డు వచ్చేవి కావు. ముద్రణ చాలా తొందరపాటుతో జరిగినట్లు ఉన్నది 6 ఫారాల వరకూ —అంటే 96 పుటల వరకూ పుటకు 27, 26 లైనుల చొప్పున ముద్రణ అందంగా జరిగింది. ఆతరువాత లైనులు బేగేరావు అడుగులు వేసుకుంటూ దూరదూరమై 19 నుంచి 15 లైనులు కూడా వుండే పుటలు— ఒక పద్ధతిలో లేకుండ చూడడానికి కొంత వికారంగా ఉన్నవి. దీనివల్ల పుస్తకం అందం చెడుతుంది.


సినిమా స్క్రిప్టు నాటకాలు ప్రచురించేటప్పుడు ప్రకాశకులు ఇక మీదనయినా తగిన శ్రద్ధ చూపవలసి ఉంటుంది.


— 'భాషా ప్రియ'


Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1; and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada 3. Editor : S. Sambhu Prasad.


ఏవిట్రా ఆపుస్తకం? ఎలా భోంచెయ్యాలో
రాసుందా అందులో?


స్కూల్


వారు ఎంత అస్వస్థతగా వున్నా వచ్చి
వేదికనలంకరించడం వల్ల
ఈ సభకి నిండుదనం వచ్చింది!


ఎడిటింగ్ రూము
ముడి ఫిలింను ఎలా తయారు
చెయ్యాలో నాకు తెల్సిపోయిందండి-
మామూలు ఫిలింను ముడి
వేయడమేగా!


చాలా సేపట్నుంచి
కూచో పెట్టారు మమ్మల్ని-
మీ అమ్మాయిని
చూపించండి
మరి!
ఈ పిల్లే
మా అమ్మాయండీ!


ఇది
మీలాంటి
చైన్‌స్మోకర్సుకోసం
ప్రత్యేకంగా
తయారు
చేసింది!
CIG REP.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.

